

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 113

SUNDAY Special

ఆదివారం 14-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ భారత్ సొంతం

జింబాబ్వేతో జరిగిన నాలుగో టి20 మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో విజయం సాధించిన భారత్... 3–1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. యశస్వి జైస్వాల్, శుబ్‌మన్‌గిల్ కలిసి తొలి వికెట్‌కు 156 పరుగులు జోడించి గెలిపించారు.

- వివరాలు 14లో



చాంపియన్ క్రెజికోవా

వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి బార్బరా క్రెజికోవా గెలుచుకుంది. ఫైనల్లో క్రెజికోవా 6–2, 2–6, 6–4 స్కోరుతో జాస్మిన్ పావొలిని (ఇటలీ)పై విజయం సాధించింది. క్రెజికోవా కెరీర్‌లో ఇది రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ.

- వివరాలు 14లో



ఇండియా కూటమి జోరు

ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి పది స్థానాల్లో విజయం సాధించింది.

- వివరాలు 6లో



విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

గాజాలో శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 90 మంది మృతిచెందగా 300 మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు.


- వివరాలు 6లో



పెళ్లి... యమా కాస్ట్లీ!

ప్రపంచంలో మరే ఇతర దేశంతో పోల్చి చూసినా భారత్‌లో వివాహాలు బాగా ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి.

- వివరాలు 6లో



కశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలు

జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ ఆ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్రం సవరణలు చేసింది.

- వివరాలు 6లో

హాస్టల్... హడల్!

సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న సర్కారీ హాస్టళ్లు

- శిథిల, అద్దె భవనాలతో అవస్థలు... విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు, వానొస్తే గదుల్లోకి నీళ్లు
- పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు.. పాములు, తేళ్లు, విష పురుగులు
- కంపుకొడుతున్న బాత్రూమ్‌లు.. అక్కడే గడుపుతున్న విద్యార్థులు
- వంట కోసం ఇంకా టెండర్లు పూర్తిగాక.. తిండి కోసం ఇబ్బందులు
- డైట్ చార్జీలు సరిపోక పోషకాహారం అందని దుస్థితి
- అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలంటున్న యజమానులు
- నిధులు సరిగా రాకపోవడమే సమస్య అంటున్న సంక్షేమ శాఖ అధికారులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభమై దాదాపు నెల రోజులు కావస్తోంది. చాలామంది విద్యార్థులు తిరిగి సంక్షేమ హాస్టళ్లకు చేరుతున్నారు. కానీ హాస్టళ్లు మాత్రం వసతుల లేమి, అపరిశుభ్రత, ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు, పాములు, తేళ్లు, విషపురుగులు, అపరిశుభ్రంగా మారిన టాయిలెట్లతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. నిజానికి వేసవి సెలవుల్లో దాదాపు నెలన్నర పాటు వసతి

మిగతా 2వ పేజీలో ▶



వసతి గృహంకాదు.. 'శిథిల' గృహం

నల్లగొండ జిల్లా మునుగోడులోని ఎస్సీ బాలుర హాస్టల్ దుస్థితి ఇది. భవనం శిథిలావస్థకు చేరడంతో తరచూ స్లాబ్‌పై పెచ్చులు ఊడిపడుతున్నాయి. భారీ వర్షం వస్తే కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు అంటున్నారు. హాస్టల్ పరిస్థితి బాగోలేక విద్యార్థులసంఖ్య తగ్గిందని.. గతంలో 60 మందికిపైగా ఉంటే.. ఇప్పుడు 40 మందే ఉన్నారని పేర్కొంటున్నారు.



నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులో ఉన్న గిరిజన వసతి గృహంలో టాయిలెట్ దుస్థితి ఇది.



శనివారం రాత్రి ముంబైలో అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో ముకేశ్ అంబానీ దంపతులు. - 6లో

కాంగ్రెస్‌లోకి అరికెపూడి గాంధీ

సీఎం రేవంత్ సమక్షంలో చేరిన బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

- తొమ్మిదికి చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల సంఖ్య... రేవంత్‌ను కలిసిన పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అరికెపూడికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వలస కొనసాగుతోంది. శనివారం ఉదయం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హస్తం గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరికెపూడితోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, హైదర్‌నగర్ కార్పొరేటర్లు నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నార్నె శ్రీనివాస్ తదితరులు కూడా

మిగతా 2వ పేజీలో ▶

జాబ్ కేలండర్‌కు చట్టబద్ధత



అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

- ఏటా మార్చి 31 నాటికి ఖాళీ పోస్టులు ప్రకటించి.. డిసెంబర్ 9 నాటికి భర్తీ చేస్తాం
- ప్రస్తుతం నోటిఫికేషన్ల మేరకే ఉద్యోగాల భర్తీ ఉంటుంది
- గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలిస్తే కేసులు, కోర్టుల్లో ఇబ్బంది
- కోచింగ్ సెంటర్ల వాళ్లు, రాజకీయ నేతలు అభ్యర్థులను రెచ్చగొడుతున్నారు
- 'ఫీజు' బకాయిలన్నీ వన్ టైం సెటిల్‌మెంట్‌గా ఇచ్చే యోచన చేస్తున్నాం
- ఇకపై ఏ ఏడాదికి ఆ ఏడాది రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వాలని నిర్ణయించాం
- జేఎన్టీయూలో ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో భేటీలో సీఎం వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల జాబ్ కేలండర్‌కు చట్టబద్ధత కల్పించి, అసెంబ్లీలో జాబ్ కేలండర్‌ను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఏటా మార్చి 31వ తేదీ నాటికి ఖాళీ పోస్టుల వివరాలు తెప్పించుకుంటామని.. జూన్‌లో నోటిఫికేషన్లు ఇచ్చి, డిసెంబర్ 9వ తేదీ నాటికి ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. పదేళ్లుగా నోటిఫికేషన్లు లేక, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు అన్యాయానికి గురయ్యారని.. ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తుంటే వాయిదా వేయాలంటూ కోచింగ్ సెంటర్ల యజమానులు, రాజకీయ నేతలు అభ్యర్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. శనివారం జేఎన్టీయూలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యజమానులతో 'ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత' అన్న అంశంపై సీఎం రేవంత్ ముఖాముఖి చర్చించారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

''రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని కొందరు అంటున్నారు. పరీక్షలతో ఏమాత్రం సంబంధం లేనివారు దీక్షలు చేయడం వింత. ఇటీవల దీక్ష చేసిన ముగ్గురూ ఏ పరీక్ష కూడా రాయడం లేదు. ఒకరేమో కోచింగ్ సెంటర్ యజమాని. మరొకరు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ పదవీ ఇవ్వలేదని

మిగతా 3వ పేజీలో ▶

సీఎం వ్యాఖ్యలపై నిరుద్యోగుల నిరసన 3లో

జీవో 317పై అభ్యంతరాల వెల్లువ

- ఆన్‌లైన్‌లో వినతులు సమర్పించిన 52,235 మంది ఉద్యోగులు
- అత్యధికంగా పాఠశాల విద్యాశాఖ పరిధిలో 20 వేల వినతులు
- పరిష్కారం కోసం 18న మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- ఇందుకు శాఖల వారీగా వివరాల సేకరణకు ఉపక్రమించిన జీఏడీ
- నిర్ణీత ఫార్మాట్‌ను రూపొందించి శాఖలకు పంపిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం జారీ చేసిన జీవో 317కు అనుగుణంగా చేపట్టిన ఉద్యోగ కేటాయింపులపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. జీవో 317 ద్వారా నష్టపోయిన, ఇబ్బందులకు గురైన వారికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక ఆయా ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్‌లో వినతులను స్వీకరించింది. ఈ క్రమంలో 33 ప్రభుత్వ శాఖల నుంచి ప్రభుత్వానికి ఏకంగా 52,235 మంది ఉద్యోగులు వినతులు సమర్పించడం గమనార్హం. దీన్నిబట్టి రాష్ట్రంలో నూతన జోనల్ విధానంలో భాగంగా

మిగతా 5వ పేజీలో ▶

సీనియార్టీ జాబితాపై ఆందోళనలు

- వాటిపై ఫిర్యాదుల వెల్లువ... పరిష్కరించకుండానే తుదిజాబితాలు
- ఉన్నతాధికారుల తొందరపాటుపై క్షేత్రస్థాయిలో తీవ్ర విమర్శలు
- బదిలీల ప్రక్రియకు మరింత సమయం ఇవ్వాలంటున్న ఉద్యోగులు

5లో

న్యూస్‌రీల్

ఎదగని ఆయిల్‌పామ్‌తో దగా!



ఆయిల్‌పామ్ మొక్కలు నాటి నాలుగైదేళ్లు కావొస్తున్నా కాపు రాకపోవటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్ ఫెడ్ అధికారులు నాసిరకం ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేయడంతో తాము నట్టేట మునిగామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు 15లో

అమ్మా నాన్నకే కాదు మాకూ చెప్పండి



ఎవరైనా ప్రేమ పేరిట వేధిస్తున్నా.. ఇబ్బందికరంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కూ సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

- వివరాలు 16లో

పీజీకి 'టెక్నాలజీ' లుక్



దేశవ్యాప్తంగా పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రక్షాళన దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అడుగులు వేస్తోంది. సరికొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన బోధన ప్రణాళికను కూడా సిద్ధం చేస్తోంది.

- వివరాలు 16లో

ధరలు పెరిగేలోపే 'దక్షిణం' పనులు



రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగం పనుల టెండర్ల ప్రక్రియ ముగిసేలోపు దక్షిణ భాగం భూసేకరణ ప్రక్రియ కొలిక్కి తేవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నిర్ణయానికొచ్చాయి.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



నాకు నవ్వడం అలవాటు లేదాసర్! మరీ ఇంత నిర్బంద చట్టం అని అనుకోలేదు!




పైకప్పు ఎప్పుడు ఊడిపడుతుందో.. !

విరిగిపోయిన డోర్, పెచ్చులూడుతున్న పైకప్పు జగిత్యాల జిల్లా ఎండపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్ దుస్థితికి నిదర్శనం. 32 ఏళ్ల కింద నిర్మించిన ఈ భవనం సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. తలుపులు, కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 40 మంది విద్యార్థులు ఉండగా.. ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.

● పెద్దపల్లి జిల్లా అమర్‌నగర్, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టళ్ల పరిస్థితీ దారుణంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ఊడిపోయిన డోర్లను అడ్డుపెట్టుకుని బాత్రూమ్‌కు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు.

ఇవీ విద్యార్థుల పరుపులు!



ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 73 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌లోని ఇనుప మంచాల కాళ్లు వంగిపోయాయి. పరుపులు చిరిగిపోయాయి. కొన్ని పరుపులకు కేవలం స్పాంజ్ మిగిలింది. వాటిపైనే పడుకోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

మంచినీటికీ ఇబ్బందే..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హస్తినపురంలో ఎస్సీ హాస్టల్‌లో పనిచేయని ఆర్వో ప్లాంట్ ఇది. ఇందులో 40 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌లో టాయిలెట్లకు డోర్లు సరిగా లేవు. డ్రైనేజీ సరిగా లేక ఆవరణలో మురుగు నీరు చేరి దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు చెప్తున్నారు.



ఒక్కదానికీ తలుపు లేదు.. టాయిలెట్‌కెళ్లేదెట్లా?

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడ ఎస్టీ హాస్టల్‌లో తలుపులే లేని టాయిలెట్లు ఇవి. 80 మంది విద్యార్థులున్న ఈ వసతిగృహంలో గదుల కిటికీలు, తలుపులు పాడైపోయాయి. నీటి సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపల్ ట్యాంకర్ వస్తేనే నీళ్లు. లేకుంటే స్నానాలు చేసే పరిస్థితి ఉండదని విద్యార్థులు వాపోతున్నారు. దీనికి సమీపంలోనే ఉన్న ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలదీ ఇదే దుస్థితి. దోమలతో ఇబ్బందిపడుతున్నామని.. పురుగుల అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని అక్కడి విద్యార్థులు చెప్తున్నారు.



హాస్టల్... హడల్!

▶ మొదటి పేజీ తరువాయి

గృహాలన్నీ మూసి ఉన్నాయి. తిరిగి తెరిచే నాటికి వాటిని చక్కదిద్దాల్సిన సంక్షేమ శాఖలు ఏమాత్రం పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. మరోవైపు హాస్టళ్లలో వంట కోసం టెండర్లు పూర్తిగాకపోవడం, డైట్ చార్జీలు సరిపోకపోవడంతో విద్యార్థులకు సరైన ఆహారం అందని దుస్థితి నెలకొంది.

విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 2,020 వసతిగృహాలు ఉన్నాయి. అందులో 497 పోస్టుమెట్రిక్, 1,523 ప్రీమెట్రిక్ హాస్టళ్లు. వీటిలో సుమారు 3.30 లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ప్రీమెట్రిక్ హాస్టళ్లలో పదోతరగతి పూర్తయిన విద్యార్థులు వెళ్లిపోవడం, కింది తరగతుల్లో కొత్త చేరికలు నమోదవడం జరుగుతోంది. పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో కూడా చేరికలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వృత్తి విద్యా కోర్సులైన పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజనీరింగ్ తదితర ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.

సంక్షేమ శాఖల వారీగా వసతి గృహాలివీ..

శాఖ	పోస్టుమెట్రిక్	ప్రీమెట్రిక్
ఎస్సీ	210	650
ఎస్టీ	119	511
బీసీ	168	362
మొత్తం	497	1,523

ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు అడ్మిషన్లు కొనసాగనున్నాయి. ఇలా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. వసతుల లేమి మాత్రం సమస్యగా మారింది.

పారిశుధ్యానికి బడ్జెట్ ఏదీ?

శాశ్వత భవనాలున్న సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వసతిగృహాల్లో పారిశుధ్య పనులు, మరమ్మతుల కోసం కొంతమేర నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ ఆ నిధులు రాకపోవడంతో అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. కనీసం హాస్టళ్ల పరిసరాలను సైతం శుభ్రం చేయలేదు. చాలా వసతిగృహాల పరిసరాలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వాటిలో పాములు, తేళ్లు, విష పురుగులు చేరుతున్నాయి. వానలు కురుస్తుండటంతో ఆవరణలోకి, గదుల్లోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విరిగిన కిటికీలు, తలుపులతో వాన నీళ్లు గదుల్లోకి పడుతున్నాయి.

డైట్ చార్జీలు సరిపోక..

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పదేళ్ల కిందటి డైట్ చార్జీలే కొనసాగుతున్నాయి. మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.950.. ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,100, ఇంటర్ నుంచి డిగ్రీ విద్యార్థులకు రూ.1,500 చొప్పున ప్రభుత్వం డైట్ చార్జీల కింద చెల్లిస్తోంది. అడ్డగోలుగా పెరిగిన నిత్యావసరాల ధరలతో ఈ చార్జీలు ఏ మూలకూ సరిపోవడం లేదని వసతిగృహాల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డైట్ చార్జీలను కనీసం 25శాతం పెంచాల్సిన అవసరం ఉందని గత ఏడాది మంత్రుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని.. కానీ ఇప్పటివరకు చార్జీలు పెంచలేదని గుర్తు చేస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో.. విద్యార్థులకు తగిన పోషకాహారం అందే పరిస్థితి లేకుండా పోయిందని అంటున్నారు.

అద్దె భవనాలతో మరింత గోస

రాష్ట్రంలో 858 సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేక, కొత్తవి నిర్మించక ఏళ్లకేళ్లు అలాగే కొనసాగుతున్నాయి. వాటికి చెల్లించాల్సిన అద్దె బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.12 కోట్ల మేర బకాయిలున్నట్లు అధికారిక గణాంకాలే చెప్తున్నాయి. కొన్ని హాస్టల్ భవనాలకు ఏడాదికిపైగా బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలంటూ యజమానులు ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఈ పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు.



నీరు నిలిచి.. దోమలు పెరిగిపోయి..

సిద్దిపేట జిల్లా బెజ్జంకి బీసీ హాస్టల్ ఆవరణలో నిలిచిన నీరు, పిచ్చిమొక్కలు ఇవి. దీనితో విష పురుగులు, దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దానికితోడు దుర్వాసన. విపరీతంగా ఇబ్బందిపడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

ఇక్కడ టాయిలెట్ కనిపిస్తోందా?

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్ల దుస్థితి ఇది. ఏళ్లుగా మరమ్మతులు లేక నిరుపయోగంగా మారాయి. చుట్టూ పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లు పెరిగాయి. హాస్టల్‌లోని విద్యార్థులు టాయిలెట్ కోసం ఆరుబయటకే వెళ్లాల్సిన పరిస్థితి.





పురుగులు పట్టిన బియ్యంతో భోజనం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో పురుగులు పట్టిన బియ్యం ఇది. వంటచేసేవారు బియ్యాన్ని కడిగి వండుతున్నా.. అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థుల వాపోతున్నారు. హాస్టల్‌లో ఫ్యాన్లు కూడా సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు.

పిచ్చిమొక్కలు, అపరిశుభ్రత మధ్య..

సంగారెడ్డిలోని నలందనగర్ బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో నిలిచి ఉన్న మురుగునీరు ఇది. దీనితో దోమల బాధ నెలకొంది. విష జ్వరాలు ప్రబలుతున్న సమయంలో ఇలాగైతే ఎలాగన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



పాములు, తేళ్ల సమస్యతో..

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థి మొల్లం శ్యాంకుమార్ గత వారం అనుమానాస్పదంగా మరణించాడు.టాయిలెట్ కోసం రాత్రిపూట బయటికి వెళ్లి, వచ్చిన శ్యాంకుమార్.. వాంతులు చేసుకుని, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కాసేపటికే కన్నుమూశాడు. టాయిలెట్ సమీపంలోని పొదల్లో తరచూ పాములు, తేళ్లు కనిపించేవని.. అవి కుట్టడం వల్లే శ్యాం మరణించి ఉంటాడని విద్యార్థులు అంటున్నారు.

పాడుబడినట్టుగా కనిపిస్తున్న ఈ భవనం సిరిసిల్ల జిల్లా కేంద్రం సుందరయ్యనగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్. ఇది అద్దె భవనం. అదీ పాత భవనం కావడంతో వెలుతురు, గాలి సరిగా రాని పరిస్థితి. చిన్నపాటి వర్షానికే గదుల్లో నీరు కారుతోంది.



కంపు భరించలేకపోతున్నాం..



హాస్టల్‌లో వండుతున్న అన్నంలో రాళ్లు వస్తున్నాయి. నీళ్ల నీళ్లుగా కూరలు వండుతున్నారు. బాత్రూంలను సరిగా మెయింటైన్ చెయ్యక దుర్వాసన వస్తోంది. కంపు భరించలేకపోతున్నాం. భవనం గోడలు పగుళ్లు ఇస్తున్నాయి.
– చిట్టబోయిన రాకేశ్, డిగ్రీ ఫస్టియర్, సిరిసిల్ల బీసీ హాస్టల్

యూనిఫామ్‌లు ఇవ్వలేదు..



మాకు ఏటా స్కూల్‌లో 2 జతల యూనిఫారాలు, హాస్టల్‌లో 2 జతల యూనిఫారాలు, ఒక జత నైట్ డ్రెస్ ఇచ్చేవారు. ఈసారి మాకు స్కూల్‌లో ఒకే ఒక్క చొక్కా ఇచ్చారు. హాస్టల్‌లో ఏవీ ఇవ్వలేదు. యూనిఫామ్‌లో బడికి రావాలని టీచర్లు అంటున్నారు. ఏం చేయాలో తెలియట్లేదు.
– ఆంజనేయులు 9వతరగతి, చిన్నశంకరంపేట ఎస్సీ హాస్టల్

కాలేజీ విద్యార్థులకూ దుప్పట్లు ఇవ్వాలి

స్కూళ్లలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న వారికే ప్రభుత్వం దుప్పట్లు ఇస్తోంది. ఇంటర్, డిగ్రీ చదువుతూ హాస్టళ్లలో ఉన్నవారికీ దుప్పట్లు అందించాలి. చలితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలి.
– రాజేశ్, గజ్వేల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థి



● ఈ చిత్రంలో అపరిశుభ్ర వాతావరణంలో కనిపిస్తున్నది పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని మార్కండేయకాలనీలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ వసతి గృహంలో 30మంది విద్యార్థులు ఉంటున్నారు. బాత్రూంలు, భవనాన్ని క్లీన్ చేయడానికి మనుషుల్లేక అంతా అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ఇక్కడ వంటకు సంబంధించిన టెండర్లు ఇంకా పూర్తికాలేదని, వంట చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి 10 నెలలుగా జీతం రాక కలెక్టర్ ఆఫీస్ చుట్టూ తిరుగుతోందని.. దాంతో తామే రోజూ రూ.300 ఖర్చుపెట్టి కూరగాయలు తెప్పిస్తూ, వంట కూడా చేస్తూ.. విద్యార్థులకు తిండి పెడుతున్నామని హాస్టల్ వార్డెన్ దప్పు రవికుమార్ చెప్పున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే విద్యార్థులకు సరైన భోజనం దొరుకుతుందని అంటున్నారు.

అద్దె భవనంలో బాలికల ఎస్సీ వసతి గృహం

హుజూరాబాద్‌లోని ఎస్సీ బాలుర-1 హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు ఇవి. ఇందులో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ వంట మనిషి, వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు రాలేదు.

మైనారిటీ గురుకులాల్లో బదిలీల నిలిపివేత

తదుపరి విచారణ వరకు స్టే ఇచ్చిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ అధీనంలోని సంస్థల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బదిలీల మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణ వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. గురుకుల సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా జూలై 6న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హేమలత సహా మరికొందరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. గురుకుల సిబ్బందిని తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ సర్వీస్ నిబంధనల పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం 2022లో ఉత్తర్వులు ఇచ్చిందని పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించిందని, స్టే ఉండగా బదిలీ మార్గదర్శకాలు జారీ చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. దీనిపై వివరణ ఇవ్వాలని గురుకులాల కార్యదర్శిని ఆదేశిస్తూ, బదిలీ మార్గదర్శకాలను 18 వరకు నిలిపివేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఆ ఉత్పత్తులు ఔషధాల పరిధిలోకే..

సాక్షి, హైదరాబాద్: నవరతన్ ఆయిల్, గోల్డ్ టర్మరిక్ ఆయుర్వేదిక్ క్రీమ్, బోరోప్లస్ యాంటీసెప్టిక్ క్రీమ్, బోరోప్లస్ ప్రిక్లీ హీట్ పౌడర్, సోనాచాందీ చవన్‌ప్రాష్ వంటి ఆయుర్వేద ఉత్పత్తులు ఔషధాల పరిధిలోకే వస్తాయని పాతికేళ్లకుపైగా ఉన్న వివాదంలో హైకోర్టు తీర్పునిచ్చింది.సేల్స్ ట్యాక్స్ అధికారులు వీటిని సౌందర్య సాధనాల కింద పేర్కొనగా, హిమాని లిమిటెడ్, ఇమామి లిమిటెడ్ అప్పటి సేల్స్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. బోరోప్లస్ యాంటిసెప్టిక్ క్రీమ్, బోరోప్లస్ ప్రిక్లీ హీట్ పౌడర్, సోనాచాందీ చవన్‌ప్రాష్ ఔషధాల పరిధిలోకి వస్తాయని, మిగిలిన రెండు సౌందర్య సాధనాలంటూ ఉత్తర్వులు వెలువరించింది. ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ 2004లో అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు పూర్తికావడంతో.. ఆ ఉత్పత్తులు ఔషధాల పరిధిలోకే వస్తాయని ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది.

‘డబుల్’ పెన్షన్‌పై ఆరా!

● రికవరీ ఆదేశాలపై సర్కారు తీరును నిరసిస్తూ కేటీఆర్ పోస్ట్.. రంగంలోకి అధికారులు
● మల్లమ్మ నుంచి పెన్షన్ వివరాలు సేకరించిన సెర్ప్ సిబ్బంది

చుంచుపల్లి/సాక్షి, హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగులు, వారి మరణానంతరం కుటుంబ సభ్యులకు వచ్చే పెన్షన్ తీసుకుంటూ.. ఆసరా పింఛన్ సైతం పొందుతున్న వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇలా డబుల్ పెన్షన్లు పొందుతున్న సుమారు 200 మందిని సెర్ప్ సిబ్బంది గుర్తించి నోటీసులు అందజేశారు. చుంచుపల్లి మండలం బాబూ క్యాంపునకు చెందిన దాసరి మల్లమ్మ.. కూతురు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ చనిపోవడంతో వచ్చే ప్రభుత్వ పెన్షన్‌తో పాటు ఆసరా పెన్షన్ కూడా పొందుతున్నట్లు గుర్తించిన అధికారులు రికవరీ నోటీసులు జారీ చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుంది.. అనే సామెతను ఉదహరిస్తూ.. ‘కొత్తగా అనేక పథకాలు ఇస్తామని, ప్రస్తుత సంక్షేమ పథకాలకు ఇచ్చే డబ్బును పెంచుతామని దొంగ హామీలతో గద్దె నెక్కిన రేవంత్ సర్కార్.. ఇప్పుడు లబ్ధిదారుల నుంచి సొమ్మును వెనక్కి లాక్కునే వింత చేష్టలు మొదలుపెట్టింది’అని ఆరోపించారు. సాంకేతిక కారణాలు చూపిస్తూ వేలాది మంది ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు డబ్బులు వెనక్కి పంపాలని ప్రభుత్వం నోటీసులు జారీచేస్తోందని, దాసరి మల్లమ్మకు ఆసరా కింద వచ్చిన రూ.1.72 లక్షలు కూడా తిరిగి చెల్లించాలని నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధురాలికి నోటీసులు జారీ చేసి, కేసీఆర్ సర్కారు ఇచ్చిన పెన్షన్ సొమ్మును లాక్కోవడానికి ప్రయత్నించడం రేవంత్ ప్రభుత్వ అమానవీయ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఈ పోస్ట్ నేపథ్యంలో విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన సూచనల మేరకు సెర్ప్ సిబ్బంది మల్లమ్మ ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమె పొందుతున్న పెన్షన్ వివరాలు సేకరించారు. ఈ విషయమై డీఆర్‌డీఓ విద్యాచందనను సంప్రదించగా.. ఆమె రెండు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించామని, రికవరీపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపారు.



దాసరి మల్లమ్మ

‘డబుల్’వల్లనే మల్లమ్మ పింఛన్ నిలిపివేత

● కేటీఆర్ పోస్టును తప్పుపట్టిన సర్కార్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలికి ఆసరా పెన్షన్ కింద ఇచ్చిన డబ్బులపై ప్రభుత్వం రికవరీ నోటీసు ఇచ్చిందని.. ఇది అమానవీయమైన చర్య అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేయడాన్ని ప్రభుత్వం శనివారం ఒక ప్రకటనలో తప్పు పట్టింది. ఈ వ్యవహారం కూడా డబుల్ పెన్షన్ల జాబితాలోనే ఉందని ప్రకటించింది. దాసరి మల్లమ్మ కూతురు దాసరి రాజేశ్వరి దంతుకూరులో ఏఎన్‌ఎంగా పని చేసేవారని, 2010లో రాజేశ్వరి మరణించగా ఆమెకు పెళ్లి కాకపోవటంతో డిపెండెంట్‌గా మల్లమ్మకు రూ.24,073 ఫ్యామిలీ పెన్షన్ కింద ప్రతి నెలా చెల్లిస్తున్నామని, మరోవైపు ఆపన్నులకు ఇచ్చే ఆసరా పెన్షన్ కూడా ప్రతినెలా ఆమెకు అందుతున్నట్లు ఇటీవలి సర్వేలో తేలిందని ప్రభుత్వం పేర్కొంది. అందుకే జూన్ నెల నుంచి ఆమెకు ఇచ్చే ఆసరా పెన్షన్‌ను అక్కడి జిల్లా అధికారులు నిలిపివేశారని స్పష్టం చేసింది.

కాంగ్రెస్‌లోకి అరికెపూడి గాంధీ

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ తీర్థం పుచ్చు కున్నారు. అరికెపూడి గాంధీ చేరికతో బీఆర్‌ఎస్‌ను వీడిన ఎమ్మెల్యే సంఖ్య 9కి చేరింది.

సీఎంను కలసిన పటాన్‌చెరు ఎమ్మెల్యే

పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. దీంతో మహిపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిపోతున్నట్టు ప్రచారం జరిగింది. కానీ మహిపాల్‌రెడ్డి సీఎంను కలసి పలు అంశాలపై చర్చించారని.. ఇంకా కాంగ్రెస్‌లో చేరలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

29కి తగ్గిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య

మొన్నటి శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక తొమ్మిది మంది ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), కాలె యాదయ్య (చేవెళ్ల), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), సంజయ్‌కుమార్ (జగిత్యాల), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి) కాంగ్రెస్‌లో చేరారు. దీనితో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 29కి తగ్గింది. ఇదే సమయంలో కాంగ్రెస్ బలం 64 నుంచి 74కి పెరిగింది. మిత్రపక్షం సీపీఐతో కలిపి 75 అయింది.

బీఆర్‌ఎస్‌ను వీడను.. కేసీఆర్ వెంటే ఉంటా: ముఠా గోపాల్

ముషీరాబాద్ (హైదరాబాద్): తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బీఆర్‌ఎస్‌ను వీడబోనని, కేసీఆర్ వెంటే ఉంటానని ప్రకటించారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో ఆయన మాట్లాడారు. ‘‘టీడీపీ ఆవిర్భావం నుంచి 2014 దాకా ఆ పార్టీలో అనేక హోదాల్లో కొనసాగాను. నా సహచరులు, జూనియర్లు కూడా ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు. నాకు అవకాశం రాలేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ముషీరాబాద్ నియోజకవర్గాన్ని పొత్తుల్లో భాగంగా జనతాదళ్, బీజేపీ, టీఆర్‌ఎస్, సీపీఎంలకే టీడీపీ కేటాయించింది. నాకు చాన్స్ ఇవ్వలేదు. అదే నేను 2014లో టీఆర్‌ఎస్‌లో చేరిన వెంటనే కేసీఆర్ టికెట్ ఇచ్చి గౌరవించారు. అప్పుడు ఓడిపోయినా.. 2018లో, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మకంతో టికెట్ ఇచ్చారు. రెండు సార్లూ గెలిచా. 30ఏళ్లు పనిచేసిన టీడీపీలో దక్కని ఎమ్మెల్యే అవకాశం.. టీఆర్‌ఎస్‌లో వచ్చింది. నాకు రాజకీయ భిక్షపెట్టిన కేసీఆర్‌ను ఎలా వదులుకుంటాను? కాంగ్రెస్‌లో చేరినా నాకు వచ్చేదేముంది? బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తి లేదు..’’ అని ముఠా గోపాల్ తెలిపారు.

బీజేపీలో చేరిక అభూత కల్పన: వద్దిరాజు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తాను బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని.. ఆ దిశగా జరుగుతున్న ప్రచారమంతా అభూత కల్పన అని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాను బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకు సాగుతా నన్నారు.

‘మహాత్మా’.. వసతులేవి ?

జ్యోతిబా పూలే పాఠశాల ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన

వైరారూరల్ : మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల, కళాశాలలో సరైన వసతులు లేవంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. రెండో శనివారం కావడంతో తమ పిల్లలను కలిసేందుకు వారు కళాశాలకు రాగా.. కనీస సౌకర్యాలు లేవంటూ విద్యార్థినులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు వైరా – జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి 2 గంటలు ఆందోళన చేశారు. పక్కా భవనాలు లేకపోవడంతో రెబ్బవరంలో మూతబడిన ప్రైవేటు పాఠశాల భవనాన్ని అద్దెకు తీసుకొని అందులో కొనసాగిస్తున్నారు. ముసలిమడుగు ఎంజీపీ గురుకుల విద్యార్థులు 440 మంది, వైరా ఎంజీపీ విద్యార్థులు 310 మంది.. రెండూ కలిపి 750 మంది విద్యార్థినులు ఈ భవనంలోనే ఉంటున్నారు. అయితే భవన ఆవరణలో 22 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. పరిమితికి మించి విద్యార్థినులు ఉండడంతో ఇబ్బంది అవుతోందని గురుకులాల నిర్వాహకులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పట్టించుకోలేదు. దీంతో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. రెండు గంటలు వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లడంతో ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ వచ్చి ఆందోళన విరమింపజేసేలా ప్రయత్నించారు. కానీ వసతుల కల్పనపై అధికారులు హామీ ఇవ్వాల్సిందేనని తల్లిదండ్రులు పట్టుబట్టడంతో ఇన్‌చార్జ్ డిప్యూటీ వార్డెన్ సుధ అక్కడకు చేరుకొని నెల రోజుల్లో మరో కొత్త భవనంలోకి మారుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వైరా-జగ్గయ్యపేట రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

గురుకుల పాఠశాల విద్యార్థులకు పాముకాటు ?

గద్వాల జిల్లా ఆస్పత్రిలో చికిత్స..ప్రాణాపాయం లేదన్న వైద్యులు

గద్వాల రూరల్: నలుగురు విద్యార్థులు పాము కాటేసిందని చెప్పడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటన గద్వాల జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణానికి చెందిన వీరేంద్రచారి, రాజోలి మండలం తనగల గ్రామానికి చెందిన అర్జున్‌కుమార్, కేటీదొడ్డి తూర్పుతండాకు చెందిన సంతోష్‌నాయక్, గద్వాల మండలం గోన్‌పాడు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ జిల్లాకేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే వీరిని శుక్రవారం చైల్డ్ ప్రొటెక్షన్, కార్మికశాఖ అధికారులు గుర్తించి.. ఆర్టీఓ కార్యాలయం వెనకాల ఉన్న ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. వీరి తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలనుకున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నలుగురు విద్యార్థులు మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లారు. వీరిలో ఇద్దరు విద్యార్థుల కాళ్లపై పాము వెళ్లగా.. వారు తోసేయడంతో మరో ఇద్దరిపై పడింది. కాళ్లపై పాము వెళ్లడంతో కాటేసిందని ఇద్దరు విద్యార్థులు భయపడ్డారు. వెంటనే వారు టీచర్లకు చెప్పగా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురిని గంటసేపు అబ్జర్వేషన్‌లో ఉంచారు. వారిలో సంతోష్‌నాయక్, వీరేంద్రచారి పాముకాటుకు గురికాలేదని డిశ్చార్జ్ చేశారు. అర్జున్‌కుమార్, అనిల్‌కుమార్‌లను ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరికి కూడా పాము కాటు వేసినట్టు ఎలాంటి గాయాలు లేకపోయినా, 48 గంటల పాటు ఆస్పత్రిలో ఉంచి టెస్టింగ్ డోస్ చికిత్స కొనసాగిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌క్రాంతి ‘సాక్షి’కి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్, అర్జున్‌కుమార్

క్లుప్తంగా...

నిమ్స్ నుంచి జడ్సన్ డిశ్చార్జ్

లక్డీకాపూల్ (హైదరాబాద్): ఆరోగ్యం కుదుట పడటంతో బక్క జడ్సన్‌ను నిమ్స్ వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పది రోజులుగా తెలంగాణ నిరుద్యోగుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జడ్సన్ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం సాయంత్రం ఆయనను నిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జడ్సన్‌ను తెలంగాణ ఉద్యమ నాయకులు, నిరుద్యోగులు పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తుందని, వారాల తరబడి నిరుద్యోగులు పోరాడుతున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో చలనం లేదని జడ్సన్ మండిపడ్డారు. నిరుద్యోగుల సమస్యతో బీఆర్ఎస్ పార్టీ గతంలో రాజకీయ పబ్బం గడుపుకుని, ఇప్పుడు చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను, విద్యార్థులను కూడగట్టి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని పలువురు ఉద్యమ నేతలు హెచ్చరించారు.

ప్రభుత్వాలనే మార్చేసే బీజేపీ నీతులు చెప్పడమా?

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ మూకుమ్మడి ఫిరాయింపులతో ఎన్నికైన ప్రభుత్వాలను కుప్పకూల్చిన చరిత్ర బీజేపీదని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫిరాయింపులపై నీతులు చెప్పడం శోచనీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పాటైన 10 ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీదని, కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి ఈ చరిత్ర తెలియదా అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వాలనే మార్చేసి సుప్రీంకోర్టుతో చీవాట్లు కూడా తిన్నారన్నారు. ఈడీ, సీబీఐ, ఇన్‌కంట్యాక్స్ వంటి సంస్థలతో బెదిరించి ఎమ్మెల్యేలను చేర్చుకుని ప్రభుత్వాలను పడగొట్టారని విమర్శించారు. నాలుగు రోజుల క్రితం మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి వర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్ నివాస్ రావత్‌ను చేర్చుకున్నారని ఇప్పటి వరకు ఆ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదన్నారు. 2014 లో టీడీపీ ఎమ్మెల్యే తలసాని, 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కేసీఆర్ మంత్రివర్గంలో చేర్చుకున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని ఈ సారూప్యతతో తెలుస్తుందన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ ఢిల్లీలో బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలోనే బీఆర్ఎస్ రాజ్యసభ పక్షం బీజేపీలో విలీనం అవుతుందని చెప్పారు.

సమగ్ర కులగణనకు పది జిల్లాల్లో పాదయాత్ర: జాజుల



సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు సంక్షేమ ఫలాలు దక్కాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు సమగ్ర కులగణన సాధన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18రోజుల పాటు సాగే ఈ యాత్ర 10 జిల్లాల గుండా సాగుతుందన్నారు. ఈ నెల 14న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని, 31న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

పార్టీ ఫిరాయింపులపై బాధ లేదు: మాజీ ఎంపీ వినోద్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి ఇతర పార్టీల్లో చేరినా బాధపడాల్సిన అవసరం లేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు అక్బర్ హుస్సేన్, కళ్యాణ్‌తో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారిన ఎమ్మెల్యేల పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. పార్టీ అధినేత కేసీఆర్ ఇకపై కొత్తతరం నేతలను ప్రోత్సహిస్తారని వినోద్ కుమార్ వెల్లడించారు.

అన్ని వర్సిటీలలో ఫ్యాకల్టీని నియమించాలి

సాక్షి, హైదరాబాద్: అన్ని వర్సిటీలలో ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ చేయాలని, వర్సిటీ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు ప్రయోజనాలు కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(టౌటా) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని టౌటా అధ్యక్షులు జి.మల్లేశం, సీహెచ్. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చలమల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు సరస్వతమ్మ శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ పదవీ విరమణను 65 ఏళ్లకు పెంచాలని, అన్ని విశ్వవిద్యాలయాలకు ఆర్ఎస్‌పీ-2016(యూజీసీ) పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు.

ధరలు పెరిగేలోపే ‘దక్షిణం’ పనులు

- ‘రీజినల్ రింగురోడ్డు’లో కీలక పరిణామం
- ఉత్తరభాగం పనులు ప్రారంభం కాగానే.. భూముల ధరలు పెరుగుతాయని అంచనా
- దక్షిణభాగం ఆలస్యమైతే.. పరిహారం భారీగా పెంచాలనే డిమాండ్ వచ్చే పరిస్థితి
- కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా సానుకూల స్పందన

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం పనుల టెండర్ల ప్రక్రియ ముగిసేలోపు దక్షిణ భాగం భూసేకరణ ప్రక్రియ కొలిక్కి తేవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నిర్ణయానికొచ్చాయి. టెండర్లు కాగానే ఉత్తరభాగం పనులు మొదలవుతాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరుగుతాయి. దీని ప్రభావం దక్షిణ భాగంపై కూడా పడుతుంది. అక్కడా భూముల ధరలు పెరుగుతాయి. అప్పుడు, దక్షిణభాగంలో తమకు ఇచ్చే పరిహారం చాలదని, దానిని పెంచాలంటూ భూనిర్వాసితుల నుంచి డిమాండ్ వస్తుందన్న సంకేతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. దీంతో దక్షిణభాగంలో జరుగుతున్న జాప్యాన్ని నిలవరించి..అక్కడ భూసేకరణ ప్రక్రియ వేగిరం చేయాలని నిర్ణయించాయి. ఈ విషయాన్ని తొలుత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. దీనికి తాజాగా కేంద్రం కూడా సమ్మతించినట్టు తెలిసింది.

పనులకు అడ్డంకిగా మారుతుందని..

ప్రస్తుతం ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో గ్రామాల వారీగా అవార్డులు పాస్ చేస్తారు. దీంతో భూనిర్వాసితుల ఖాతాలో పరిహారం జమ అవుతుంది. సంగారెడ్డి పట్టణ సమీపంలోని కొన్ని ప్రాంతాలు, యాదాద్రి ఆర్డీఓ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో నిర్వాసితుల నుంచి ప్రతిఘటన ఎదురుకాగా, మిగతా ప్రాంతాల్లో సాఫీగానే సాగుతోంది. ఉత్తర భాగానికి సంబంధించి రూ.5200 కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అంచనా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చొప్పున భరించాల్సి ఉంది. ఉత్తర భాగంతో పోలిస్తే, దక్షిణ భాగంలో భూముల ధరలు తక్కువగా ఉన్నాయి. దాని నిడివి మాత్రం ఎక్కువ. దీంతో అక్కడ దాదాపు రూ.6000 కోట్ల వరకు పరిహారం రూపంలో చెల్లించాల్సి ఉంటుందని అంచనా. మరో రెండు మూడునెలల్లో ఉత్తర భాగం టెండర్ల దశకు చేరుకుంటుంది. కానీ, దక్షిణభాగం విషయంలో ఇంకా అలైన్‌మెంట్ కూడా ఖరారు కాలేదు. ఉత్తర భాగం టెండర్లు పూర్తయ్యేనాటికి స్థానికంగా భూముల ధరలు భారీగా పెరుగుతాయన్న అంచనా ఉంది. పనుల్లో జాప్యం జరుగుతున్నా.. దక్షిణ భాగంలో కూడా రింగ్ నిర్మాణం ఎలాగూ ఖరారైనందున, స్థానికంగా కూడా భూముల ధరలు అప్పటికి భారీగా పెరుగుతాయి. దీంతో అప్పటి భూముల ధరలకు తగ్గట్టుగా పరిహారం మొత్తం పెంచాలని దక్షిణ భాగం నిర్వాసితులు డిమాండ్ చేసే పరిస్థితి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీంతో ఉత్తర భాగంలో భూముల ధరలు పెరిగేలోపు దక్షిణ భాగంలో భూసేకరణ ప్రక్రియ కొలిక్కి తేవాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. భూ పరిహార భారం పెరిగితే, నిర్మాణ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. రూ.17 వేల కోట్లతో రెండు భాగాలు పూర్తి చేయాలని తొలుత లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పుడు నిర్మాణ వ్యయం రూ.35 వేల కోట్లకు చేరేలా కనిపిస్తోంది. పరిహారం మరింత పెంచాల్సి వస్తే నిర్మాణ వ్యయం మరింత పెరుగుతుంది. దీంతో మరో మూడు నెలల్లోగా దక్షిణభాగంలో కూడా భూసేకరణ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



కాలేజీల్లో మోరల్ పోలీసింగ్

పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- కేరళలో మాదిరి ఇక్కడ కూడా ఏర్పాటు
- సమాజంలో పెడధోరణులకు సాంకేతికత ఓ కారణం
- పిల్లలకు మొబైల్‌ఫోన్లు దూరంగా ఉంచితే చాలా సమస్యలు నివారించవచ్చు
- నియోజకవర్గానికో స్టేడియం ఏర్పాటు చేస్తామని వెల్లడి



సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు డీజీపీ జితేందర్, సీపీ శ్రీనివాస్‌రెడ్డి, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: కళాశాలల్లో మోరల్ పోలీసింగ్‌ను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అన్ని ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల్లో కేరళ మాదిరిగా మోరల్ పోలీసింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరిస్తే.. దుష్ఫలితాలను నివారించుకోవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులను వలంటరీ పోలీసింగ్‌కు కోసం వినియోగించుకోవాలని సూచించారు. శనివారం జేఎన్‌టీయూలో వలంటరీ పోలీసింగ్ వ్యవస్థపై నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమాజంలో పెడధోరణులు పెరగడానికి సాంకేతికత ఓ కారణమన్నారు. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా పెడితే.. చాలా వరకు సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబాలు చిన్నారుల మానసిక దృఢత్వానికి తోడ్పతాయని, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడమే చిన్నారుల మానసిక బలహీనతలకు కారణమని వ్యాఖ్యానించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..

డ్రగ్స్ నిర్మూలనపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మత్తు పదార్థాలతో జరిగే నష్టాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో పాఠ్యాంశంగా బోధించడంతోపాటు నైతిక పోలీసింగ్‌ను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. బడులు, కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ అవసరం ఎంతో ఉందని తెలిపారు. వారితో పోలీసులకు సమాచారం చేరవేసే వ్యవస్థను తయారు చేసుకుంటే.. తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చవచ్చని చెప్పారు. డ్రగ్స్‌పై ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందంటూ ‘మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి’అని విజ్ఞప్తి చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్ణయాలు

తమ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించిందని, అందుకోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యతని, ప్రజా సమస్యలపై ఫోకస్‌గా పనిచేయడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. సమస్యలకు భయపడి పారిపోకుండా, పోరాడాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీకైనా, బిల్ గేట్స్‌కైనా, రేవంత్ రెడ్డికైనా ఉండేది రోజుకు 24 గంటలేనని, రోజుకు 16 గంటలు మీరు ఎంత ఫోకస్‌గా పనిచేస్తే అంత బాగా మీ లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు డీజీపీ డాక్టర్ జితేందర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

నేడు లష్కర్‌గూడకు సీఎం రేవంత్‌రెడ్డి

- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం



సభా ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అబ్దుల్లాపూర్‌మెట్: కల్లు గీత కార్మికులను ప్రమాదాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం రూపొందించిన కాటమయ్య రక్షణ కవచాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేయనున్నారు. 2,500 మంది గీత కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని అధికారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంకతో కలిసి శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రంగారెడ్డి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రక్షణ కవచాలు పంపిణీ చేసే సభాస్థలం అందరినీ ఆకట్టుకుంటోంది.

అమృత్ టెండర్లలో రూ.1,200 కోట్ల అవినీతి

నిరూపించడానికి సిద్ధం.. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ పథకం పనుల టెండర్లలో జరిగిన అవినీతిని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర ప్రభుత్వానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం శాసనసభలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పన కోసం కేంద్రం ప్రభుత్వం ఇచ్చే అమృత్ నిధుల కింద పనులకు గ్లోబల్ టెండర్లు పిలవకుండానే స్థానికంగా టెండర్లు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఇవే పనులకు గ్లోబల్ టెండర్లు పిలిస్తే 30% తక్కువకు పనులు చేసేందుకు చాలా కంపెనీలు ముందుకి వస్తాయని చెప్పారు. ఈ టెండర్లలో రూ.1,200 కోట్ల కుంభకోణం జరిగిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కాంట్రాక్టర్లు తక్కువ ధరకే పనులు చేయడానికి ముందుకు రాకపోతే తాను రాజీనామాకు సిద్ధమన్నారు. అవినీతి టెండర్లు రద్దు చేసి.. గ్లోబల్ టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే.. బీజేపీ తరఫున ఆందోళన చేస్తామన్నారు.

స్థానిక సమరానికి సై

జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు కమిటీల ఏర్పాటుకు బీజేపీ కసరత్తు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ‘లోకల్ బాడీ’ఎలక్షన్స్ టార్గెట్‌గా పెట్టుకుంది, గ్రామస్థాయిలో సంస్థాగతంగా బలపడేందుకు కమలదళం సన్నద్ధమవుతోంది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల వ్యవస్థ పటిష్టానికి అడుగులు వేస్తోంది. అసెంబ్లీ ఫలితాలు నిరాశ పరిచినా, లోక్‌సభ ఫలితాలు బీజేపీకి కొంతమేర ఊపునిచ్చాయి. గ్రామస్థాయిలో బీజేపీ అంత పటిష్టంగా లేదు. ఈసారి జరగబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. శుక్రవారం జరిగిన రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలోనూ 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా గెలిచి తీరాలని.. అంతకుముందు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ తీర్మానించింది, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 14% ఓటింగ్ రాగా, లోక్‌సభ ఎన్నికల నాటికి 35 శాతానికి ఓటింగ్ పెరిగింది. త్వరలో జరగబోయే లోకల్‌బాడీ ఎన్నికల్లో ఈ ఓటింగ్‌ను నిలుపుకునేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడిన కేంద్రమంత్రులు, ముఖ్యనేతలు, ఎంపీలు స్థానిక ఎన్నికల్లో అన్నిస్థాయిల్లోని పార్టీ కేడర్‌కు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఇంతకాలం ఎంపీలు, ఎమ్మెల్యేల విజయానికి కృషి చేసిన కార్యకర్తలను గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ప్రకటించారు.

స్థానికం.. సన్నద్ధం: పార్టీపరంగా స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన కార్యాచరణ, వ్యూహాలు సిద్ధం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ప్రత్యేకంగా 32 జిల్లాస్థాయి, మండలాల నుంచి, గ్రామ పంచాయతీల దాకా స్థానిక కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు సామాజిక సమతూకం పాటిస్తూ.. ఓ ఓసీ, ఓ ఎస్సీ, ఓ బీసీ, ఓ మహిళ ఉండేలా కమిటీల కూర్పు ఉండనుంది. ఈ కమిటీలన్నీ జిల్లా కేంద్రం నుంచి గ్రామ పంచాయతీ వరకు పర్యటించి వార్డుసభ్యులు మొదలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులను గుర్తిస్తారు. పోటీచేసే అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు కూడా ఈ కమిటీలకే అప్పగించనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.



దిల్‌సుఖ్‌నగర్‌లో రోడ్డుపై బైఠాయించిన నిరుద్యోగులు



శనివారం రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగుల మొర ఆలకించండి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల మొర ఆలకించాలని మాజీమంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. భేషజాలకు పోకుండా.. వారి జీవితాలు, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలన్నారు. గ్రూప్స్ రాసే అభ్యర్థులు, నిరుద్యోగులను చర్చలకు పిలిచి వారి బాధ, డిమాండ్లు అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. నిరుద్యోగ యువతను రెచ్చగొట్టేలా, కించపరిచే విధంగా మాట్లాడి అభాసుపాలు కావొద్దని రేవంత్‌కు హితవు పలికారు. పోలీసు బలగాలు, లాఠీలు, ఇనుప కంచెలు, బారికేడ్లతో విద్యార్థుల పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నం ఫలించక పోగా, మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

ఒకటో తేదీన వేతనాల చెల్లింపు ఉత్తమాటే..: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. 13తేదీ వచ్చినప్పటికీ మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్స్ జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శనివారం ఒక ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై నిరుద్యోగుల నిరసన

ముషీరాబాద్/చైతన్యపురి: పరీక్షల వాయిదాపై జేఎన్‌టీయూలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. డీఎస్సీ వాయిదాతో పాటు గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచి పరీక్షలు నిర్వహించాలని, గురుకుల ఉద్యోగాలను భర్తీ చేయాలని గత కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఇప్పటికే నిరుద్యోగ అభ్యర్థులు మండిపడుతున్నారు. తాజాగా సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో విద్యార్థులు శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. సిటీ సెంటర్ లైబ్రరీలో స్వచ్ఛందంగా సమావేశమైన నిరుద్యోగ అభ్యర్థులు భారీ ప్రదర్శనగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. అక్కడి నుండి నేరుగా అశోక్ నగర్ క్రాస్ రోడ్స్‌కు వచ్చి బైఠాయించారు. ఒక్కసారిగా వందలాదిమంది రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు రోడ్డుకు ఇరువైపులా రహదారులను మూసివేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వుయ్ వాంట్ జస్టిస్ సీఎం డౌన్ డౌన్ అంటూ అంటూ నిరుద్యోగ అభ్యర్థులు అర్ధరాత్రి వరకు నినాదాలు చేశారు. సీఎం వ్యాఖ్యలు సరికాదంటూ అటు దిల్‌సుఖ్‌నగర్‌లోని రాజీవ్ చౌక్ లోనూ శనివారం రాత్రి 10 గంటల నుంచి డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేయడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. అర్ధరాత్రి దాటినా ఆందోళన కొనసాగుతోంది.

జాబ్ కేలండర్‌కు చట్టబద్ధత

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాన్ని గిల్లడమే పనిగా పెట్టుకున్నారు. గాంధీలో దీక్ష చేసిన వ్యక్తి నాయకుడిగా ఎదగడానికి ఓ రాజకీయ నేత అండతో ఆందోళన చేశారు. గ్రూప్-1లో 1:50 నిష్పత్తిలో కాకుండా 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేస్తే ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ ఎవరైనా కోర్టుకు వెళ్తే పరీక్షలు ఆగిపోతాయి. అందుకే నోటిఫికేషన్‌లో ఉన్న మేరకే పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల భర్తీ ఉంటుంది.

నిరుద్యోగుల కర్మాగారాలు కావొద్దు

నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా ఇంజనీరింగ్ కాలేజీలు మారకూడదు. ప్రపంచంతోనే పోటీపడేలా ఇంజనీరింగ్ విద్యను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. నైపుణ్యం లేకుండా, కేవలం ఇంజనీరింగ్ పట్టాలిస్తే వారికి ఉద్యోగాలు రావు. తాత్కాలిక ఉద్యోగ, ఉపాధి మార్గాల కోసం కంప్యూటర్ కోర్సులను కాలేజీలు కావాలనుకోవడం సరికాదు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి కోర్సులను కనుమరుగు చేస్తే దేశానికే ప్రమాదం.

‘ఫీజు’ ఎప్పటికప్పుడు ఇస్తాం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాలేజీలు ఏమాత్రం దిగులు పడొద్దు. బకాయిలన్నీ వన్ టైం సెటిల్‌మెంట్‌గా ఇచ్చే యోచన చేస్తున్నాం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన ఈ పథకాన్ని మరింత విజయవంతంగా నడిపిస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఏ ఏడాదికా ఏడాదిలో ఇచ్చేందుకు ప్రయత్నించాలని నిర్ణయించాం. సంక్షేమంపైనే దృష్టి పెట్టడం వల్ల కొన్నేళ్లుగా రాష్ట్రం ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటోంది.

లోపాలను గుర్తించాలి

పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా సాంకేతిక విద్య ఉండటం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే నైపుణ్య యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. నైపుణ్యాభివృద్ధికి అవసరమైన కార్యాచరణ చేసే స్వేచ్ఛనిస్తున్నాం. విద్యలో ఉన్న లోపాలను గుర్తించి, మార్పు దిశగా అడుగులు వేసేలా చేస్తాం. ఈ దిశగా ముందుకొచ్చే సంస్థలకు చేయూతనిస్తాం. ఫార్మా రంగంలో పరిశోధనను ఎన్నో ఏళ్లుగా ప్రోత్సహించబట్టే కోవిడ్ వ్యాక్సిన్ తయారీకి హైదరాబాద్ కేంద్రమైంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ప్రతి పది మందిలో ఒకరు తెలుగు వాళ్లే ఉన్నారు. వచ్చే 20 ఏళ్లలో ఎంతో మంది సీఈవోలు ఉండబోతున్నారు.

కాలేజీలకు సామాజిక కోణం అవసరం: శ్రీధర్‌బాబు

ప్రైవేటు కాలేజీలు సామాజిక కోణంలో విద్యా వ్యవస్థ మార్పు కోసం కృషి చేయాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. పరిశ్రమల అవసరాలు, పరిశోధన, అభివృద్ధి దిశగా కొత్త కోర్సులను రూపొందించేందుకు ప్రయత్నాలు జరగాలన్నారు. ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్నామని.. తర్వాత 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తామని ప్రకటించారు. 2030 నాటికి ఐటీలో బెంగళూరును అధిగమించడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఐటీఐల సిలబస్‌లో మార్పు

దశాబ్దాల నాటి సిలబస్‌తో నడుస్తున్న ఐటీఐలకు ఉజ్వ ల భవిష్యత్ తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించాం. రాష్ట్రంలోని 65 ఐటీఐలను టాటా సంస్థ తోడ్పాటుతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మారుస్తున్నాం. ఈ పైలట్ ప్రాజెక్టు ఊహించని విధంగా అత్యాధునిక టెక్నాలజీని సొంతం చేసుకుంది. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలున్నా.. తగిన స్కిల్స్ లేకపోవడం వల్ల నిరుద్యో గం కనిపిస్తోంది. ఆఖరికి నిర్మాణ రంగంలోనూ ఇతర రాష్ట్రాల వాళ్లే ఉంటున్నారు. ఈ పరిస్థితి మారాలి. స్కిల్ పెంపుతోనే ఇది సాధ్యం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో లీడ్ పార్టనర్‌గా తెలంగాణ ఉండాల న్నది మా లక్ష్యం'' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ కార్య క్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము; అంత్యదినమున నేను వానిని లేపుదును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి: శు.అష్టమి ప.2.11 వరకు, తదుపరి నవమి; నక్షత్రం: చిత్త రా.7.57 వరకు, తదుపరి స్వాతి; వర్జ్యం: రా.2.04 నుండి 3.48 వరకు; దుర్ముహూర్తం: సా.4.50 నుండి 5.42 వరకు; అమృత ఘడియలు: ప.12.55 నుండి 2.40 వరకు

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం : 6.34
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

గౌతమ్ గంభీర్ (కొత్త కోచ్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఎవరూ ఎవర్నీ తయారు చెయ్యరు. తల్లిదండ్రులు ఇచ్చారంటే, తల్లిదండ్రులు ద్రోణాచార్యుడి రూపంలో విగ్రహంలా ప్రతిష్ఠించుకుని, ఎవర్ని వారే తయారు చేసుకోవాలి.

అక్రిడీ తయారైపోయి ఉన్న విరాట్ కోహ్లీని, లేదంటే తలపండి ఉన్న నరేంద్ర మోదీ జీని పరిశీలనగా చూస్తూ రోజూ ప్రాక్టీస్ చేస్తే ఎవరికి వారిగా ప్రత్యేకంగా తయారయ్యేదేం ఉండదు. టాప్-ఆర్డర్‌లో కోహ్లీలా ఆడుతున్నాడు అంటారు. 'మన్ కీ బాత్'లో మోదీజీలా మాట్లాడుతున్నాడు అంటారు. అంతే గుర్తింపు. అప్పైనా మళ్లీ కోహ్లీ, మోదీజీకే గుర్తింపు.

కొత్తగా ఇంకో కోహ్లీ, కొత్తగా ఇంకో మోదీజీ... ఆటలకు, రాజకీయాలకు ఉపయోగపడరంటే లేదు. అంతకంటే ఎక్కువ ఉపయోగాన్ని కదా కొత్తగా తయారవుతున్న వాళ్లు ఆటలకైనా, రాజకీయాలకైనా ఇవ్వవలసింది?



"గౌతమ్! కోచ్‌గా మీరిప్పుడు మరొక కోహ్లీని, మరొక రోహిత్ శర్మను, మరొక రవీంద్ర జడేజాను ఇండియా టీమ్ కోసం తయారు చెయ్యాలి కదా." అని జై షా అన్నప్పుడు నవ్వుతూ నేను ఈ మాటే అన్నాను... "వాళ్లను మించిన వాళ్లు తయారైతే బోర్డుకేం అభ్యంతరం ఉండదు కదా షాజీ..." అని.

ఆ మాటకు జై షా నవ్వారు. బీసీసీఐ కార్యదర్శి ఆయన.

ఇండియా టీ20 వరల్డ్ కప్ గెలిచాక కోహ్లీ, రోహిత్, జడేజా ఆ ఫార్మాట్ రిటైర్‌మెంట్ ఇచ్చేశారు. వాళ్లను భర్తీ చెయ్యటం కష్టం అవొచ్చని, కోచ్‌గా అనుభవం లేని నాకు అదొక సవాల్ వంటిదని షా ఉద్దేశం కావచ్చు. లేదంటే, ఒక పెద్ద బాధ్యతని నాకు అప్పగించిన ఆయన పని సజావుగా పూర్తవుతుందని వెతుకున్న వృధ్ధి కావచ్చు.

టీమ్ ఇండియా హెడ్ కోచ్‌గా ఈ పదవిలో నేను మూడున్నరేళ్లు ఉంటాను. రిటైర్ అయిన ఆ ముగ్గురిని భర్తీ చెయ్యటం కాదు నా పని. ఇండియాను గెలిపించే ఆటగాళ్ల పూర్తి జట్టును తయారు చెయ్యటం! ఆ మాటే జై షా తో అన్నాను.

"సుప్రీమ్ నిర్మొహమాటంగా మాట్లాడుతుంటారు. మీరు రాజకీయాల నుంచి నిన్ను మళ్లీ క్రికెట్‌కి పంపించేశారు." అన్నారు షా పెద్దగా నవ్వుతూ.

"మళ్లీ పంపించటం ఏంటి షా జీ! అసలు నేనెప్పుడు క్రికెట్ నుంచి బయటికి వచ్చాను! ఇప్పుడైనా రాజకీయాల నుంచి కదా బయటికి వచ్చాను..." అన్నాను నా ఆశ్చర్యానికి నవ్వును కలుపుతూ.

ఆటల్లో గానీ, రాజకీయాల్లో గానీ మన దగ్గర ఉన్న నమ్మకం ఏంటంటే – పెద్ద పెద్ద విజయాల కోసం చూస్తాం కానీ వాటి కోసం జరిగే చిన్న చిన్న ప్రయత్నాలను చిన్నచూపు చూస్తాం. క్వాలిటీ ప్లేయర్లను పక్కన పెట్టేసి ఎప్పటికీ బ్రాండెడ్ ప్లేయర్లనే మోస్తుంటాం. మన వీళ్లు వాళ్లయ్యేదెప్పుడు? అవ్వకూడదు. వాళ్ల కంటే మరింత ఎక్కువ అవ్వాలి.

ఈస్ట్ ఢిల్లీ ఎంపీగా నేనెంత చేయాలో అంతా చేశాను. ఓడిపోయిన స్థానాలలో ఈసారి కొత్త వాళ్లకు టిక్కెట్ ఇస్తున్నా అని ప్రకటించిన మరీ మొన్నటి ఎన్నికలకు ముందు బీజేపీ విడుదల చేసిన తొలి జాబితాలో నేను గెలిచిన ఈస్ట్ ఢిల్లీ కూడా ఉంది! ఏమిటి దీనర్థం? బాగా ఆడేవారిని కూడా బాగా ఆడట్లేదన్నారంటే కొత్తవారిని తెప్పుకోవాలి వాళ్లు అనుకుంటున్నట్లే కదా! అందుకే రాజకీయాల నుంచి బయటికి వచ్చేశాను.

ఒక నాణ్యమైన టెన్నిస్ ప్లేయర్ ప్రెంచి ఓపెన్ క్లే కోర్టుల్లో ఆడగలడు. వింబుల్డన్ గ్రాస్ కోర్టుల్లో ఆడగలడు. యు.ఎస్. ఓపెన్ హార్డ్ కోర్టుల్లో ఆడగలడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ హీట్ కోర్టుల్లో ఆడగలడు. టీమ్ ఇండియా కూడా అలా ఆడగలగాలి. ఏ మ్యాచ్‌లోనైనా, ఎలాంటి పిచ్ మీదనైనా!

కోచ్ చేయించవలసింది అదే అనుకుంటున్నాను. మరొక 'కోహ్లీ అండ్ కో' ను సృష్టించటమే. కష్టను తెచ్చి, మోదీజీకి చూపించటం కోసం జట్టును ఆడించటమే కాకుండా.

హామీల అమలెప్పుడు 'నెల'రాజా!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ అత్యంత జనాదరణ కలిగిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అనే విషయం చంద్రబాబుకూ, ఆయన కొలువు కూటమికీ స్పష్టంగా తెలుసు. మొన్నటి ఎన్నికల ఫలితాలను ఎంత శాతం మేరకు ట్యాంపరింగ్ చేశారన్న రహస్యం కూడా వారికి మాత్రమే తెలుసు. అలవికాని హామీలతో తాము ఓటర్ల చెవుల్లో పెట్టిన పొద్దుతిరుగుడు పువ్వులు తమ వైపే తిరిగి ప్రశ్నించే సమయం ఆసన్నమైంది. ఆ దృష్టిని మళ్లించాలి. జనంలో జగన్‌కున్న ప్రతిష్ఠను తగ్గించాలి. ఇది వారి తక్షణ కర్తవ్యం.

మంత్రిమండలి ప్రమాణ స్వీకారం చేసి నెలరోజులు దాటింది. చేసిన వాగ్దానాల అమలు సంగతి దేవుడెరుగు. మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ఫలానా తేదీల వారీగా అమలు చేయబోతున్నామనే షెడ్యూల్‌కు కూడా జనం నోచుకోలేదు. ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించగానే సంతకం చేసిన 'మెగా డీఎస్సీ' ఫైలుతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు. అందుతున్న సూచనలను బట్టి ఈ సంవత్సరాంతానికి కూడా ఆ పరీక్షలు పూర్తయ్యే అవకాశం లేదు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ నాటికి పదవీ విరమణ చేయబోయే వారిని దృష్టిలో పెట్టుకొని ఆ సమయానికల్లా డీఎస్సీ నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.

ఈ విద్యా సంవత్సరానికే భర్తీ అయ్యే విధంగా జగన్ ప్రభుత్వం 6,100 పోస్టులతో ప్రకటించిన డీఎస్సీని చాపచుట్టేసి, వచ్చే సంవత్సరం ఖాళీ అయ్యే పోస్టులను కూడా కలిపి దానికి 'మెగా డీఎస్సీ' అనే ముద్ర వేసి వచ్చే సంవత్సరమే భర్తీ చేయబోతున్నారన్నమాట. ఈ సంవత్సరమే కొలువుల్లో చేరవలసిన 6,100 మంది ఉపాధ్యాయ ఔత్సాహికుల నోళ్లల్లో ఆ విధంగా మట్టికొట్టారు. సర్కార్‌వారి తొలి అడుగే చీటింగ్!

పెంచిన పెన్షన్లను తొలి మాసం నుంచే ఇస్తున్నట్టు భారీ ఆర్భాటం చేశారు. అంతకు ముందు ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ డబ్బులు పెట్టి వచ్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తామన్నారు. కానీ ఆచరణ అందుకు విరుద్ధంగా జరిగింది. చాలామందిని గ్రామ సచివాలయాలకు పిలిపించి క్యూలైన్లో కూర్చోబెట్టుకున్నారు. కొన్నిచోట్ల స్థానిక తెలుగుదేశం నాయకుల ఇళ్లల్లోనే కార్యక్రమాన్ని జరిపించారు. ప్రతిచోటా మెడలో పార్టీ జెండాలు కప్పుకొని హడావిడి చేశారు. కొన్నిచోట్ల జనసేన జెండాలకూ, తెలుగుదేశం జెండాలకూ మధ్య క్రెడిట్ వార్ జరిగింది.

పెన్షన్ల పంపిణీ అనే కార్యక్రమం గడిచిన ఐదేళ్లు ఎలా జరిగింది? ఎప్పుడైనా రాజకీయ జోక్యం మాట విన్నామా? ఎక్కడైనా జెండాలు, అందులు కనిపించాయా? కుల మత రాజకీయ వర్గ లింగ భేదం లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఒకటో తేదీ సూర్యోదయం వేళకే ప్రతి ఇంటి గుమ్మానికి వలంటీర్లు చేరుకొని పెన్షన్ సొమ్ములు అందజేశారు. ఎక్కడా రాజకీయం లేదు. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే జరిగింది. లబ్ధిదారుల ఎంపికలోగానీ, పెన్షన్ల పంపిణీలో గానీ వైఎస్సార్ కార్యకర్తలు జోక్యం చేసుకోలేదు. నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఇదే కదా! ప్రభుత్వాలు పని చేయవలసిన తీరు ఇదే కదా!

కొత్త సర్కారు వారి తొలి మాసం నిర్వాకంలోనే రాజకీయం గజ్జెలు కట్టుకొని దూకింది. తమ పార్టీ వారు కాదన్న కారణంతో చాలాచోట్ల పంపిణీ చేయలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ధోరణి ఇంకెంతదూరం వెళ్తుందో రానున్న రోజుల్లో పూర్తిగా అర్థమవుతుంది. పోనీ, మేనిఫెస్టోలో చెప్పినట్టుగా పెన్షన్ కార్యక్రమాన్ని సంపూర్ణంగా అమలు చేశారా? వీసీ లకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనారిటీలకు యాభయ్యేళ్లకు పెన్షన్ వర్తింపజేస్తామన్నారు! మొదటి నెలలోనే ఇవ్వడం కుదరకపోవచ్చు. కనీసం ఏ నెలలో, ఏ సంవత్సరంలో అమలు చేస్తారన్న ప్రకటనైనా రావాలి కదా! ఆ ముహూర్తం కోసం లక్షలాదిమంది ఎదురు చూస్తున్నారు.

'సూపర్ సిక్స్' పేరుతో తెలుగుదేశం పార్టీ ఆరు మాసాల పాటు ఊదరగొట్టిన ఆరు హామీలన్నైనా వెంటనే అమలు చేయడం ప్రారంభించి ఉంటే... మిగిలిన మేనిఫెస్టోపై జనం నమ్మకం పెట్టుకునే అవకాశం ఉండేది. కనీసం వాటికి సంబంధించిన షెడ్యూల్ కూడా ఈ నెల రోజుల్లో విడుదల కాకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. 20 లక్షల ఉద్యోగాలన్నారు, షెడ్యూల్ ప్లీజ్! నిరుద్యోగులందరికీ మూడు వేల రూపాయల నెలసరి భృతి అన్నారు. ఎప్పటి నుంచి? కనీసం ఒక ప్రకటన వచ్చినా వారికి కొంత ఊరట లభిస్తుంది.

ప్రతి బిడ్డా తప్పనిసరిగా బడికి వెళ్లాలనే, మంచి చదువు అభ్యసించాలన్న లక్ష్యంతో జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని అమలు చేశారు. పిల్లల్ని బడికి పంపే విధంగా ప్రోత్సహించడం కోసం బడి వయసు పిల్లలున్న ప్రతి తల్లికీ ఏటా 15 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. 'ఒక్క పదిహేను వేలే ఇవ్వడం ఏమిటి, మేము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలుంటే అన్ని పదిహేను వేలు ఇస్తామ'ని కూటమి టముకు వేసింది. 'సూపర్ సిక్స్'లో రెండో కార్యక్రమంగా దాన్ని నమోదు చేసింది. సుమారు కోటిమంది పిల్లలు ఆశతో ఎదురు చూస్తున్నారు. పసిపిల్లల్ని ఆశపెట్టి మోసగించడం మహాపాపం. తేదీలు త్వరగా ప్రకటించండి. పుణ్యకాలం గడిచిపోతున్నది.

వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే వైఎస్ జగన్ ప్రభుత్వం 'రైతు భరోసా' పేరుతో రైతుకు పెట్టుబడి ఖర్చును అందజేసేది. ఈ సాయాన్ని తాము 20 వేల రూపాయలకు పెంచుతామని మేనిఫెస్టోలో మూడో సిక్సర్ కొట్టారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. అప్పుడే మృగశిర, ఆరుద్ర కార్తెలు ముగిసి పునర్వసు నడుస్తున్నది. సర్కారు సాయం చినుకులు ఎప్పుడు రాలుతాయో చెప్పే నాథుడు కనిపించడం లేదు. పంటౌయిపోయేదాకా ఈదుతూ... మహిళాకు నెలకు పదిహేను వందలు అందజేస్తామని 'సూపర్ సిక్స్'లో పేర్కొన్నారు.

ఈ వయసులో ఉన్న మహిళల సంఖ్య సుమారు ఒక కోటీ ఎనభై లక్షలని అంచనా. వచ్చే నెల శ్రావణమాసం. శుభదినాలు. ఆడపడుచులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం గురించి ఇంకెప్పుడు చెబుతారని అడుగుతున్నారు. ఉచితంగా ఇచ్చే మూడు సిలిండర్లను ఏయే నెలల్లో ఇవ్వబోతున్నారో తెలుసుకోగోరుతున్నారు. ఈ నిరీక్షణంతా కూటమి వాగ్దానాల్లో పెద్దపీట వేసిన 'సూపర్ సిక్స్' గురించే! చేంతాడు పొడవు మేనిఫెస్టో గురించిన ప్రస్తావన ఇంకా మిగిలే ఉంది.

ఎన్నికలకు ముందు అన్ని రాష్ట్రాలూ, కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లను ఆమోదించుకున్నాయి. ఈ నెలలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టవలసి ఉన్నది. ఈ నేపథ్యంలో మేనిఫెస్టో హామీల అమలుకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటనకు ప్రాధాన్యం ఉన్నది. ఎందుకంటే వాటికి అవసరమైన కేటాయింపులను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించాలి. అటువంటి ప్రతిపాదనలకు చోటు దక్కనట్లయితే మేనిఫెస్టో అమలు అటకెక్కినట్లే! మరో ఏడాదిపాటు మాట్లాడే అవకాశం ఉండదు. 'సూపర్ సిక్స్' హామీలు, పెంచిన పెన్షన్ల అమలుకు మాత్రమే అదనంగా ఏటా లక్ష కోట్లకు పైగా నిధుల అవసరం ఉన్నదని ఒక అంచనా.

గతంలో అమలులో ఉన్న పథకాలను యథావిధిగా అమలు చేస్తూనే (పెన్షన్లు, అమ్మ ఒడి మినహా) అదనంగా లక్ష కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. అంత సొమ్మును అదనంగా ఎలా సమీకరించబోతున్నారో తేలవలసి ఉన్నది. వారి మాటల్లోనే చెప్పాలంటే, అర్ధగోలుగా అప్పులు చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని శ్రీలంకకు అమ్మమ్మగా మారుస్తారో, అమల్లో ఉన్న పథకాలకు అంటకత్తెర వేసి ఇచ్చిన హామీలను అటకెక్కిస్తారో పూర్తిస్థాయి బడ్జెట్‌లో తేలిపోతుంది. చంద్రబాబు 'సంపద సృష్టి' కార్యక్రమం ఇంకా ప్రారంభం కాలేదు. ఎప్పుడవుతుందో తెలియదు! అమరావతి నిర్మాణంతో సంపద సృష్టించడం అంటే మెజీషియన్ టోపీలోంచి పిల్లిని బయటకు తీయడం లాంటిదేనని ఆర్థిక నిపుణుల అభిప్రాయం.

ఈ నేపథ్యంలో మేనిఫెస్టో హామీలు, సంక్షేమ పథకాల కొనసాగింపు తదితర అంశాల నుంచి జనం దృష్టిని మళ్లించే రాజకీయ ఐక్యమత్యంతో చంద్రబాబు సర్కార్ ముందున్న ప్రత్యామ్నాయమన్న అభిప్రాయం బలపడుతున్నది. అందులోనే 'రెడ్ బుక్' ఎజెండాగానే గడిచిన నెలరోజుల పరిపాలన జరిగింది. రాజకీయ ప్రత్యర్థులపై వెయ్యికి పైగా దాడులు, విధ్వంసాలు ఈ స్వల్పకాలంలో జరిగాయి. అనేకమందిపై కేసులు పెట్టారు. మేనిఫెస్టో అమలు గురించి అడిగే సాహసం ఎవరూ చేయకూడదు. అందుకోసమని రెడ్‌బుక్ టెర్రర్‌ను అమలుచేస్తున్నారు. సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముద్దాయిగా చేరుస్తూ ఒక దిక్కుమాలిన కేసును కూడా నమోదు చేశారు. మూడేళ్ల కింద సృష్టించి కొట్టివేసిన కేసును మళ్లీ నమోదు చేసి మాజీ ముఖ్యమంత్రిని, ఇద్దరు ఐపీఎస్ అధికారులను, ఒక ప్రభుత్వ డాక్టర్‌ను ముద్దాయిలుగా చేర్చడం ఎంత తెంపరితనమో అర్థం చేసుకోవచ్చు. నిన్నటిదాకా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తిపైనే కేసు పెడితే ప్రశ్నించే గొంతులు వణికిపోతాయని సర్కార్ పెద్దలు భావిస్తే అంతకన్నా అవివేకం ఉండదు. మేనిఫెస్టో హామీలు, 'సూపర్ సిక్స్' వాగ్దానాలు బడ్జెట్ పరీక్షను పాస్ కావలసిందే! లేకపోతే నిలదీసే గళాలు వేలల్లో, లక్షల్లో ఉంటాయి. కోట్ల గొంతుకలు విచ్చుకుంటాయి.

vardhelli1959@gmail.com

బ్రిటన్ రాజకీయాలు నేర్పుతున్న పాఠాలు

కామెంట్



కరణ్ థాపర్

దాదాపు ఒక దశాబ్దకాలంగా మనం బలహీనమైన ఆర్థిక వ్యవస్థ, విశ్వసనీయత లేని రాజకీయ నాయకులు, నాణ్యమైనవి కాని మౌలిక సదుపాయాలు, క్రమంగా క్షీణిస్తున్న పాలనా ప్రతిష్ఠ... వంటివాటిని మాత్రమే బ్రిటన్ గురించి చూడడానికి అలవాటు పడుతూ వచ్చాము. అది మన తప్పు కాదు. కానీ ఇప్పుడు బ్రిటన్‌ను భిన్నంగా చూసే అవకాశం వచ్చింది. అలాగే ఇండియాలో మనం కూడా ఈసారి కొన్ని అమూల్యమైన పాఠాలు నేర్చుకోవచ్చు.

యునైటెడ్ కింగ్‌డమ్ బహుశా ప్రపంచంలోనే అత్యంత బహుళ సాంస్కృతిక సమాజం. భారత సంతతికి చెందిన వ్యక్తి ఆ దేశానికి ప్రధానిగా పని చేశారు. ఇంకా అనేకమంది నల్లజాతీయులు లేదా ఆసియాకు చెందినవారు చాన్స్‌లర్లుగా, విదేశీ కార్యదర్శులుగా, హోమ్ శాఖ కార్యదర్శులుగా; స్కాట్లాండ్, వేల్స్, లండన్ అధినేతలుగా ఉన్నారు. మిగతా ఏ దేశమూ ఇంతగా అపూర్వమైన స్థాయిలో వైవిధ్యాన్ని కలిగి ఉంటుందని నేను అనుకోను.

గత సభలోని 10 శాతంతో పోల్చి చూస్తే ఇటీవల హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎంపికైన ఎంపీలలో 13 శాతం మంది నల్లజాతీయులు / ఆసియన్లు లేదా మైనారిటీ జాతుల మూలవాసులే. వీరిలో 29 మంది భారత సంతతి వారు కాగా, 15 మంది పాకిస్తాన్‌కు చెందినవారు. 12 మంది నిక్కులు. అయితే బ్రిటన్ జనాభాలో ఆసియన్లు 8 శాతం మాత్రమే కాగా, నల్లజాతీయులు 4 శాతం, భారత సంతతివారు 3.1 శాతం, పాక్‌కి చెందినవారు 2.7 శాతం మాత్రమే.

హౌస్ ఆఫ్ కామన్స్‌తో పోల్చి చూసినప్పుడు... భారతదేశ జనాభాలో దాదాపు 15 శాతంగా ఉన్న ముస్లింలు దామాషా ప్రకారం మన లోక్‌సభలో 74 మంది ఉండాలి. కానీ ఉన్నది 24 మందే. 2019లో వారి సంఖ్య 26. ఆ ముందు 2014లో 23. దేశంలోని 28 రాష్ట్రాల్లో మనకు ఒక్క ముస్లిం ముఖ్యమంత్రి కూడా లేరు. 15 రాష్ట్రాల్లో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేరు. 10 రాష్ట్రాలలో ఒక ముస్లిం ఉన్నారు కానీ, ఆ ఒక్కరూ ఉన్నది అల్పసంఖ్యాక వ్యవహారాలకు ఇన్‌ఛార్జిగా మాత్రమే!

ఇంకా చెప్పాలంటే, అధికార బీజేపీ పార్టీకి లోక్‌సభలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేరు. 20 శాతం ముస్లింలు ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో ఆ పార్టీకి శాసన సభలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేరు. 2017లో కూడా అంతే. గుజరాత్‌లో బీజేపీ 1998 నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గానీ, విధాన సభ ఎన్నికల్లో గానీ ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా నిలబెట్టలేదు. రాష్ట్రంలో 9 శాతం మంది ముస్లింలతో ఉయినప్పటికీ ఒక పాపు కలిసి! బ్రిటన్ పార్టీ ముస్లింలు సురక్షితలకుడా అంటూ దూరాన్ని పాటిస్తోంది.

మనం నేర్చుకోవలసిన చాలా భిన్నమైన రెండో పాఠం కూడా ఉంది. మీరు మీ పార్టీని ఎప్పుడూ లేనంతగా ఘోర పరాజయం వైపు నడిపించినప్పుడు మీ స్పందన ఎలా ఉండాలన్నది.



యూకే ప్రధాని కీర్ స్టార్మర్

బ్రిటన్‌లో అయితే రిషి సునాక్ రాజీనామా చేశారు. 12 గంటలు గడవక ముందే ఆయన అలా చేశారు. నిజానికి ఫలితాలకు పూర్తిగా వెల్లడవక ముందే కన్జర్వేటివ్‌లు తాము తిరిగి అధికారంలోకి రావాలంటే తామేలాంటి పార్టీగా ఉండాలన్న దానిపై బహిరంగంగా చర్చించటం ప్రారంభించారు. రానున్న వారాల్లో, నెలల్లో ఆ చర్చ మరింత తీవ్రతరం అవుతుంది. మొత్తం దేశం అందులో పాల్గొంటుంది. మీడియా ప్రశ్నిస్తుంది. దెప్పిపొడుస్తుంది. ఎంపీలు తగాదా పడతారు. వాదోపవాదాలు జరుగుతాయి. ఆశావహులు ముందుకు వస్తారు. వెనక్కు తగ్గుతారు. అనేకమంది వ్యక్తిగత ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. పార్టీకి అది ఇబ్బందికరమైన పరిస్థితిగా పరిణమిస్తుంది. అయితే చివరికి ఒక కొత్త పార్టీ ఆవిర్భవిస్తుంది.

ఇప్పుడొకసారి, 2014లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయంతో కుప్పకూలి పోయాక ఏం జరిగిందో చూద్దాం. ఎవరూ రాజీనామా చేయలేదు. పార్టీ తన భవిష్యత్తు గురించి చర్చించలేదు. సోనియా గాంధీ మరో మూడు సంవత్సరాలు అధ్యక్షురాలిగా కొనసాగారు. చివరికి తన కుమారుడికి మార్గం ఏర్పరిచారు. గాంధీల కుటుంబానికి వెలుపలి వ్యక్తిని అధ్యక్షుడిని చేసే ఎన్నిక 20 22 వరకు జరగలేదు. అప్పుడు కూడా శశిథరూర్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. పదేళ్ల తర్వాత ఈ రోజుకు కూడా ఆ పార్టీ గాంధీల గట్టి నియంత్రణలోనే ఉంది. మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షుడే కావచ్చు. కానీ రాహుల్ కీలకమైన వ్యక్తి. సోనియా గాంధీ వార్తల్లో ఉన్నా, అస్వస్థతతో ఉంటున్నా, పార్లమెంటులో మాట్లాడేందుకు అనాసక్తతను కనబరుస్తున్నా కూడా సోనియానే పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

మూడో పాఠం కూడా ఉంది కానీ నేను దానిని క్లుప్తంగా మాత్రమే ప్రస్తావిస్తాను. సునాక్ రాజీనామా చేసేందుకు ప్రధాని అధికారిక వాహనంలో బకింగ్‌హామ్ ప్యాలెస్‌కి వెళ్లారు. రాజీనామా అనంతరం ప్రైవేటు వాహనంలో ప్యాలెస్ వెక్క ద్వారం నుండి బయటికి వచ్చేసుమించారు. ఒక గంట తర్వాత కొత్తగా ఎన్నికైన ప్రధాని స్టార్మర్ ప్రతిపక్ష నాయకుడి కారులో అక్కడికి వచ్చారు. ప్రధాన మంత్రిగా తన నియామకం అనంతరం ప్రధాని అధికారిక వాహనం లిమోజీన్ కారులో 10, డౌనింగ్ స్ట్రీట్‌కు వెళ్లారు. ఆయన అక్కడికి చేరుకునే సమయానికే సునాక్ కుటుంబానికి చెందిన వస్తువుల్ని ప్యాక్ చేసి, తరలించారు. 10 డౌనింగ్ స్ట్రీట్ కొత్త ప్రభుత్వానికేశకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంది.

ఇదంతా కూడా ఫలితాలు స్పష్టమైన కొద్ది గంటల్లోనే జరిగింది. వైభవోపేతమైన ప్రమాణ స్వీకారోత్సవం కోసం రాజ్యాంగ ప్రక్రియకు వాస్తేమీ ఐదు రోజుల విరామం ఏమీ ఇవ్వలేదు. ఎన్నికలు ముగియటంతోనే పాలన ప్రారంభమైపోయింది. ప్రపంచంలోని కొత్త ప్రధానులందరూ వెంటనే పని మొదలు పెడతామని చెప్పినా, వాస్తవానికి బ్రిటన్ మాత్రమే ఆ పని చేయగలిగింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

నిజమైన పండితుడు

కర్తవ్యాకర్తవ్యములను (చేయదగిన, చేయదగని) యోగ్యాయోగ్యములను తన పరిజ్ఞానంతో గుర్తించగలిగే శక్తిమంతుడు మానవుడు. తనకుండే వివేక సంపదను బట్టి మానవుడు ఇతర జంతువుల కన్నా, పశుపక్ష్యాదుల కన్నా మిన్నగా ప్రసిద్ధి పొందాడు. మంచి ఏదో, చెడు ఏదో గుర్తించే జ్ఞానాన్ని కోల్పోయిన రోజు మానవుడు కూడా పశువులతో సమానంగా భావించ బడతాడు.

'ఆహార నిద్రా భయ మైథునం చ సమాన మేతత్ పశుభిర్నరాణామ్!
జ్ఞానం హితేషా మధికో విశేషః జ్ఞానేన హీనాః పశుభి స్సమానాః!!'

అని మన పూర్వ కవి పేర్కొన్నాడు. హంస పాలను నీళ్లను వేరు చేసి పాలనే స్వీకరించునట్లు, మంచి చెడులను గుర్తించగలిగిన జ్ఞానాన్ని కలిగి ఉండడమే కాకుండా చెడును వదిలి మంచినే స్వీకరించే జ్ఞానాన్ని కూడా మానవులు కలిగి ఉండాలి.



కొందరు పాండిత్యం వారికే పొందిలో రోగం తగ్గుతుంది. అంతేకాని బొప్పాలు పేర్లు తెలిస్తే రోగం తగ్గదు కదా! అట్లే ఆచరణ వల్లనే జ్ఞానానికి సార్థకత ఏర్పడుతుంది. ఆచరణ పర్యంతం కొనసాగే జ్ఞానం కలవాణ్ణే మాత్రం 'పండితుడు' అంటారు. ధర్మశాస్త్రం ఎవరిని పండితుడు అని పేర్కొనాలో మనకు తెలిపింది.

మాతృవత్ పర దారేషు పర ద్రవ్యేషు లోష్టవత్!
ఆత్మవత్ సర్వ భూతేషు యః పశ్యతి స పండితః!!

ఇతరుల భార్యలను, ఇతర మహిళలను (తన భార్య తప్ప) తల్లివలె గౌరవించువాడు, ఇతరుల సంపదలను మట్టితో సమానంగా భావించి పరుల సొమ్మును ఆశించనివాడు, తనకు కష్టం వస్తే దుఃఖించినట్లు, ఇతరుల కష్టాలను చూసి మనసు చలించి వారి దుఃఖం తొలగునట్లు ప్రయత్నించువాడు; తనకు సంపదలు వస్తే సంతోషించినట్లే ఇతరులకు లభించిన సంపదలను చూసి ఈర్ష్య, అసూయలను పొందకుండా సంతోషంతో అభినందించేవాడు... మాటలతో, చేష్టలతో, ఆలోచనలతో ఏ ప్రాణికి కూడా హాని కలిగించకుండా తోటి ప్రాణులను తనతో సమానంగా భావించేవాడే నిజమైన 'పండితుడ'ని ధర్మశాస్త్రం ప్రబోధిస్తోంది.

– సముద్రాల శఠగోపాచార్యులు

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఊరుకోం!

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ సభలో ఎంపీ మల్లు రవి



మల్లురవిని సత్కరిస్తున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ నాయకులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంస్థలున్నప్పుడే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని, రైతులకు ఉచిత కరెంట్, గృహజ్యోతి లబ్ధిదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మింట్‌కాంపౌండ్‌లోని యూనియన్ ప్రధాన కార్యాలయంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగులు ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి పోరాటాలు చేసినా..వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ నిచ్చారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక యూనియన్ 1104 అని కొనియాడారు. విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిబాబా డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



భాస్కర్

అక్కన్నపేట (హుస్నాబాద్): అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోతారం (జె) గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కనవానికుంటకు చెందిన తరాల భాస్కర్ (36)కు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. దీంతోపాటు మరో మూడెకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. సుమారు రూ.8 లక్షల వరకు అప్పులు తెచ్చి కొన్నేళ్లుగా వివిధ పంటలను సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా పంటల దిగుబడి వస్తున్నప్పటికీ తెచ్చిన అప్పులు కుప్పలుగా పెరిగాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య లావణ్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఐడియా అదిరింది.. పని సులువైంది

సాగులో పనిని సులభతరం చేసుకునేందుకు ఓ రైతు చేసిన వినూత్న ఆలోచన అదుర్స్ అనిపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం సావాపూర్ గ్రామానికి చెందిన రైతు అశోక్.. చిన్న ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి పంటపొలంలో తిరిగేందుకు వీలుగా టైర్లు అమర్చాడు. ట్రాక్టర్ వెనుకభాగంలో ఒక కట్టె సాయంతో ఆరు నాగళ్లను జత చేసి ఆరుగురు రైతులతో డౌర కొడుతున్నాడు. తన 15 ఎకరాల పొలంలో సాగు చేసిన పంటనంతా ఒకే రోజులో డౌర కొడుతుండడం తోటి రైతులను ఆకర్షిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జిల్లెలగూడకు చేరిన రాములోరి విల్లు

మీర్‌పేట: అయోధ్య రామయ్య కోసం బంగారం, వెండితో చేయించిన ధనుస్సును భక్తుల దర్శనార్థం శనివారం రంగారెడ్డి జిల్లా మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీమత్స్యావతార వేంకటేశ్వరాలయానికి తీసుకువచ్చారు. నగరానికి చెందిన చల్లా శ్రీనివాసశర్మ అయోధ్య రామయ్య కోసం 13 కిలోల వెండి, కిలో బంగారంతో ప్రత్యేకంగా ధనుస్సు చేయించారని ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ విల్లును దేశంలోని ప్రముఖ ఆలయాలలో ప్రదర్శిస్తూ.. శ్రీలంకకు తీసుకెళ్లి అక్కడినుంచి రామేశ్వరం మీదుగా పాదయాత్రతో అయోధ్యకు చేరుస్తారని వివరించారు. విషయం తెలుసుకున్న స్థానికులు, భక్తులు బంగారు విల్లును దర్శించుకునేందుకు తరలివచ్చారు.



చైనా వాళ్లు వస్తేనే మోటార్ ఆన్!

'సీతారామ'పై కాళేశ్వరం భయం

- ప్రాజెక్టులో తెరపైకి డిఫెక్ట్ లయబులిటీ క్లాజ్
- ఎత్తిపోతల ట్రయల్‌రన్‌కు సిద్ధమైన ప్రభుత్వం
- పంప్‌హౌస్‌లలో చైనా మోటార్ల వినియోగం
- ఆ దేశ ఇంజనీర్ల కోసం ఎదురుచూపులు



అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్‌లో మోటార్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కూనంనేని, తుమ్మల తదితరులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ఎత్తిపోతల పథకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. నిధుల వ్యయం నుంచి పంప్‌హౌస్‌లో మోటార్లు నడిపించే వరకు ప్రతీ అంశంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. అక్విడెక్టులు, పంప్‌హౌస్‌ల నిర్మాణం రెండేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అయితే ప్రధాన కాల్వల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రూ.వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు సాగునీరు అందలేదు. దీంతో ఇప్పటి వరకు అందుబాటులోకి వచ్చిన సీతమ్మసాగర్ ప్రధాన కాల్వను నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు కలిపేలా కొత్తగా రాజీవ్ కెనాల్‌కు శ్రీకారం చుట్టారు. రాజీవ్ కెనాల్ ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.50 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించాలని నిర్ణయించారు.

డ్రై రన్‌కు వెనకడుగు..

భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఉన్న మొదటి పంప్‌హౌస్‌లో 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు మోటార్లు, రెండో పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటార్లు, మూడో పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యం గల మోటార్లు ఐదు, 30 మెగావాట్ల సామర్థ్యం గల మోటార్లు రెండు ఉన్నాయి. ప్రస్తుత అవసరాల ప్రకారం ఒక్కో పంప్‌హౌస్‌లో ఒక్కో మోటార్‌ను నడిపించి నీటిని లిఫ్ట్ చేసినా సరిపోతుంది. దీంతో ఈ పంప్‌హౌస్‌ల్లో డ్రై రన్‌కు వడివడిగా ముందుకు కదిలిన ప్రభుత్వం.. చివరి నిమిషంలో వెనకడుగు వేసింది.

చైనా తంటాలు..

మూడు పంప్‌హౌస్‌ల్లో మొత్తం 19 మోటార్లను చైనాకు చెందిన షాంఘై ఎలక్ట్రిక్ కంపెనీ రెండేళ్ల క్రితమే బిగించింది. అయితే ప్రధాన కాల్వల నిర్మాణం కాకపోవడం, విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో రెండేళ్లుగా అవి ఖాళీగానే ఉన్నాయి. దీంతో కంపెనీకి చెందిన ఇంజనీర్లు చైనా వెళ్లిపోయారు. రెండేళ్ల పాటు మోటార్లు, పంపులు అలాగే ఉండటంతో వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే అంశంపై స్పష్టత లేదు.

విదేశాంగ శాఖకు చేరిన పంచాయితీ

ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు అంశంపై ఇటు ఎల్‌అండ్‌టీ, అటు రాష్ట్ర ప్రభుత్వం మధ్య డిఫెక్ట్ లయబులిటీ అంశంపై వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సొంతంగా మోటార్లు ఆన్ చేసి రిస్క్ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. దీంతో చైనా బృందాన్ని త్వరగా ఇక్కడకు తీసుకొచ్చేందుకు విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను సంప్రదించారు. సాధ్యమైనంత త్వరగా చైనా ఇంజనీర్లను రప్పించేలా ప్రయత్నిస్తున్నారు తప్పితే రిస్క్ తీసుకొని మోటార్లు ఆన్ చేసేందుకు సాహసించడం లేదు. ఆగస్టు 15 నాటికి సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, స్టాండర్డ్ ప్రొటోకాల్ ప్రకారమే ముందుకెళ్లడం మేలనే భావనలో ప్రభుత్వం ఉంది.

శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి కన్నుమూత

- 11 మంది జీయర్‌లలో ఒకరు
- మానేరు నది ఒడ్డున పూర్తయిన అంత్యక్రియలు



కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెట్‌పల్లికి చెందిన శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి (89) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 10.35 గంటలకు కరీంనగర్‌లో కన్నుమూశారు. దేశవ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాములు సుమారు 11 మందిలో వీరు ఒకరు. పూర్వాశ్రమంలో వీరి పేరు కలకుంట్ల కృష్ణమాచార్యులు. ఆయనకు భార్య గోపాలరుక్మిణి, నలుగురు కుమారులు శ్రీమన్నారాయణాచార్యులు (ఆయుర్వేద వైద్యులు), సింహాద్రి ఆచార్యులు (జ్యోతిష్య రంగం), జగన్నాథాచార్యులు (లాయర్‌గా పనిచేసి ప్రస్తుతం విశ్రాంతి), డాక్టర్ కె.రామకృష్ణ (కరీంనగర్ ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్) ఉన్నారు. శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిష్యంలో పలు గ్రంథాలు రచించారు. శ్రీపెరంబుదూరులో వరద యతిరాజ జీయర్‌స్వామి నుంచి 2004లో కృష్ణమాచార్యులు సన్యాసాశ్రమ స్వీకారం చేశారు. కరీంనగర్‌లోని అలకాపురిలో విశిష్టాద్వైత పీఠమైన గీతాశ్రమాన్ని స్థాపించారు.

పలువురి సంతాపం

స్వామిజీ మృతి పట్ల చినజీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి, దేవనాథ రామానుజ జీయర్‌స్వామితో పాటు శ్రీవైష్ణవ సంఘం మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కాందూరి శ్రీనివాసాచార్యులు, పీచర కృష్ణమాచార్యులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులు, బంధువుల కోరిక మేరకు శిష్యులు నీరుకుళ్ల గ్రామంలో రంగనాయకస్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

బీసీ కుల గణనకు కార్యాచరణ



నల్లగొండలో బస్సును ప్రారంభించి.. అదే బస్సులో ప్రయాణిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నల్లగొండ/ నల్లగొండ రూరల్: బడుగు, బలహీన వర్గాలకు మేలు జరిగే విధంగా బీసీ కుల గణనకు అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో కూడా విడుదల చేశామని, రాహుల్‌గాంధీ చెప్పినట్లుగా ఎవరి వాటా ఎంత.. ఎవరి సంఖ్య ఎంత అనే విధంగా కార్యాచరణ చేపట్టే ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం నల్లగొండ పట్టణంలో సావిత్రి బాయి, జ్యోతిబాపూలే విగ్రహాలను ఆవిష్కరించి అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి ప్రభాకర్ విమర్శించారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 80 కోట్లతో గురుకుల భవనాలు ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు బీసీ జన గణనకు కృషి చేయాలని కోరారు.

ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాం..

ఆర్టీసీలో 3,035 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా 21 శాతం డీఏ ఇచ్చామని, రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించామని చెప్పారు. నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి 'రాజధాని'ఏసీ బస్, నాలుగు డీలక్స్, ఒక పల్లె వెలుగు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, అన్ని జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సులు నడుపుతామని అన్నారు. నల్లగొండ బస్టాండ్‌లో బస్సులను ప్రారంభించిన అనంతరం మంత్రులు బస్సులో కొద్దిదూరం ప్రయాణించారు. నల్లగొండలో 20 ఎకరాల్లో నూతన బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోమటిరెడ్డి విజ్ఞప్తి చేయగా.. త్వరలోనే బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పొన్నం హామీ ఇచ్చారు.

జీవో 317పై అభ్యంతరాల వెల్లువ

▶ మొదటి పేజీ తరువాయి

జరిపిన కేటాయింపుల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో స్థానచలనం కలిగిన ఉద్యోగుల్లో దాదాపు 80 శాతం మంది ఉద్యోగులు నష్టపోయామని అంటున్నారు. వీరికి న్యాయం చేస్తామన్న హామీ మేరకు ప్రభుత్వం.. ముగ్గురు మంత్రులతో కూడిన కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో సభ్యులుగా ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే పలుమార్లు భేటీ అయ్యి క్షేత్రస్థాయి నుంచి వినతులు స్వీకరించింది. ఈ కమిటీ ఈ నెల 18న మరోమారు సమావేశం కానుంది. అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

విద్యాశాఖ నుంచి అత్యధిక వినతులు

జీవో 317 కేటాయింపులతో అన్యాయం జరిగిందంటూ వచ్చిన వినతుల్లో అత్యధికులు విద్యాశాఖ నుంచే ఉన్నారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 20,209 దరఖాస్తులు రాగా.. 11,417 దరఖాస్తులతో హోంశాఖ ఆ తర్వాతి స్థానంలో ఉంది. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి 4,833 దరఖాస్తులు, రెవెన్యూ శాఖ నుంచి 2,676 దరఖాస్తులు, పంచాయతీరాజ్ నుంచి 2,390 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. సాంఘిక సంక్షేమ శాఖ నుంచి 1,797, అటవీ, పర్యావరణ శాఖ నుంచి 1,235, గిరిజన సంక్షేమ శాఖ నుంచి 1,140 వినతులు వచ్చాయి. పది శాఖల నుంచి వందలోపు, మిగతా శాఖల నుంచి వచ్చిన దరఖాస్తులన్నీ వెయ్యిలోపు ఉన్నాయి. మొత్తం వినతుల్లో జిల్లా స్థాయి కేడర్‌లో 36,982 మంది ఉద్యోగులు ఉండగా, జోనల్ స్థాయిలో 12 వేల మంది ఉద్యోగులు, మల్టీ జోనల్ స్థాయిలో 3,253 మంది ఉన్నా రు. ఈ దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించిన అధికారులు సాధ్యాసాధ్యాలపై ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం.

18న కేబినెట్ సబ్ కమిటీ ముందుకు...

శాఖల వారీగా జీవో 317 వినతుల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉప సంఘం ఈనెల 18న సచివాలయంలోని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి చాంబర్‌లో భేటీ కానుంది. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పాల్గొనాలని ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) ఆదేశించింది. ఈనెల 16 నాటికి శాఖల వారీగా వచ్చిన వినతుల సంఖ్య, ఇందులో పరిష్కరించినవి, పరిష్కరించనివి, తిరస్కరించినవి, కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్నవి, శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నవి, కోర్టు తీర్పు వెలువడినవి, శాఖలో కేడర్ స్ట్రెంగ్త్, కేటగిరీ వారీగా కేడర్ తదితర పూర్తిస్థాయి సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో సమర్పించాలని జీఏడీ ఆదేశించింది. ఈమేరకు జీఏడీ రూపొందించిన ఫార్మాట్‌తో కూడిన నోట్‌ను సాధారణ పరిపాలన విభాగం కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు జారీ చేశారు.

కేటగిరీ	జిల్లా	జోనల్	మల్టీజోన్	మొత్తం
స్పౌజ్	3,771	836	377	4,984
మెడికల్	927	528	118	1,573
పరస్పరం	659	133	49	841
సీజీ స్పౌజ్	202	99	43	344
స్థానికత	21,806	6,757	1,728	30,291
ఇతరాలు	9,617	3,647	938	14,202

సీనియార్టీ జాబితాపై ఆందోళనలు

- వాటిపై ఫిర్యాదుల వెల్లువ.. పరిష్కరించకుండానే తుదిజాబితాలు
- ఉన్నతాధికారుల తొందరపాటుపై తీవ్ర విమర్శలు
- బదిలీల ప్రక్రియకు మరింత సమయం ఇవ్వాలంటున్న ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఉద్యోగుల సీనియార్టీ జాబితా ఖరారులో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఉన్నతాధికారులు ముందుకు సాగుతున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిమిత సమయంలో బదిలీల షెడ్యూల్ ఇవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల బదిలీల షెడ్యూల్‌లో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రస్తుతం ఉద్యోగుల ఆప్షన్ల స్వీకరణను ముగించాలి. కానీ చాలాచోట్ల సీనియార్టీ జాబితాలపైనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా స్టేషన్ సీనియారిటీ పరిగణించడంపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ దాదాపు నెలరోజులపాటు సాగింది. సీనియార్టీ జాబితా విడుదల, అభ్యంతరాలు, ఖాళీలకు కనీసం ఐదు రోజుల సమయం ఇవ్వడంతో పెద్దగా ఇబ్బందులు రాలేదు. కానీ ఇతర ప్రభుత్వ శాఖల్లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారానికి ఒకట్రెండు రోజుల సమయం మాత్రమే ఇవ్వడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులుండటంతో అభ్యంతరాలు సైతం పెరుగుతున్నాయి. అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇచ్చిన బదిలీల షెడ్యూల్‌ను మరో వారం పాటు పొడిగించాలని, సమస్యలు పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈమేరకు ఉన్నతాధికారులకు వినతులు సమర్పిస్తున్నారు.

వచ్చే నెల 6న పార్లమెంట్‌లో బీసీ బిల్లుకోసం చలో ఢిల్లీ

- బీసీలకు రూ.2 లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలి
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



హిమాయత్‌నగర్: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇవ్వాలని, వారి అభివృద్ధికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతూ ఆగస్టు 6న చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులను కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, డీఎంకే, అన్నాడీఎంకే, జనతాదళ్ తదితర పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల కోర్ కమిటీ నాయకుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీల జనాభా ప్రకారం 27శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో బీసీల సమస్యలపై జాతీయస్థాయి ఉద్యమాన్ని చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కబ్జా చేసి.. పట్టా భూమిలో కలిపేసి..

- మంఖాల్‌లో రూ.180 కోట్ల విలువ చేసే భూమి ఆక్రమణ
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో విలువైన భూదాన్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మహేశ్వరం మండలంలోని రూ.180 కోట్ల విలువ చేసే భూదాన్ భూమి మాయమైంది. బోర్డు పేరున భూమి ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో భూమి కనిపించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిలో బోర్డులు నాటి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఏళ్ల తరబడి అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో విలువైన ఈ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి.

భూదాన్ భూమి...

మంఖాల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 435లో 12.17 ఎకరాల భూమి ఉంది. 1955–58 పహాణీ ప్రకారం ఈ భూమి ఫకీర్ మహ్మద్ పేరున ఉంది. ఆయన దీనిని 3/1/1979న (ప్రొసీడింగ్ నంబరు: 1585/79) భూదాన్ బోర్డుకు దానం చేశారు. 1979–80 నుంచి 1985–86 వరకు భూదాన్ సమితి పేరున ఈ భూమి రికార్డుల్లో ఉంది. ఆ తర్వాత ఈ భూమిని ప్రభుత్వం స్థానికంగా ఉన్న ఐదుగురు పేదలకు దానం చేసింది. ఆ తర్వాత ఈ భూమి పక్కనే ఉన్న ఓ పట్టాదారు ఆధీనంలోకి వెళ్లింది. సదరు రైతు ఈ భూదాన్ భూమిని తన పట్టా భూమిలో కలిపేసుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పంట సాగు చేస్తున్నాడు.

నివేదికతో సరి...

అసైన్‌దారుల ప్రమేయం లేకుండా రికార్డుల్లో పేర్లు మారడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిని అప్పట్లో ఏపీ లోకాయుక్త సీరియస్‌గా తీసుకుంది. ఈ అంశాన్ని సుమోటో (కేసు నంబరు: 2585/2011)గా స్వీకరించింది. రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో మహేశ్వరం తహసీల్దార్ సదరు కబ్జాదారుకు రికార్డులు చూపించాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇందుకు ఆయన నిరాకరించడంతో 14/2/2012లో ఈ భూమిని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అంశాన్ని లోకాయుక్తకు కూడా నివేదించింది. ఈ భూమిలో హెచ్చరికల బోర్డు కూడా ఏర్పాటు చేసింది. అయితే కబ్జాదారు దీనిని కూల్చివేయగా, తహసీల్దార్ ఫిర్యాదుతో మహేశ్వరం పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. కానీ ఇప్పటివరకు ఆ భూమిని స్వాధీనం చేసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోరంబోకు..పట్టాగా

మంఖాల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 608, 609, 610లలో 33.8 ఎకరాల పోరంబోకు భూమి ఉంది. నిన్నమొన్నటి వరకు పేదల చేతుల్లో ఉన్న ఈ భూములు ఇటీవల పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. బహిరంగ మార్కెట్లో ఈ భూముల విలువ రూ.300 కోట్ల వరకు ఉన్నట్టు అంచనా. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూములు పోరంబోకు/గైర్హాన్ సర్కారివిగా నమోదై ఉన్నాయి. 2012లో ప్రభుత్వం వీటిని నిషేధిత జాబితా (22ఎ)లో చేర్చింది. ఆ మేరకు ఒక గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. విలువైన ఈ భూములపై కన్నేసిన కొంతమంది బడానేతలు రికార్డులు మాయం చేసి గుట్టుగా వీటిని కాజేశారు. అసలు సర్వే నంబర్లకు అనేక బై నంబర్లు సృష్టించగా, పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా జారీ అయ్యాయి. ఏడాదిక్రితం వరకు నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూములు ఇటీవల పట్టా భూములుగా మారడంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందగా, ఆయన విచారణకు ఆదేశించడం కొసమెరుపు.

అన్నీ కోల్పోయాను... వెళ్లిపోతున్నా

- తన లాయర్‌కి మెసేజ్ పెట్టిన లావణ్య
- పోలీసులను అప్రమత్తం చేసిన ఆమె న్యాయవాది
- లావణ్య ఇంటికి వెళ్లి పోలీసుల కౌన్సెలింగ్
- రాజ్‌తరుణ్ వల్లే ఆత్మహత్యకు యత్నించానని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న లావణ్య

మణికొండ (హైదరాబాద్): 'నేను మోసపోయాను...ప్రేమించినవాడు వంచించాడు...అతను ఏకంగా నా చావునే కోరుకుంటున్నాడు...ఇక నేను వెళ్లిపోతున్నాను...నన్ను క్షమించండి.. నా చావుకు హీరోయిన్ మాల్వీ మల్హోత్రనే కారణం'అంటూ హీరో రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య శుక్రవారం అర్ధరాత్రి తన న్యాయవాదికి మెసేజ్ పెట్టింది. వెంటనే స్పందించిన న్యాయవాది, నార్సింగి పోలీసులను అప్రమత్తం చేశారు. దాంతో వారు వెంటనే లావణ్య ఇంటికి వెళ్లి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తనను వివాహం చేసుకుని మరో హీరోయిన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమాయణం కొనసాగిస్తున్నాడని, హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు తనను చంపుతానని బెదిరించారని ఇప్పటికే ఆమె నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదు ఆధారంగా హీరో రాజ్‌తరుణ్‌తో పాటు హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజ్‌తరుణ్ లేని జీవితం గడపలేనని, అతనితో పాటు అతని కుటుంబ సభ్యుల చేతిలోనూ తాను మోసపోయానని లావణ్య పోలీసులతో పేర్కొంది. ఫిర్యాదుపై విచారిస్తున్నామని, త్వరలోనే న్యాయం జరుగుతుందని పోలీసులు ఆమెకు హామీ ఇచ్చి సర్ది చెప్పారు.

రాజీ చేసుకోమని బెదిరిస్తున్నారు..

అనంతరం ఆమె తన న్యాయవాది, తండ్రితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, రాజ్‌తరుణ్ తరఫు న్యాయవాదినని రాజేశ్ అనే వ్యక్తి ఫోన్ చేసి అతనితో రాజీ చేసుకోవాలని, నీవు కేసు గెలవలేవని బెదిరిస్తున్నారని చెప్పారు. రాజ్‌తరుణ్ తనను కించపరిచేలా వ్యవహరించడం వల్లే ఆత్మహత్యకు యత్నించానన్నారు. కాగా, పోలీసులు త్వరగా కేసును తేల్చకపోతే తాము హైకోర్టును ఆశ్రయిస్తామని ఆమె న్యాయవాది తెలిపారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు తన న్యాయవాదులతో వచ్చిన లావణ్య, ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన అంశాలకు సంబంధించి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చానని మీడియాకు తెలిపారు. సోమవారం మరోసారి విచారణకు రావాలని పోలీసులు చెప్పారని ఆమె పేర్కొన్నారు. రూ.5 కోట్లు ఇస్తామని, కేసును వెనక్కి తీసుకోమని ఆఫర్‌లు వస్తున్నాయన్నారు.

పెళ్లి.. యమా కాస్ట్లీ!

అంబానీల పెళ్లిసందడి దేశంతో పాటు ప్రపంచమంతటి దృష్టినీ తెగ ఆకర్షిస్తోంది. అంగరంగ వైభవంగా జరుగుతున్న పెళ్లి వేడుకలు, అందుకు జరుగుతున్న ఖర్చు అందరినీ అబ్బురపరుస్తున్నాయి.
ఈ సంరంభానికి అంబానీలు దాదాపు రూ.5,000 కోట్ల దాకా వెచ్చిస్తున్నారన్న వార్తలతో అంతా ముక్కు మీద వేలేసుకుంటున్నారు. అయితే పెళ్లి ఖర్చు విషయంలో భారతీయులెవరూ తక్కువ తినలేదు. మన దేశంలో పెళ్లంటే మూడు ముళ్లు, ఏడడుగులు మాత్రమే కాదు. బోలెడంత ఖర్చు కూడా. ప్రపంచంలో మరే ఇతర దేశంతో పోల్చినా భారత్‌లో పెళ్లి బాగా ఖరీదైన వ్యవహారం. పిల్లల మొత్తం చదువు ఖర్చుతో పోలిస్తే పెళ్లికి హీనపక్షం నాలుగు రెట్లు ఎక్కువ వెచ్చించాల్సిన పరిస్థితి. సగటు కుటుంబంలో పెళ్లి ఖర్చు వార్షికాదాయం కంటే కనీసం మూడు రెట్లు ఎక్కువగా ఉంటోంది. అందులో ఎక్కువ మొత్తం నగానట్రాకే అవుతుండటం మరో విశేషం. పెళ్లి దెబ్బకు చాలా కుటుంబాలు ఆర్థికంగా తలకిందులవుతున్న ఉదంతాలెన్నో. అయినా సరే, పెళ్లి ఖర్చు విషయంలో మాత్రం మనోళ్లు తగ్గేదే లేదంటున్నారు...!

- సాక్షి, నేషనల్ డెస్క్

పిల్లల చదువుల కంటే రెట్టింపు ఖర్చు


- సగటు వార్షికాదాయంతో పోలిస్తే 3 రెట్లు
- ఖర్చులో మూడో వంతు ఆభరణాలకే



భారత రిటైల్ మార్కెట్ పరిమాణం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.94.3 లక్ష కోట్లకు చేరింది. అంటే 1.1 ట్రిలియన్ డాలర్లన్నమాట! ఇందులో రూ.56.9 లక్షల కోట్లతో ఫుడ్ అండ్ గ్రోసరీస్ విభాగం తొలి స్థానంలో ఉంటే రెండో స్థానం పెళ్లిళ్లదే కావడం విశేషం. భారత వెడ్డింగ్ మార్కెట్ విలువ ఎంతో తెలుసా? అక్షరాలా 10.9 లక్షల కోట్ల రూపాయలు! ఇందులో దాదాపు మూడో వంతు వాటా, అంటే రూ.3.1 లక్షల కోట్లు ఆభరణాల ఖర్చుదే కావడం విశేషం! తర్వాత విందు భోజనాలపై రూ.2.1 లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. సంగీత్, హల్దీ వంటి పెళ్లి వేడుకలకు రూ.1.6 లక్షల కోట్లు ఖర్చవుతోంది. ఇక పెళ్లి ఫొటోగ్రఫీ వాటా 0.9 లక్షల కోట్లు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు దుస్తులకు, పెళ్లి డెకరేషన్‌కు చెరో రూ.0.8 లక్షల కోట్ల చొప్పున ఖర్చవుతోంది. మద్యం, కానుకలు, ఇతర పెళ్లి ఖర్చులు కలిపి రూ.1.9 లక్షల కోట్ల దాకా అవుతున్నాయి.

మన దేశంలో పెళ్లి ఖర్చు

కుటుంబం	ఖర్చు
పేద	రూ.3 లక్షలు
దిగువ మధ్య తరగతి	రూ.6 లక్షలు
మధ్య తరగతి	రూ.10-25 లక్షలు
ఓ మాదిరి సంపన్నులు	రూ.50 లక్షలు
సంపన్నులు	రూ.కోటి, ఆ పైన



చదువును మించి...

భారత్‌లో చదువుకు, పెళ్లికి అయ్యే ఖర్చుల మధ్య ఆశ్చర్యకరమైన తేడా కనిపిస్తోంది. సాదాసీదా కుటుంబం ఒక్క సంతానం చదువుకు కేజీ నుంచి పీజీ దాకా పెట్టే మొత్తం ఖర్చు సగటున రూ.3.3 లక్షలు. కాగా అదే కుటుంబం ఒక్క పెళ్లిపై వెచ్చిస్తున్నదేమో ఏకంగా రూ.12.5 లక్షలు! ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారనుకున్నా వారి చదువు ఖర్చుకు రెట్టింపు మొత్తం ఒక్క పెళ్లిపై పెట్టాల్సి వస్తోంది. భారతీయుల తలసరి జీడీపీ (రూ.2.4 లక్షల)తో పోలిస్తే పెళ్లి ఖర్చు ఏకంగా ఐదు రెట్లు ఎక్కువగా ఉంటోంది. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి ఏ సంపన్న దేశంలో చూసినా పెళ్లి ఖర్చు పౌరుల తలసరి జీడీపీతో పోలిస్తే సగం కంటే తక్కువ (0.4 రెట్లు)గానే ఉంది. మరో విషయం. మన దగ్గర ఒక కుటుంబం పెళ్లి కోసం తమ సగటు వార్షికాదాయానికి కనీసం మూడు రెట్లు వెచ్చిస్తోంది!



ఇజ్రాయెల్ దాడి జరిగిన ప్రాంతంలో గుమికూడిన స్థానికులు

హమాస్ మిలటరీ చీఫ్ లక్ష్యంగా గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

90 మంది దుర్మరణం

300 మందికి గాయాలు ● తీవ్రంగా ఖండించిన హమాస్

జెరుసలేం: గాజాలోని దక్షిణ ప్రాంత నగరం ఖాన్ యూనిస్‌పై శనివారం ఇజ్రాయెల్ ఆర్మీ మళ్లీ విరుచుకుపడింది. తాజా దాడుల్లో 90 మంది మృతి చెందగా కనీసం 300 మంది పాలస్తీనియన్లు క్షతగాత్రులయ్యారు. హమాస్ మిలటరీ విభాగం అధిపతి మహ్మద్ డెయిఫ్ లక్ష్యంగా ఈ దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. హమాస్ మరో ముఖ్య నేత రఫా సలామాను కూడా ఆర్మీ లక్ష్యంగా చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ దాడుల్లో వీరిద్దరూ చనిపోయిందీ లేనిదీ స్పష్టం చేయలేదు. ఫెన్సింగ్‌తో ఉన్న హమాస్ స్థావరంపై జరిపిన దాడిలో కొందరు మిలిటెంట్లు కూడా హతమైనట్లు ప్రకటించింది. అయితే, ఉత్తర రఫా- ఖాన్ యూనిస్ మధ్యలో ఇజ్రాయెల్ ఆర్మీ రక్షిత ప్రాంతంగా ప్రకటించిన మువాసిలోనే ఈ దాడి జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. లక్షలాదిగా పాలస్తీనియన్లు తలదాచుకున్న మువాసిపైకి కనీసం ఏడు క్షిపణులు వచ్చి పడ్డాయని అంటున్నారు. ఆ ప్రాంతమంతా చెల్లాచెదురుగా పడిపోయిన మృతదేహాలు, కాలిపోయిన కార్లు, టెంట్లు, నల్లగా మసిబారిన గృహోపకరణాలు నిండిపోయి ఉన్నాయి. దాడి తీవ్రతకు చిన్నారుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయని, తమ చేతులతోనే వాటిని ఏరుకోవాల్సి వచ్చిందని ఓ వ్యక్తి రోదిస్తూ తెలిపాడు. బాధితుల్ని కార్లు, గాడిదల బండ్లు, దుప్పట్లలో వేసుకుని సమీపంలోని నాసర్ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటనను హమాస్ ఖండించింది. అక్కడ డెయిఫ్ సహా తమ నేతలెవరూ లేరని స్పష్టం చేసింది. భయంకరమైన ఊచకోతను కప్పిపుచ్చుకునేందుకే ఇజ్రాయెల్ ఆర్మీ ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేస్తోందని మండిపడింది. ఇజ్రాయెల్ చెబుతున్నదే నిజమైతే గత తొమ్మిది నెలల యుద్ధంలో సాధించిన కీలక విజయమవుతుందని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో శాశ్వత కాల్పుల విరమణ, బందీల విడుదల లక్ష్యంగా అమెరికా మధ్యవర్తిత్వంతో సాగుతున్న చర్చలకు తాజా ఘటన అవరోధంగా మారుతుందని చెబుతున్నారు.

ఎవరీ డెయిఫ్..?

ఇజ్రాయెల్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో హమాస్ మిలటరీ విభాగం చీఫ్‌గా వ్యవహరిస్తున్న డెయిఫ్‌ది మొదటి పేరు.



గత రెండు దశాబ్దాల్లో ఇజ్రాయెల్ నిఘా విభాగాలు పలుమార్లు చేసిన హత్యాయత్నాల నుంచి డెయిఫ్ త్రుటిలో తప్పించుకున్నాడు. అప్పట్లో గాయపడిన ఇతడు పక్షవాతం బారినపడుతున్నట్లుగా భావిస్తున్నారు. గతేడాది అక్టోబర్ ఏడో తేదీన హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంపై జరిపిన మెరుపుదాడికి సూత్రధారి డెయిఫే అని ఇజ్రాయెల్ అనుమానిస్తోంది. 30 ఏళ్ల వయస్సులో ఇతడి ఒకే ఒక్క ఫొటో తప్ప మరే ఆధారం ఇజ్రాయెల్ ఆర్మీ వద్ద లేదు.

ఉప ఎన్నికల్లో

ఇండియా కూటమి జోరు

10 స్థానాల్లో గెలుపు ● బీజేపీకి రెండు.. స్వతంత్రులు 1

న్యూఢిల్లీ: ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు ఆధిక్యాన్ని కనబర్చాయి. విపక్ష ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), డీఎంకే, ఆప్‌లు పది అసెంబ్లీ సీట్లను గెల్చుకున్నాయి. బీజేపీ రెండు స్థానాలతో సరిపెట్టుకోగా, ఒకచోట స్వతంత్ర అభ్యర్థి నెగ్గారు. పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, మధ్యప్రదేశ్, బిహార్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కో స్థానానికి బుధవారం ఉప ఎన్నికలు జరగ్గా.. శనివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 42 స్థానాలకుగాను 29 చోట్ల నెగ్గి బెంగాల్‌లో తనకు తిరుగులేదని నిరూపించుకున్న సీఎం మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో నాలుగింటికి నాలుగు స్థానాలను తమ ఖాతాలో వేసుకుంది. వీటిలో మూడు బీజేపీ సిట్టింగ్ స్థానాలు కావడం విశేషం. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఆధిక్యం వచ్చిన చోట్ల కూడా అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీఎంసీ జయకేతనం ఎగురవేసింది. 294 మంది సభ్యులున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో టీఎంసీ బలం 215కు చేరింది.

అసెంబ్లీలో భార్యాభర్తలు

హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు రాజీనామా చేసి.. బీజేపీ టికెట్‌పై పోటీచేశారు. వీరిలో ఇద్దరు ఓటమి పాలుకాగా.. ఒక్కరు గెలుపొందారు. అందరి దృష్టిని ఆకర్షించిన డేహ్రా నియోజకవర్గంలో హిమాచల్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు సతీమణి కమలేష్ ఠాకూర్ విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అధిష్టానం పట్టుబట్టి మరీ కమలేష్‌ను రంగంలోకి దింపింది. హిమాచల్ అసెంబ్లీలో ఇకపై భార్యాభర్తలు సుఖ్విందర్, కమలేష్‌లు కనిపించనున్నారు. తాజాగా ఇద్దరి గెలుపుతో 68 మంది సభ్యులున్న అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 40కి చేరింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే రాజ్యసభ ఎన్నికల్లో ఏకంగా ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి బీజేపీకి ఓటేయడంతో కాంగ్రెస్ బలం 34కు పడిపోయింది. సుఖు ప్రభుత్వాన్ని అస్థిరత వెంటాడింది. లోక్‌సభ ఎన్నికలతో పాటే 6 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగు నెగ్గింది. ఇప్పుడు మరో రెండు స్థానాలు గెలవడంతో కాంగ్రెస్ బలం మళ్లీ 40కి చేరింది.

బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో రెండు స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. రెండింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇందులో ఒకటి కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం.

రాష్ట్రం	నియోజకవర్గం	పార్టీ- విజేత	ఆధిక్యం	సమీప ప్రత్యర్థి
బెంగాల్	రాయ్‌గంజ్	టీఎంసీ (క్రిష్ణ కళ్యాణి)	50,077	బీజేపీ (మానస్‌కుమార్ ఘోష్)
బెంగాల్	రాణాఘాట్ దక్షిణ్	టీఎంసీ (ముకుత్ మణి అధికారి)	39,048	బీజేపీ (మనోజ్‌కుమార్ బిశ్వాస్)
బెంగాల్	బాగ్దా	టీఎంసీ (మధుపర్ణ ఠాకూర్)	33,455	బీజేపీ (బినయ్‌కుమార్ బిశ్వాస్)
బెంగాల్	మాణికతాలా	టీఎంసీ (సుప్తీ పాండే)	62,312	బీజేపీ (కళ్యాణ్ చౌబే)
హిమాచల్	డేహ్రా	కాంగ్రెస్ (కమలేష్ ఠాకూర్)	9,399	బీజేపీ (హోషియార్ సింగ్)
హిమాచల్	నాలాఘర్	కాంగ్రెస్ (హర్దీప్‌సింగ్ బవా)	8,990	బీజేపీ (కె.ఎల్.ఠాకూర్)
హిమాచల్	హమీర్‌పూర్	బీజేపీ (ఆశిష్ శర్మ)	1,571	కాంగ్రెస్ (పుష్పేందర్ వర్మ)
ఉత్తరాఖండ్	మంగ్లౌర్	కాంగ్రెస్ (ఖాజీ నిజాముద్దీన్)	422	బీజేపీ (కర్తార్‌సింగ్ బదానా)
ఉత్తరాఖండ్	బద్రినాథ్	కాంగ్రెస్ (లఖాపత్ బుటోలా)	5,224	బీజేపీ (రాజేంద్ర భండారి)
పంజాబ్	జలంధర్ పశ్చిమ	ఆప్ (మొహిందర్ భగత్)	37,325	బీజేపీ (శీతల్ అంగురల్)
తమిళనాడు	విక్రవాండి	డీఎంకే (అన్నియూర్ శివ)	67,757	పీఎంకే (సి.అన్బుమణి)
మధ్యప్రదేశ్	అమర్‌వారా	బీజేపీ (కమలేశ్ షా)	3,027	కాంగ్రెస్ (ధీరన్ షా)
బిహార్	రుపౌలీ	స్వతంత్ర (శంకర్ సింగ్)	8,246	జేడీయూ (కె.ప్రసాద్ మండల్)

బీజేపీకి వ్యతిరేక గాలి వీస్తోంది: మమత

కోల్‌కతా: దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఉప ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. 13 సీట్లలో ఇండియా కూటమి 10 చోట్ల గెలవడంపై స్పందిస్తూ.. ఎన్డీయేకు 46 శాతం ఓట్లు రాగా.. ఇండియా కూటమికి 51 శాతం ఓట్లు వచ్చాయని చెప్పారు. బెంగాల్‌లో నాలుగింటికి నాలుగు స్థానాల్లో టీఎంసీని గెలిపించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో మినహా ఎక్కడా బీజేపీ మంచి ప్రదర్శన చేయలేకపోయిందని, దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీకి వ్యతిరేకంగానే తీర్పు వచ్చిందన్నారు. ఇప్పుడు బీజేపీ మళ్లీ 'ఏజెన్సీ రాజ్ (సీబీఐ, ఈడీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపైకి ఉసిగొల్పడం)'ను మొదలుపెట్టిందని ఆరోపించారు. కొత్త నేర చట్టాల్లో ఏముందో న్యాయవాదులు, పోలీసులకే స్పష్టమైన అవగాహన లేదన్నారు. 'స్వేచ్ఛకు ముప్పు పొంచి వుంది. ప్రతి ఒక్కరూ, ఎలాంటి ఆధారాలు లేకపోయినా.. బాధితులుగా మారొచ్చు' అని మమత అన్నారు.

మార్పునకు సంకేతం: కాంగ్రెస్

బీజేపీ సృష్టించిన భయాలు, భ్రమలు పటాపంచలయ్యాయని ఉప ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రైతులు, యువత, కార్మికులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు.. ఇలా దేశంలోని అన్ని వర్గాల వారూ నియంతృత్వానికి పాతరేయాలని కోరుకుంటున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, తమ జీవితాల బాగు కోసం ప్రజలు ఇండియా కూటమికే పూర్తిగా అండగా నిలుస్తున్నారని రాహుల్ అన్నారు. దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి ఈ ఫలితాలు సంకేతమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. మోదీ, అమిత్ షాల విశ్వసనీయత పడిపోతుందనడానికి ఫలితాలు గట్టి నిదర్శనమన్నారు.

'రస్ట్' కేసు

కొట్టివేత

బాల్డ్‌విన్ ఆనంద బాష్పాలు



శాంటా ఫే: 'రస్ట్' సినిమా షూటింగ్ రిహార్సల్స్ సమయంలో 2021లో అలెక్ బాల్డ్‌విన్(61) చేతిలోని తుపాకీ పేలి సినిమాటోగ్రాఫర్ హలియానా హట్చిన్ ప్రాణాలు కోల్పోయిన ఘటన కేసు మూడేళ్లకు అనూహ్యంగా సుఖాంతమయింది. నటుడు అలెక్ బాల్డ్‌విన్‌పై ఉన్న 'అసంకల్పిత హత్య' ఆరోపణలపై విచారణ కొనసాగుతుండగానే న్యూ మెక్సికో కోర్టు జడ్జి అకస్మాత్తుగా కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. కేసులో సాక్షులను అడ్డుకుంటూ పోలీసులు, లాయర్లు వ్యవహరించిన తీరు ఆధారంగానే తీర్పు ఇచ్చినట్లు జడ్జి మేరీ మార్లో సోమర్ తెలిపారు. కోర్టు హాల్లోనే ఉన్న బాల్డ్‌విన్ తీర్పు విని పట్టరాని ఆనందంతో ఏడ్చేశారు. మూడు దశాబ్దాలకు పైగా మంచి నటుడిగా పేరున్న బాల్డ్‌విన్ కెరీర్ 2021 నాటి ఘటనతో ప్రశ్నార్థకంలో పడింది.

కుప్పకూలనున్న 20 స్టార్‌లింక్ శాటిలైట్లు

- తప్పుడు కక్ష్యలో ప్రవేశపెట్టడమే కారణం
- స్పేస్ ఎక్స్‌కు భారీ ఎదురుదెబ్బ

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్‌కు గట్టి ఎదురుదెబ్బ. అది గురువారం ప్రయోగించిన 20 స్టార్‌లింక్ ఉపగ్రహాలు త్వరలో కుప్పకూలనున్నాయి. స్పేస్ ఎక్స్ కూడా దీన్ని ధ్రువీకరించింది. ప్రయోగ సమయంలో చోటుచేసుకున్న పొరపాటే ఇందుకు కారణమని తెలిపింది. ''గురువారం రాత్రి ప్రయోగం మొదలైన కాసేపటికి ఫాల్కన్-9 రాకెట్ రెండో దశ ఇంజన్ సకాలంలో మండటంలో విఫలమైంది. దాంతో ఉపగ్రహాలు ఉద్దేశించిన కక్ష్యకు బదులు భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశించాయి. దాంతో వాటి మనుగడ అసాధ్యంగా మారింది. అవి త్వరలో భూ వాతావరణంలోకి ప్రవేశించి కాలిపోనున్నాయి'' అని వివరించింది.



స్టార్ లింక్ ఉపగ్రహాల నెట్‌వర్క్

అయితే, ''వాటివల్ల ఇతర ఉపగ్రహాలకు ఏ సమస్యా ఉండబోదు. అలాగే ఉపగ్రహాలు ఒకవేళ భూమిని తాకినా జనావాసాలకు ముప్పేమీ ఉండదు'' అని స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ అత్యంత విశ్వసనీయంగా పని చేసిన ఫాల్కన్-9 రాకెట్ చరిత్రలో ఇది తొలి భారీ వైఫల్యంగా చెప్పవచ్చు.

- సాక్షి, నేషనల్ డెస్క్

విశ్వవిన్యాసం

మనకు 32.6 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో హైడ్రా నక్షత్రమండలంలో ఉన్న రెండు గెలాక్సీల వింత సోయగాలివి. ఏఆర్‌పీ 142గా పిలిచే ఈ గెలాక్సీ ద్వయం ఉనికిని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తొలిసారిగా తన కెమెరా కంటితో ఇలా ఒడిసిపట్టింది. చూసేందుకు పెంగ్విన్ తన అండాన్ని పొదువుకున్నట్టుగా ఉండటంతో సైంటిస్టులు వీటికి పెంగ్విన్, ఎగ్ అని పేర్లు పెట్టారు.



కశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలు

న్యూఢిల్లీ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కి కేంద్రం మరిన్ని అధికారాలు కట్టబెట్టింది. పోలీసు శాఖ, అఖిల భారత సర్వీసుల అధికారులు, వివిధ కేసుల విచారణ అనుమతులు వంటి కీలక అంశాలపై అధికారాలను కల్పించింది. ఈ మేరకు జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2019కు హోం శాఖ సవరణలు చేపట్టింది. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం ఈ చట్టం చేసింది. ఇప్పటి వరకు పోలీసు, జైళ్లు, శాంతిభద్రతలు, అఖిల భారత సర్వీసులు, ఏసీబీలకు సంబంధించిన నిర్ణయాలపై జమ్మూకశ్మీర్ ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాకనే ఎల్జీ వద్దకు వచ్చేవి. తాజా నిబంధనల ప్రకారం..ఆయా సర్వీసులకు సంబంధించిన ఫైళ్లు ఇకపై చీఫ్ సెక్రటరీ నుంచి నేరుగా ఎల్జీ వద్దకే చేరుతాయి. అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయాధికారుల నియామక అధికారాలు కూడా తాజాగా ఎల్జీకే దఖలు పడ్డాయి.

అధికారాలను హరించేందుకే..

కేంద్రం నిర్ణయంపై జమ్మూకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికయ్యే ప్రభుత్వం అధికారాలను హరించేందుకే కేంద్రం ప్రయత్నిస్తోందని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పీడీపీ)లు ఆరోపించాయి. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబర్ 30వ తేదీలోగా అసెంబ్లీ ఎన్నికలు చేపట్టి, రాష్ట్రం హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించడం తెల్సిందే.

ప్రభుత్వం నా ఫోన్‌ను హ్యాక్ చేసింది

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపణ

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన, గోప్యతకు భంగకరమైన చర్యలను గట్టిగా వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు యాపిల్ సంస్థ నుంచి వచ్చిన హెచ్చరిక మెసేజ్‌ను శనివారం షేర్ చేశారు. 'మీ యాపిల్ ఐడీతో ఉన్న ఐఫోన్‌ను రిమోట్‌గా హ్యాక్ చేసేందుకు కిరాయి స్పైవేర్‌తో ప్రయత్నాలు జరుగుతున్నాయి. మీరెవరు? ఏం చేస్తున్నారు? అనేవి తెలుసుకునే లక్ష్యంతోనే ఈ దాడి జరుగుతున్నట్లుగా భావిస్తున్నాం'అని అందులో ఉంది. ఈ హెచ్చరిక నేపథ్యంలో వేణుగోపాల్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'మీకెంతో ఇష్టమైన స్పైవేర్‌ను నా ఫోన్‌కు కూడా పంపించినందుకు మోదీ జీ మీకు కృతజ్ఞతలు. మీరు పంపించిన ప్రత్యేక బహుమతి గురించి యాపిల్ సంస్థ నాకు సమాచారమిచ్చింది. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడేందుకు, వారి గోప్యతకు భంగం కలిగించేందుకు మీరు నేరపూరితంగా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది'అని పేర్కొన్నారు.

పెళ్లి కేసులో ఇమ్రాన్‌కు ఊరట

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట. ఇస్లాం నిబంధనలకు వ్యతిరేకంగా పెళ్లాడారన్న కేసులో ఇమ్రాన్ (71), బుష్రా బీబీ (49) దంపతులను న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. వారిపై మోపిన అభియోగాలను ఇస్లామాబాద్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు శనివారం తోసిపుచ్చింది. ఈ కేసులో ట్రయల్ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను కొట్టేసింది. మత ప్రబోధకురాలైన బుష్రా తన మొదటి భర్త ఖవర్ ఫరీద్ మనేకాతో 28 ఏళ్ల వైవాహిక బంధాన్ని తెంచుకుని ఇమ్రాన్‌ను పెళ్లాడారు. అయితే విడాకులకు, పునర్వివాహానికి మధ్య ముస్లిం మహిళ విధిగా పాటించాల్సిన 4 నెలల గడువు (ఇద్దత్)ను ఆమె ఉల్లంఘించిందంటూ ఫరీద్ కేసు పెట్టారు. ఈ కేసులో గత ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికల ముంగిట ఇమ్రాన్ దంపతులకు ఏడేళ్ల శిక్ష పడింది. ఇమ్రాన్‌కు జైలు శిక్ష పడ్డ మూడు కేసుల్లో ఇదొకటి. తోషా ఖానా కేసులో జైలు శిక్షను కోర్టు నిలుపుదల చేయగా, సిఫర్ కేసుల్లో నిర్దోషిగా బయటపడ్డారు. దాంతో గత ఆగస్టు నుంచీ జైల్లోనే ఉన్న ఇమ్రాన్ విడుదలవుతారని భావించారు. కానీ తాజా తీర్పు వెలువడ్డ కాసేపటికే అల్లర్ల కేసులో ఆయన అరెస్టుకు ఉగ్ర వాద వ్యతిరేక కోర్టు అనుమతినిచ్చింది. దాంతో ఆయన జైల్లోనే ఉండనున్నారు.

అమెరికాలో మరో రెండు వీసా దరఖాస్తు కేంద్రాలు

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం సియాటెల్‌లో కొత్తగా రెండు వీసా, పాస్‌పోర్టు కేంద్రాలను భారత ప్రభుత్వం ప్రారంభించింది. పసిఫిక్ తీరంలోని 9 వాయవ్య రాష్ట్రాల్లో ఉండే సుమారు 5 లక్షల మంది భారత సంతతి ప్రజల అవసరాలను ఇవి తీరుస్తాయని సియాటెల్‌లోని భారత కాన్సుల్ జనరల్ ప్రకాశ్ గుప్తా చెప్పారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని సియాటెల్, బెల్‌వ్యూల్లో శుక్రవారం వీసా, పాస్‌పోర్టు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఇటీవలే సియాటెల్‌లో భారత కాన్సులేట్ ఏర్పాటైంది. అలాస్కా, ఇడహో, మొంటానా, నెబ్రాస్కా, నార్త్ డకోటా, ఒరెగాన్, సౌత్ డకోటా, వాషింగ్టన్, వ్యోమింగ్ రాష్ట్రాలు ఈ కాన్సులేట్ పరిధిలోకి వస్తాయి. న్యూయార్క్, అట్లాంటా, షికాగో, హూస్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లో ఐదు చోట్ల ఇప్పటికే భారత కాన్సులేట్లు నడుస్తున్నాయి. భారత ప్రభుత్వం తరఫున వీటిని వీఎఫ్ఎస్ గ్లోబల్ సంస్థ నిర్వహిస్తోంది.

3-4 ఏళ్లలో 8 కోట్ల ఉద్యోగాలు: మోదీ

ముంబై: రిజర్వు బ్యాంక్ నివేదిక ప్రకారం గడిచిన మూడు నాలుగేళ్లలో దేశంలో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నిరుద్యోగితపై బూటకపు ప్రచారాలు చేస్తున్న వారి నోళ్లను ఆర్‌బీఐ నివేదిక మూయించిందన్నారు. ముంబై శివారులోని గోరేగావ్‌లో మోదీ శనివారం రూ, 29 వేల కోట్ల విలువైన రోడ్డు, రైల్వే, పోర్టు ప్రాజెక్టులను ప్రారంభించడం, శంకుస్థాపన చేయడం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీయే వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు పెట్టుబడిదారులు ఎంతో ఉత్సాహంగా స్వాగతించారన్నారు. ఎన్డీయే సర్కారు మాత్రమే సుస్థిరతను అందించగలదని ప్రజలకు తెలుసన్నారు. 'ఉపాధిపై ఆర్‌బీఐ ఇటీవలే సవివర నివేదికను ప్రచురించింది. గడిచిన మూడు- నాలుగేళ్లలో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాల కల్పన జరిగింది. ఉద్యోగాలపై అబద్ధాలను ప్రచారం చేసే వారి నోళ్లను ఆర్‌బీఐ గణాంకాలు మూయించాయి' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలు నిరుద్యోగాన్ని ప్రధానంగా ప్రస్తావించడాన్ని దృష్టిలో పెట్టుకొని మోదీ ఇలా చురకలు అంటించారు.

అనంత్ దంపతులను ఆశీర్వదించిన మోదీ

ముంబై: అంబానీల ఇంట పెళ్లి వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. రిలయన్స్ సంస్థల అధిపతి ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ–రాధికా మర్చంట్ దంపతులను ఆశీర్వదించారు. శుక్రవారం రాత్రి జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన పెళ్లి వేడుకలకు ప్రపంచ ప్రముఖులంతా తరలి రావడం తెలిసిందే. శనివారం జరిగిన వివాహ విందులో పాల్గొన్న మోదీకి ముకేశ్–నీతా అంబానీ దంపతులు స్వాగతం పలికారు. 'శుభ్ ఆశీర్వాద్' పేరిట జరిగిన విందు వేడుకకు కూడా తారాలోకంతో పాటు ప్రపంచం నలుమూలల నుంచి వ్యాపార, రాజకీయ తదితర రంగాల దిగ్గజాలు హాజరై సందడి చేశారు.

సోనియాతో హేమంత్ సోరెన్ భేటీ

న్యూఢిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శనివారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీతో భేటీ అయ్యారు. ఇటీవలే సీఎంగా మరోసారి బాధ్యతలు చేపట్టిన హేమంత్ తన భార్య కల్పనతో పాటు 10, జనపథ్ నివాసంలో సోనియాను కలుసుకున్నారు. ఇది కేవలం మర్యాదపూర్వకంగా జరిగిన సమావేశమని అనంతరం మీడియాకు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత సోనియా గాంధీతో సమావేశమవలేదని, జైలు నుంచి విడుదలైనందున ఆమెతో మాట్లాడేందుకు వచ్చినట్లు వివరించారు. మరికొద్ది నెలల్లో జరగాల్సిన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై చర్చించారా అని అడగ్గా..రాజకీయాలు ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేశారు. భూకుంభకోణం మనీలాండరింగ్ కేసులో జనవరి 31వ తేదీన అరెస్టయిన హేమంత్ అంతకు కొద్ది గంటల ముందే సీఎం పదవికి రాజీనామా చేశారు. జైలులో 5 నెలలపాటు ఉన్న ఆయన బెయిల్ రావడంతో జూలై 4న విడుదలయ్యారు. అనంతరం మరోసారి సీఎం పదవి చేపట్టడం తెల్సిందే.

సాక్షి
హైదరాబాద్

ఆదివారం । 14 । జూలై । 2024



బాలికలకు భరోసా ఏదీ?

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో చిన్నారులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోతోంది.

-8లో



ఏరి'వెత'లే!

కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డుల మంజూరు దేవుడెరుగు.. పాత కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతుండగా.. కొత్త సభ్యుల చేర్పులకు మాత్రం మోక్షం లభించడం లేదు.

-10లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0

వాతావరణం

నగరంలో రాబోయే 24 గంటల్లో ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రాణం తీసిన డిప్రెషన్

- భవనంపై నుంచి దూకి యువతి ఆత్మహత్య



మియాపూర్: మానసిక ఒత్తిడి తట్టుకోలేని ఓ యువతి.. భవనంపై నుంచి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మియాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ చెప్పిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్– 8వ బ్లాక్‌లో ఉంటున్న కిష్టఫర్ కుమార్తె బోరగడ్డ శృతి (34) ఎం ఫార్మసీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. శనివారం ఉదయం దుకాణానికి వెళ్తున్నానంటూ శృతి బయటకు వచ్చి వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్ పక్క భవనం నాలుగో అంతస్తుపై నుంచి దూకడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మియాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. శృతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా.. తనకు పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో శృతి కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడితో బాధపడుతోందని, డిప్రెషన్‌ను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్సీలు ఇవ్వకుండా వేధించడం సరికాదు

- తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని విద్యుత్ స్టోర్స్‌లో ఒక వస్తువు ఉంటే.. మరో వస్తువు ఉండటం లేదు. వర్క్ ఎస్టిమేషన్ ప్రకారం ముందే బిల్లు చెల్లించినప్పటికీ.. కావాల్సిన విద్యుత్ మెటీరియల్‌ను సరఫరా చేయడం లేదు. ఫలితంగా వినియోగదారులతో పాటు ఆ పనులు చేసే ప్రైవేటు కాంట్రాక్టర్లు నష్టపోవాల్సి వస్తోందని తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం నగరంలోని ఓ హోటల్లో తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జేసీరెడ్డి అధ్యక్షతన విద్యుత్ కాంట్రాక్టర్లంతా సమావేశమై సమస్యలపై చర్చించారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, లైన్ల ఏర్పాటు విషయంలో కీలకంగా వ్యవహరించే ప్రైవేటు కాంట్రాక్టర్ల పట్ల డిస్కం వివక్ష చూపుతోందన్నారు. కొత్త కనెక్షన్ల జారీ, లైన్ షిఫ్టింగ్ వర్క్స్‌కి ఎల్సీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆ సంఘం ఆందోళన వ్యక్తం చేశారు. వెండర్ కోడ్ తీసుకోవాలనే ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి, లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, అసోసియేషన్ కార్యదర్శి మారగోని శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆలూరు మహేందర్, ఉపాధ్యక్షుడు ఆర్. ప్రదీప్‌రెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి. సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రెటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లోకి దూసుకొచ్చిన తూటా

- బైరాగిగూడలో ఘటన



ఇంట్లో పడిన బుల్లెట్
అపార్ట్‌మెంట్ కిటికీకి రంధ్రం

మణికొండ: బైరాగిగూడలో ఓ అపార్ట్‌మెంట్ బెడ్రూం కిటికీ అద్దాల్లోంచి దూసుకువచ్చి గోడకు తగిలిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడలోని ఓ అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సిద్ధార్థ్ ఉంటున్నారు. శనివారం ఆయన ఉదయం తన భార్యతో కలిసి కిందకు వెళ్లి వాకింగ్ చేస్తున్నారు. ఇంతలోనే ఓ తూటా వీరి ఇంట్లోని బెడ్రూం కిటికీ అద్దాలను చీల్చుకుంటూ వచ్చి గోడకు తగిలింది. ఆ శబ్దానికి ఇంట్లోని పెంపుడు కుక్క పెద్దగా అరవటంతో వాకింగ్ చేస్తున్న సిద్ధార్థ్ ఇంట్లోకి వచ్చారు. కిటికీకి రంధ్రం ఉండటం, బెడ్రూంలో తుపాకీ తూటా కింద పడి ఉండటాన్ని గమనించి ఎవరో తన ఇంటిపై కాల్పులు జరిపారని భయాందోళనకు గురయ్యారు. నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి సీఐ హరికృష్ణారెడ్డి పరిశీలించారు. పక్కనే ఉన్న తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి వచ్చి ఉంటుందని, వారు శుక్రవారం నుంచి ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. పక్కనే ఉన్న ఇబ్రహీంబాగ్ మిలిటరీ ఫైరింగ్ రేంజ్ నుంచి బుల్లెట్ వచ్చి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఫైరింగ్ రేంజ్‌లకు సమీపంలో అపార్ట్‌మెంట్‌లకు అనుమతులు ఇవ్వటం, ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రాణనష్టం జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే తరహాలో ఇబ్రహీంబాగ్ రెజిమెంట్ నుంచి మణికొండ క్వార్టర్స్‌లోకి బుల్లెట్‌లు వచ్చి పడ్డాయని స్థానికులు గుర్తు చేశారు.

లంగర్‌హౌస్‌లో రంగం చెప్పనున్న జోగిని అనురాధ



జోగిని అనురాధకు సత్కారం..

లంగర్‌హౌస్: ఈ ఏడాది బోనాల మరుసటి రోజు లంగర్‌హౌస్ ప్రధాన దేవాలయం బిజిలీ మహంకాళి ఆలయం వద్ద మాతంగి జోగిని అనురాధ రంగం. భవిష్యవాణి వినిపించనుంది. ఇక్కడ భవిష్యవాణి చెప్పే మాతంగి రేవతమ్మ అనారోగ్యంతో నెల రోజుల క్రితం మృతి చెందారు. శివసత్తి మెట్టు దుర్గ రమేష్ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో ఉండే జోగిని చీమల అనురాధను ఈ కార్యక్రమానికి ఆహ్వానించేందుకు లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, బిజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ పరమేష్ కుమార్ కలిశారు. ఈ సంవత్సరం నుంచి రంగం నిర్వహించి, భవిష్యవాణి వినిపించాలని విన్నవించడంతో ఆమె అంగీకరించింది. దుర్గ రమేష్ ఆధ్వర్యంలో తాను రంగం నిర్వహిస్తానని పేర్కొంది. ఈ సందర్భంగా జోగిని అనురాధను సత్కరించారు.



పట్టాహాసం!

గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకుని ఆనంద పారవశ్యంలో మునిగితేలారు.



స్నాతకోత్సాహం!

గచ్చిబౌలి శాంతి సరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ 23వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్‌తో విద్యార్థులు మెరిశారు.

చేతిలో.. 'కారు'మబ్బులు!

హస్తం గూటికి గులాబీ ఎమ్మెల్యేలు

- వరుసగా వలస నేతలతో అసంతృప్తి
- నియోజకవర్గ ఇన్‌చార్జిల పరిస్థితేంటీ?
- గ్రేటర్ కాంగ్రెస్ కేడర్‌లో గందరగోళం

గ్రేటర్ కాంగ్రెస్ పార్టీకి కొత్త కష్టమొచ్చింది. వలసల పర్వం ఆ పార్టీలో అసంతృప్తిని రాజేస్తోంది. మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న నేతలను అక్కున చేర్చుకుంటున్న తీరును ద్వితీయ శ్రేణి నాయకత్వం తప్పుపడుతోంది. పార్టీ బలోపేతం పేరిట గులాబీ నాయకులకు స్వాగతం పలుకుతుండడం సీనియర్లకు మింగుడు పడడంలేదు. ఒక వైపు పార్టీ బలీయంగా తయారవుతుందనే సంతోషపడుతున్నా.. మరో వైపు తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు కండువా కప్పుకునేందుకు ముహూర్తం కూడా ఖరారు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరి రాక తమ ఉనికికి భంగం కలిగిస్తుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పార్టీ అసమ్మతులకు తెర లేపింది. ఇటీవల చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీలో చేరడంతో మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన భీం భరత్ వర్గం అసంతృప్తికి గురైంది. పార్టీలో చేర్చుకోవద్దని చివరి నిమిషం వరకు ప్రయత్నించినా ఫలించకపోవడంతో సర్దుబాటుకు సరే అంది. అయితే.. మనుషులు కలిసినా మనసులను కలపలేమనే సంకేతాలు ఇరువర్గాలు ఇస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

రాజేంద్రనగర్‌లోనూ..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందరికంటే ముందే రేవంత్ భేటీ అయి కండువా కప్పుకున్న ప్రకాశ్.. మొన్నటివరకు ఆగినా చివరకు కారు దిగి చేయి పట్టుకున్నారు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీచేసిన నరేందర్, సీనియర్ నేతలు జ్ఞానేశ్వర్, ముంగి జైపాల్‌రెడ్డి వర్గీయులు అసంతృప్తికి లోనయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గంలో వేరు కుంపట్లతో కాంగ్రెస్ ఎలా ముందుకు సాగుతుందో వేచిచూడాల్సిందే మరి!

శేరిలింగంపల్లిలో మూడు గ్రూపులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ మూడు గ్రూపులుగా విడిపోయింది. శాసనసభ ఎన్నికల వేళ టికెట్ ఆశించిన జైపాల్ సహా.. ఆఖరి నిమిషంలో బీఆర్‌ఎస్‌ను వీడి టికెట్ దక్కించుకున్న జగదీశ్వర్‌గౌడ్ ఇప్పటికే రెండు వర్గాలు వ్యవహరిస్తున్నారు. తాజాగా గాంధీ రాకతో కాంగ్రెస్‌లో మూడో వర్గానికి తెరలేపింది.

ఖైరతాబాద్‌తో మొదలు..

పరువు పోయిన చోటే వెతుక్కోవాలన్న ఉబలాటంతో ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ. లోక్‌సభ ఎన్నికల ముందే నగరంలో గులాబీ తొలి వికెట్‌గా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పార్టీలో చేర్చుకొని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ప్రయోగించింది. ఇటీవల దానం బాటలోనే జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దానం చేరికతో ఆయనపై పోటీ చేసిన ఓటమి పాలైన విజయారెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.

పటాన్‌చెరులోనూ..

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే వార్తలపై ఆ నియోజకవర్గ పార్టీలోనూ అసంతృప్తికి తెరలేపింది. శనివారం సాయంత్రం మహిపాల్ రెడ్డి సీఎం రేవంత్‌ను కలుస్తారనే సమాచారం ఒక్కసారిగా చర్చనీయాంశమైంది. ఆయన ఆదివారం చేరుతారని ప్రచారం జరుగుతోంది. కాగా.. ఇప్పటికే శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ గ్రూపులుగా విడిపోయిన ఆ పార్టీలో తాజా ఈ పరిణామాలు పార్టీ శ్రేణులను కలవరపరుస్తున్నాయి.

డైలామాలో నేతలు

ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేటర్లను చేర్చుకోవడం ద్వారా గ్రేటర్‌లో పార్టీని పటిష్ఠం చేసే దిశగా అడుగులు వేస్తున్న పీసీసీ నాయకత్వం ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మరింత మంది ఎమ్మెల్యేలకు గాలం విసిరింది. ఇప్పటికే వీరితో సంప్రదింపులు కూడా జరిపింది. అయితే.. వీరి రాకపై సంకేతాలు రావడంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. తాము ఓడినా.. అధికారంలోకి వచ్చామనే సంతోషంలో ఇన్నాళ్లూ ఉన్న తమను తాజా పరిణామాలు ఆవేదన కలిగిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగా చేరిన నాయకుల కింద తమ శ్రేణులు పనిచేయాల్సిన పరిస్థితి అనివార్యం కావడం.. దిగువ శ్రేణి నాయకుల పదవులను కొత్త నేతల అనుచరులు తన్నుకుపోయే ప్రమాదం ఉండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.



డ్రాప్.. బీఆర్‌ఎస్ గ్రాఫ్!

బల్దియాలో తగ్గుతున్న ఆ పార్టీ ప్రభావం

- హస్తంలో ఇమిడిపోతున్న కార్పొరేటర్లు
- పెరుగుతున్న కాంగ్రెస్ బలం
- మున్ముందు మరింతగా హెచ్చే అవకాశం?


సాక్షి, సిటీబ్యూరో: మూడేళ్ల క్రితం జరిగిన జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నికల్లో 56 సీట్లు గెలుచుకున్న బీఆర్‌ఎస్ బలం క్రమేపీ తగ్గుతోంది. ఇప్పటికే వివిధ సందర్భాల్లో పలువురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌ను వీడిపోగా, తాజాగా శేరిలింగం పల్లి నియోజకవర్గం పరిధిలోని ఇద్దరు కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య 45కు తగ్గింది. హైదర్‌నగర్, చందానగర్, వివేకానందనగర్‌ల కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడం కూడా ఇక లాంఛనమేనని చెబుతున్నారు. దీంతో బీఆర్‌ఎస్ బలం 42కు తగ్గనుంది. బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లడం ఇంతటితో అయిపోయిందని చెప్పే పరిస్థితి లేదు. మున్ముందు ఇంకెంతమంది బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్తారో చెప్పలేని పరిస్థితి నెలకొనడంతో బల్దియాలో బీఆర్‌ఎస్ బలం గణనీయంగా తగ్గిపోనుంది.

పెరుగుతున్న కాంగ్రెస్ బలం..

ఎన్నికలు జరిగినప్పుడు కేవలం రెండు సీట్లలో మాత్రం గెలిచిన కాంగ్రెస్ పార్టీ బలం అనూహ్యంగా పెరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇది మరింతగా పెరుగుతోంది. బల్దియాలో కీలక పదవుల్లో ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు కూడా కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. వారు కాంగ్రెస్‌లో చేరడంతోనే ఙ బల్దియాలో బీఆర్‌ఎస్ ప్రభావం పెద్దగా ఉండదని భావిస్తుండగానే, కార్పొరేటర్ల బలం కూడా క్రమేపీ తగ్గుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ బలం 21కి చేరుకోగా.. ఇది ఇంకా ఎంతమేర పెరగనుందో మున్ముందు వెల్లడి కానుంది.

ఎమ్మెల్యేల వెంటే..?

బీఆర్‌ఎస్‌కు ఎంతో బలంగా ఉన్న గ్రేటర్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. వారి నియోజకవర్గాల్లోని వారి అనుయాయులు, అభిమానులుగా ఉన్న కార్పొరేటర్లు సైతం వారితోపాటు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారు. కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇంకా ఉన్నట్లు తెలుస్తోంది. వారివెంట మరికొందరు కార్పొరేటర్లు కూడా వెళ్లే అవకాశాలున్నాయి.



విహార యాత్రలో విషాదం

- ఒడిశాలో ట్రక్కును ఢీకొన్న పాతబస్తీ యాత్రికుల బస్సు
- ముగ్గురు దుర్మరణం
- మరో 20 మందికి గాయాలు



ఉదయ్‌సింగ్



ఉప్పలయ్య



క్రాంతిబాయి (ఫైల్)

చాంద్రాయణగుట్ట: నగరం నుంచి తీర్థ యాత్రల కోసం బయలుదేరిన బస్సు ఒడిశా రాష్ట్రంలో ఓ ట్రక్కును ఢీకొన్న దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో 20 మంది గాయాల పాలుకావడంతో పాతబస్తీలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుల కుటుంబాలు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. ఈ నెల 8న ఛత్రినాకకు చెందిన మల్లేష్ అనే వ్యక్తికి సంబంధించిన నిత్యశ్రీ ట్రావెల్స్ బస్సులో ఉదయ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర భారత యాత్రలకు బయలుదేరారు. 12న ఒడిశాలో పూరీ జగన్నాథ స్వామిని దర్శించుకుని శనివారం రాత్రి బిహార్‌కు బయలుదేరారు. ఓనర్ కం డ్రైవర్ అయిన మల్లేష్ వాహనం నడుపుతుండగా తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో డ్రైవర్ పక్కనే ఉన్న ఉదయ్‌సింగ్.. నీకు నిద్ర వస్తోంది. కొద్దిసేపు నేను బస్సు నడుపుతానని అడిగాడు. దీంతో బస్సును ఉదయ్‌సింగ్‌కు (ఇతను కూడా డ్రైవరే) మల్లేష్ అప్పగించాడు. కాసేపటికే ఎదురుగా వస్తున్న ట్రక్కును వేగంగా ఢీకొట్టడంతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న ఉదయ్‌సింగ్‌తో పాటు ఆయన సోదరి క్రాంతిబాయి (62), బడంగ్‌పేట్‌కు చెందిన బంధువు ఉప్పలయ్య (70) అక్కడికక్కడే మృతి చెందారు. మల్లేష్, ఎస్‌ఆర్‌టీ కాలనీకి చెందిన అంజనీబాయి, భాగ్యమ్మ సహా 20 మందికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న మృతుల, క్షతగాత్రుల కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ట్రావెల్ ఏజెంట్ ఉదయ్ బుక్ చేసిన ఈ ట్రిప్పులో కొంతమంది సభ్యులు తక్కువ పడటంతో మల్లేష్ తన కుటుంబ సభ్యులను కూడా ఈ తీర్థయాత్రలకు ఒప్పించి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఎస్సార్టీ కాలనీలో మృతుడు ఉదయ్ సింగ్ కుటుంబ సభ్యులను యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ మేరాజ్ హుస్సేన్ పరామర్శించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి..

చార్మినార్: ఒడిశాలో జరిగిన బస్సు దుర్ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు



ప్రమాదానికి గురైన బస్సు

వారి మృత దేహాలను స్వస్థలాలకు తరలించాలని ఆయన ఢిల్లీలోని హోం మంత్రిత్వ శాఖను ఆదేశించారు. బండి సంజయ్ ఆదేశాల మేరకు ఢిల్లీలోని హోంమంత్రిత్వ శాఖ కార్యాలయం ప్రమాద ఘటన, గాయపడిన ప్రయాణికుల పరిస్థితిపై మయూర్ భంజ్ జిల్లా మేజిస్ట్రేట్ తోపాటు సీడీఎంఓ, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తోపాటు మెడికల్ కాలేజీ అధికారులతో ఆరా తీసింది. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని బండి సంజయ్ సంబంధిత అధికారులకు సూచించారు.

ముగ్గురి పరిస్థితి విషమం..

గాయపడిన వారిలో బి.కాంతి, విమల, వినీత్, భాగ్యరేఖ, బైష్ణవి సింగ్, శిల్పా ఠాకూర్, రితిక్ సింగ్, సురేఖ తోకస్, ఆర్.రేఖ, తనీషా బిసేన్, సతీష్ సింగ్, శకుంతల బాయ్, బి.ప్రశాంతి, అంజలి, సునీత తోకస్, రేణుక, లావణ్య బిసేన్ తదితరులున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

భర్తే కాలయముడు

- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉందని..
- ఫోన్‌లో రీల్స్ చూస్తోందని భార్యను చంపేశాడు
- వివాహిత హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ చక్రపాణి



నిందితుడు ప్రదీప్



మధుస్మిత (ఫైల్)

ఉప్పల్: ఫోన్‌లో నిత్యం రీల్స్ చూస్తోందని.. ఇన్‌స్టాలో, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉందని భార్యపై కక్షగట్టిన ఓ భర్త.. ఆమెను చంపేసి పరారైన కేసును ఉప్పల్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. శనివారం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ చక్రపాణి వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లోని ఓ ఇంట్లోంచి దుర్వాసన వస్తోందని స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి చూడగా ఓ గోనే సంచిలో కుళ్లిపోయిన స్థితిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ బోలా, మధుస్మిత (28) దంపతులు ఆరు నెలలుగా ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో ఉంటున్నారు. వీరికి కేన్సర్‌తో బాధపడుతున్న 8 నెలల కూతురు ఉంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇంటికి వచ్చిన భర్త ప్రదీప్‌ను మధుస్మిత పట్టించుకోకపోవడం, పలకరించకపోవడం.. ఎప్పుడు చూసినా ఫోన్‌లో రీల్స్ చూస్తూ ఉండేది. మధుస్మిత నిత్యం వేరే వాళ్లతో ఫోన్ మాట్లాడేదని, దీంతో ఆమెపై అనుమానంతో ఈ నెల 7న రొట్టెల పీటతో కొట్టి చంపేశాడు. 8 నెలల కూతురును వెంట తీసుకుని సికింద్రాబాద్‌కు రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. తన కూతురును కాస్త చూస్తూ ఉండండని పక్కవాళ్లకు చెప్పి ప్రదీప్ అక్కడి నుంచి పరారయ్యాడు. అతడు బేగంపేట్‌లోని ఓ హోటల్ పని చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో శనివారం ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి ఆధ్వర్యంలో నిందితుడు ప్రదీప్ బోలాను పట్టుకున్నారు. భార్య తనను పట్టించుకోకపోయేదని, రోజంతా ఫోన్‌లో రీల్స్ చూస్తుండట.. రీల్స్ చేస్తుండటం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటంతో అనుమానం పెంచుకుని భార్యను చంపినట్లు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. కేసు మిస్టరీని ఛేదించిన సీఐ ఎలక్షన్ రెడ్డి, స్పెషల్ టీమ్ బృందాన్ని ఏసీపీ అభినందించారు.

క్రీడాకారులను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

గచ్చిబౌలి: తెలంగాణ క్రీడాకారులను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె.శివసేన రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకం, క్రీడల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూళ్ల సంఖ్యను పెంచుతామని, ఉన్న మూడు స్కూళ్లను ఆధునీకరిస్తామని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో క్రీడా రంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పిస్తామని ఆయన ప్రకటించారు. అన్ని క్రీడల అభివృద్ధికి అర్జున అవార్డు, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, కోచ్‌ల సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీలు జితేందర్ రెడ్డి, రాజయ్య, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్ తదితరులు శివసేన రెడ్డిని అభినందించారు. అనంతరం మంత్రితో కలిసి మొక్కలు నాటారు.



మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న శివసేన రెడ్డి

బాలికలకు భరోసా ఏదీ?

మైనర్లపై ఆగని అత్యాచారాలు
- రాచకొండలో 6 నెలల్లో 222 పోక్సో కేసులు
- కోర్టులో చార్జ్‌షీట్ల దాఖలులో తీవ్ర జాప్యం
- షీ టీమ్‌కు పట్టుబడిన 1,440 మంది ఆకతాయిలు



సాక్షి, సిటీబ్యూరో:

◆ కాచిగూడకు చెందిన 12 ఏళ్ల బాలికపై 10 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గర్భం దాల్చిన మైనర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

◆ రాంపల్లిలోని ఓ హోటల్ యజమాని 15 ఏళ్ల కూతురిపై లారీ డ్రైవర్ కన్నేశాడు. ఎప్పటిలాగే హోటల్‌కు భోజనానికి వచ్చి..అమ్మాయి బాత్‌రూమ్‌కు వెళ్లడం గమనించి, వెనకాలే వెళ్లి ఆమె నోరు నొక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు.

...ఇలా ఒకటి రెండు కాదు..గత ఆరు నెలల్లో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 222 పోక్సో కేసులు నమోదయ్యాయి. రాచకొండలో చిన్నారులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్లలో రాచకొండలోనే అత్యధికంగా అత్యాచారం కేసులు నమోదయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి.

కారణాలనేకం..

'మహిళలు, చిన్నారుల రక్షణకు కీలక ప్రాధాన్యం. వారిపై జరిగే నేరాలను ఉపేక్షించం' అనే పోలీస్ నినాదం నీరుగారుతోంది. ఆడ పిల్లలకు అయిన వాళ్ల దగ్గరే భద్రత కరువవుతోంది. స్నేహం, ప్రేమ ముసుగులో మృగాళ్లు వెంటపడుతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పేగుబంధాలు సైతం కాటేస్తున్నాయి. ఆ బిడ్డల ఆర్తనాదాలు, కన్నీటి వ్యథలు బయటికి చెప్పకుండా నోరు నొక్కేస్తున్నారు. ఈ మధ్య కాలంలో నమోదైన చాలా కేసుల్లో బాధితులకు నిందితులతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఏదో విధంగా పరిచయం ఉన్న కేసులే. వీటిల్లో నిందితులు బంధువు లేదా స్నేహితుడు, ఇరుగు పొరుగు వ్యక్తులే ఉంటున్నారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. వలస కార్మికులు, నిరక్షరాస్యత, ఆర్థికంగా వెనకబడిన వర్గాల్లోనే బాధితులు ఎక్కువగా ఉంటున్నారు. మురికివాడల్లో నివసించే వారు ఎక్కువగా మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి మత్తులో లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. పిల్లల ప్రవర్తనపై కుటుంబ సభ్యుల పర్యవేక్షణ లేకపోవడం కూడా అసాంఘిక కార్యకలాపాల పెరుగుదలకు మరో కారణమని తెలిపారు.

చార్జ్‌షీట్ల దాఖలులో జాప్యం..

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు 222 పోక్సో కేసులు నమోదయ్యాయి. వీటిలో 130 కేసుల్లో మాత్రమే పోలీసులు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. కేసు నమోదు చేసిన 60 రోజుల్లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలి. కానీ, సాక్ష్యాధారాల సేకరణ, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) రిపోర్ట్‌ల ఆలస్యం కారణంగా చార్జ్‌షీట్ దాఖలులో జాప్యం అవుతుందని ఓ పోలీసు అధికారి తెలిపారు. అయితే చాలా కేసులు గత నెల రోజుల్లో ఎక్కువగా నమోదయ్యాయని, దీంతో చార్జ్‌షీట్ దాఖలుకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. గతేడాది చార్జ్‌షీట్ దాఖలు చేసిన కేసుల్లో కేవలం 32 మంది నిందితులకు మాత్రమే న్యాయస్థానాలు శిక్షలు వేశాయి. ఈ 32 కేసులు 2023 సంవత్సరానికి చెందినవే కావడం గమనార్హం.

షీ టీమ్ చేతికి 1,440 మంది ఆకతాయిలు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఎక్కడైనా మహిళలకు వేధింపులు తప్పడం లేదు. గత ఆరు నెలల్లో రాచకొండ షీ టీమ్స్‌కు 1,440 మంది ఆకతాయిలు చిక్కారు. వీరిలో 790 మంది మేజర్లు కాగా.. 650 మంది మైనర్లు ఉన్నారు. పట్టుబడిన ఆకతాయిల్లో 120 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా.. 670 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. 650 మంది పోకిరీలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ నేత క్షేమం

కిడ్నాప్ కథ సుఖాంతం
- భూ వివాదం వల్లే ఘటన..
- విచారణకు వెళ్లిన పోలీసులపై దాడికి యత్నం
- పోలీసులపైకి కుక్కల్ని వదిలిన రౌడీలు
- నలుగురిని పట్టుకున్న పోలీసులు



నరేందర్‌కు చికిత్స చేయించి తీసుకువస్తున్న పోలీసులు

మణికొండ: ఓ భూమి విషయంలో నెలకొన్న వివాదం.. ఏకంగా ఓ ఎమ్మార్పీఎస్ నాయకుడి కిడ్నాప్‌కు దారితీసింది. విచారణకు వెళ్లిన పోలీసులపైనే నిందితులు దాడికి యత్నించారు. కత్తులు, హాకీ స్టిక్స్‌తో దాడికి యత్నించటంతో పాటు వారిపైకి కుక్కల్ని వదిలారు. అదనపు బలగాలను రప్పించి వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కొందరు పారిపోగా నలుగురు పోలీసులకు చిక్కిన సంఘటన నార్సింగిలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసు అధికారులు శనివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం..నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం, గండిపేట రోడ్డు, బృందావన్ కాలనీలోని రూ. 25 కోట్ల విలువ చేసే ఓ ప్లాట్‌ను తెనాలికి చెందిన హరికృష్ణ అనే వ్యక్తి రూ.3 కోట్లు చెల్లించి ఇటీవల ఓల్డ్‌సిటీకి చెందిన యూనిస్‌తో అగ్రిమెంట్ చేసుకున్నాడు. దాన్ని చదును చేసే పనులను మొదలు పెట్టారు. అయితే..ఇది సీలింగ్ భూమి అని, దానిపై తమకు హక్కులు ఉన్నాయని మరో గ్యాంగ్ నకిలీ పత్రాలను సృష్టించి కోర్టును ఆశ్రయించి వివాదం సృష్టించారు. సదరు ప్లాట్‌లో హరికృష్ణ పనులు కొనసాగిస్తుండటంతో వారు అడ్డుకున్నారు. ఏకంగా 20 మంది వరకు అందులోనే తిష్ట వేసి పనులు చేస్తే ఊరుకునేది లేదని బెదిరించారు. దాంతో హరికృష్ణ తనకు అగ్రిమెంట్ చేసిన యూనిస్‌కు ఫోన్ చేసి విషయం వివరించాడు.

మాట్లాడేందుకు వెళ్లిన నరేందర్ కిడ్నాప్...

పనులను అడ్డుకుంటున్న గ్యాంగ్‌తో మాట్లాడేందుకు యూనిస్ స్నేహితుడైన ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ మాదిగను ఆశ్రయించాడు. ఈ మేరకు నరేందర్ తన మిత్రుడు ప్రవీణ్‌తో కలిసి ఈ నెల 10న బృందావన్ కాలనీకి వెళ్లాడు. దాంతో కబ్జాదారులతో అతనికి వాగ్వివాదం జరిగింది. అనంతరం గ్యాంగ్ సభ్యులు ఏకంగా నరేందర్, ప్రవీణ్‌లను కిడ్నాప్ చేసి ఫోన్లు లాక్కుని వరంగల్‌లోని ఓ ఫాంహౌస్‌లో ఉంచారు. కిడ్నాప్‌పై పోలీసులకు ఫిర్యాదు రావటంతో నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా బృందావన్ కాలనీలోని వివాదాస్పద ప్లాట్ వద్దకు పోలీసులు వెళ్లగా..ఏకంగా వారిపైనే దాడికి యత్నించారు. అదనపు బలగాలను రప్పించి వారిని అరెస్టు చేసే క్రమంలో కొంత మంది పారిపోగా రౌడీషీటర్లు అహ్మద్‌ఖాన్, షేక్ హుమ్దన్, మహ్మద్ జాఫర్, మహ్మద్ మసూద్‌లను శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వారిని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచగా వారికి ఏడు రోజుల రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

నలుగురు అరెస్టు కావటంతో...

ప్లాట్ వద్ద పనులు జరగకుండ కాపలాగా ఉన్న తమ మిత్రులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకుని శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్, అతని మిత్రుడు ప్రవీణ్‌లను కిడ్నాపర్లు వదిలిపెట్టారు. దాంతో వారు శనివారం తెల్లవారు జామున ఇంటికి చేరుకున్నారు. నరేందర్‌ను వారు తీవ్రంగా కొట్టడంతో గాయాలయ్యాయి. వారు షాక్‌లో ఉన్నారు. చికిత్స పొందిన అనంతరం నరేందర్ మాట్లాడుతూ రెండు రోజులుగా నిద్ర లేకపోవటంతో అలసిపోయామని, తమను తీసుకెళ్లి ఓ ఫాంహౌస్‌లో ఉంచి కొట్టారని పోలీసులకు తెలిపారు. సదరు ప్లాట్ వద్ద విచారణకు వెళ్లిన పోలీసులపై దాడికి యత్నించిన, నరేందర్‌ను కిడ్నాప్ చేసిన మరికొంత మందిని త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామని పోలీసు అధికారులు తెలిపారు.

నేడు బెజవాడ కనకదుర్గమ్మకు బంగారు బోనం



చార్మినార్: ఏపీలో తెలంగాణ ఆషాఢ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి భక్తులు విజయవాడకు తరలి వెళ్లారు. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలోని ప్రతినిధులు శనివారం విజయవాడకు బయలు దేరారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం పూజా కార్యక్రమంలో భాగంగా విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ తల్లికి ఆదివారం బంగారు బోనం సమర్పిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 11:30 గంటలకు విజయవాడ బ్రాహ్మణ వీధిలోని ఈవో కార్యాలయం వద్ద అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజా భజంత్రీల నడుమ దుర్గ గుడికి బయలు దేరుతారు. ఈ పూజా కార్యక్రమాల్లో మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు పాల్గొంటారని 'ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ' చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ కిడ్నాప్ డ్రామా

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ఎదుట సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ధర్నా

బంజారాహిల్స్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుండి రూ.3 లక్షలు వసూలు చేయడమే కాకుండా..మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతూ కిడ్నాప్ డ్రామా ఆడుతున్న జిగ్‌లైఫ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ వాకాటి రవిచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ వందలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శనివారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. సుమారు 1200 మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడానికి రూ.17 కోట్ల వరకు వసూలు చేసిన రవిచంద్రారెడ్డి తమను మోసం చేశాడని, జీతాలు అడగడానికి వెళ్తే తప్పించుకునేందుకు తిరిగి తమ ఉద్యోగులపైనే కిడ్నాప్ కేసు పెట్టించాడని దుయ్యబట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసుకోవాలని..ఇక్కడ కాదని పోలీసులు సర్దిచెప్పారు. తమ జీవితాలు నాశనం చేశాడని, తాము రోడ్డున పడ్డామని మహిళా ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లీ కొడుకు కలిసి ఆడిన కిడ్నాప్ డ్రామాలో తామంతా బలయ్యామని, రవిచంద్రారెడ్డి మాత్రం రూ.కోట్లు వెనుకేసుకొని జల్సాలు చేస్తున్నాడని, ఆయనను అరెస్ట్ చేసే వరకు వదిలే ప్రసక్తి లేదని, దీనిపై సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఏనుగు బొమ్మపై బీబీ కా ఆలం

మొహర్రం వేళ 'పెటా' ప్రతిపాదన

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో మొహర్రం, బోనాలు పండుగలకు సంప్రదాయం ప్రకారం ఏనుగులను ప్రదర్శిస్తుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో బలహీనపడిన, అనారోగ్యంతో ఉన్న ఏనుగులను తరలిస్తుంటారు. అయితే వాటిని అలా హింసించడం సరికాదని అనేక మంది అభ్యంతరపెడుతున్నారు. అందుకే ఇటు సంప్రదాయానికి ఆటంకం కలగకుండా, ఇటు జంతువులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు జంతుపరిరక్షణ సంస్థ 'పెటా' మధ్యే మార్గంగా ఓ పరిష్కారాన్ని సూచించింది. ఇందుకోసం బొమ్మ ఏనుగులను అందజేస్తామని తెలిపింది. రాష్ట్రంలోని పండుగలను పురస్కరించుకుని కర్ణాటకలోని రూపవతి అనే ఏనుగును బీబీ కా ఆలం ఊరేగింపు కోసం వాడుతుంటారు. అయితే ఈ ఏనుగుకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో తెలంగాణకు తరలించొద్దని కర్ణాటక ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. రూపవతి ఏనుగు తీవ్ర అనారోగ్యంతో ఉందని, దాన్ని వేరే ప్రాంతానికి తరలించే పరిస్థితి లేదని వైద్యులు కూడా తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో మెకానికల్ ఏనుగును సమకూర్చుకునేందుకు నిధులు ఇస్తామని పెటా వెల్లడించింది.

నేత్రపర్వంగా శాకంబరి ఉత్సవాలు

విభిన్న రకాల కూరగాయల అలంకారంలో అమ్మవారి ఆలయం



మూడు రోజుల పాటు వేడుకలు

బంజారాహిల్స్: ప్రతి ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే శాకంబరి ఉత్సవాలు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఫౌండర్ ట్రస్టీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి శాకాంబరి ఉత్సవాల్లో పాల్గొని పూజాదికాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వందల కిలోల కూరగాయలు, పండ్లు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఆచార్య, బ్రహ్మాది, రుత్విగరణం, కంకణ, దీక్షాధారణలు, అగ్నిమధనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, అఖండ దీపారాధన, అంకురారోపణం, వాస్తుయోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్ర, మంటపారాధనలు, కలశ స్థాపన, పంచోపనిషత్, నవగ్రహజపం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్టాపన, అనుష్టాన మంత్ర హవనాలు, మండప దేవతా పూజలు, హారతి, మంత్ర దపుష్పం, తీర్థ ప్రసాద వినియోగాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు...

సైకాలజిస్టుల సేవలు అభినందనీయం

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ నముద్రాల వేణుగోపాల చారి

హిమాయత్‌నగర్: మానసిక ఆరోగ్యానికి చికిత్స అందిస్తున్న సైకాలజిస్టుల సేవలు అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టి.పి.ఎ అవార్డ్స్ ప్రదానోత్సవానికి వేణుగోపాల చారి హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, మహిళలు, పురుషులు ఎంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దైనందిన జీవితంలో మానసిక ప్రశాంతత కోసం యోగా చేయాలని సూచించారు. సంఘానికి చెందిన 15 మంది మహిళా సైకాలజిస్టులకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ ఉమెన్ సైకాలజిస్ట్ అవార్డ్, 10 మంది సైకాలజిస్ట్‌లకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాజీ మహిళా కమిషన్ సలహాదారులు డా.త్రిపురాణ వెంకటరత్నం, ప్రముఖ నటుడు కెవి.ప్రదీప్, సైకాలజిస్ట్ డా.హరిణి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, సంఘం నాయకులు వెంపటి రాజు, శ్రీపూజ, సుధాకర్ రోజా తదితరులు పాల్గొన్నారు.



అవార్డు స్వీకర్తలతో కలసి వేణుగోపాల చారి

అక్రమ బదిలీలు, పదోన్నతులపై పోరాడుతాం

వెంగళరావునగర్: ప్రభుత్వం అక్రమ పద్ధతిలో బదిలీలు, పదోన్నతులు చేపడితే ఎంతటి పోరాటాకైనా సిద్ధమని టీఎన్‌జీవో ఆయుష్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి.ఎస్‌చారి తెలియజేశారు. జీవో నెంబర్ 178 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఎదుట ఉద్యోగులు గత రెండు రోజులుగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో టీఎస్ చారి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021లో బదిలీలు, పదోన్నతుల కోసం జీవో 178 తెచ్చిందన్నారు. కొందరు అధికారులు ఉద్యోగులకు తెలియనీయకుండా దానిని అమలు చేస్తూ పదోన్నతుల జాబితా విడుదల చేశారని ఆరోపించారు. ఇది ఉద్యోగులకు చాలా ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. 178 జీవోను ప్రభుత్వం రద్దు చేసే వరకు తాము పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో ఆయుష్ విభాగం నాయకులు, ఉద్యోగులు, రాఘవేంద్ర, స్వరూప, అర్చన, సందీప్, అనిత, శైలజ, శివ, ఖాజం, కృష్ణ, శ్రీను, గౌస్, రామ్‌నాథ్ పాల్గొన్నారు.



ఆయుర్వేద కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఆయుష్ ఉద్యోగులు...

డీజీపీకి వినతి

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ విద్యార్థి సంఘం సీవైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాలోతు సురేష్‌ను అక్రమంగా అరెస్టు చేసిన సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ తొర్రూరు సీఐ ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ విద్యార్థి సంఘం సీవైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాలోతు సురేష్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ లాక్కుకుని దాడి చేశారని ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డీజీపీని వినతి పత్రంలో తెలిపామన్నారు. నూతన డీజీపీని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములుగౌడ్, మహమ్మద్ మాజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, యువజన నాయకులు పవార్, సంతోష్ తదితరులున్నారు.

ఘనంగా సుదర్శన హోమం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి మంటపం ప్రాంగణంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితులు, పూజారి రంగరాజాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన హోమంలో కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు వీణామాదురి, రాజ్‌కుమార్, సందీప్‌రాజ్‌లతో పాటు స్థానికులు, మహిళలు పాల్గొన్నారు. లోక కళ్యాణార్థం, వినాయక నిర్మాణ పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు 'ఇండి గ్లోబల్ లీడర్‌షిప్' అవార్డు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ఇండి గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు దక్కింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని హైబ్రిడ్ మోడల్‌ను టీచింగ్ అండ్ లెర్నింగ్ మెథడ్‌కు అనుసంధానం చేసినందుకు ఈ అవార్డు వరించింది. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ పద్మశ్రీ మంజుల అనగాని శ్రీధర్, ఇండో గ్లోబల్ మీడియా నెట్‌వర్క్ సీఈఓ సుధీర్ గౌతమ్‌ల చేతుల మీదుగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వరలక్ష్మీ అవార్డును అందుకున్నారు. ఇండి గ్లోబల్ మీడియా నెట్‌వర్క్ పేరిట నగరంలో జరిగిన ఇండి గ్లోబల్ స్కూల్ లీడర్ సమ్మిట్‌లో స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మీ ×టెడిషనల్ ఎసెస్‌మెంట్ టూల్స్–న్యూఏజ్ ఎసెస్‌మెంట్ టూల్స్ అనే అంశంపై తన అభిప్రాయాలను సమర్థవంతంగా తెలియజేసి బెస్ట్ స్పీకర్ అవార్డును కూడా అందుకున్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మకమైన అవార్డులను జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ కైవసం చేసుకుంటూ విద్యా రంగంలో తనదైన గుర్తింపును సాధిస్తూ ఉన్నతమైన ప్రమాణాలతో విద్యనందిస్తుందని స్కూల్ యాజమాన్యం ఈ సందర్భంగా పేర్కొంది.



ఇండి గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు అందుకుంటున్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మీ



ఎండిపోయిన చెట్టు చిగురించిన దృశ్యం..



మోడువారిన చెట్టు చిగురించిన దృశ్యం..

నాడు మోడుబారి నేడు చిగురించి..

- చిగురిస్తున్న చెట్లతో కేబీఆర్ వాక్‌వేలో ఆహ్లాదకర వాతావరణం
- వాకర్లకు కొత్త అనుభూతి ఇస్తున్న కేబీఆర్ పార్కు



మోడువారిన చెట్టుపై ఎదుగుతున్న మొక్క..

బంజారాహిల్స్: గత రెండు నెలల నుంచి కురుస్తున్న వర్షాలతో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో ఎండిపోయి మోడువారిన మొక్కలు, చెట్లు మళ్లీ చిగురిస్తూ పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి. ఎండిపోయి మోడువారిన చెట్లు మళ్లీ చిగురించి ఇటు వాకర్లను, అటు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వాక్‌వే ఐదు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా సుమారు 30కి పైగా మోడువారిన చెట్లు మళ్లీ చిగురిస్తూ వాక్‌వేను పచ్చదనంతో నింపేస్తున్నాయి. ఫలితంగా వాక్ వే మొత్తం పచ్చదనం పర్చుకుని ఆహ్లాదకర వాతావరణంతో వాకర్స్‌కు కొత్త అనుభూతులను ఇస్తోంది. వేసవి కాలంలో సూర్యుడి ప్రతాపానికి చెట్లు ఎండిపోయాయి. దీంతో చాలా మంది వాకర్లు ఎండిపోయిన మొక్కలు, చెట్లకు వారి ఇంటి నుంచి వాటర్ బాటిళ్ల సహాయంతో నీటిని పోస్తుండేవారు. అయినా కూడా ఎండల ధాటికి చాలా వరకు మొక్కలు ఎండిపోయాయి. అయితే మే నెలలోనే వానలు కురవడంతో ఎండిన చెట్లకు కొంతనీరు తగిలి మెల్లమెల్లగా కొత్త చిగురు వేశాయి. ఈ క్రమంలో ఎండిన చెట్లన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అదే విధంగా వాక్ వేలో జీహెచ్ఎంసీ మాజీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ మూడు వేలకుపైగా కొత్తగా మొక్కలు నాటించి థీమ్ పార్కులను ఏర్పాటు చేశారు. ఒకవైపు ఎండిపోయిన చెట్లు చిగురించడం, ఇంకోవైపు కొత్తగా నాటిన మొక్కలు వాక్ వేను పచ్చదనంతో నింపేశాయి.

రౌడీషీటర్ అరెస్టు

ఫిలింనగర్: దృష్టిమరల్చి కూరగాయల వ్యాపారి నుంచి రూ.15 వేలు ఎత్తుకెళ్లిన ఘటనలో రౌడీషీటర్‌ను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి ఆటో, నగదు రికవరీ చేశారు. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్‌లోని వినాయక నగర్ బస్తీలో వారాంతపు సంతలో ఓ మహిళ కూరగాయలు విక్రయించిన అనంతరం సరుకులు సర్దుకుంటుంది. అదే సమయంలో హకీంపేటకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ షాబాజ్, మహ్మద్ పాషా ఇద్దరూ ఆటోలో ఆమె వద్దకు వచ్చారు. కూరగాయలు కావాలని చెప్పడంతో ఆమె తూకం వేసేందుకు కూరగాయలు తీసుకుంటుండగా అదే సమయంలో అక్కడ ఉన్న రూ.15 వేల నగదును తస్కరించి పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు పాత నేరస్తుల కదలికలపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలో హకీంపేటకు చెందిన షాబాజ్, మహ్మద్ పాషాలు ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. వీరిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో ఫిలింనగర్ డీఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఇంతియాజ్ హుస్సేన్, సురేందర్ రాథోడ్ చూపిన ప్రతిభను ఫిలింనగర్ సీఐ ఎం.శ్రీనివాసులు, డీఐ ఎస్.జయరాం అభినందించారు.



రౌడీషీటర్ మహ్మద్ షాబాజ్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ఫిలింనగర్: సమయానుకూలంగా వ్యాపార సంస్థలను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యాపార సంస్థలు, ఇతరత్రా పాన్ డబ్బాలు, వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క మెడికల్ షాపులు తప్పితే మిగతా షాపులన్నీ రాత్రి 12 గంటల లోపు మూసివేయాల్సి ఉంటుందన్నారు. 12 తరువాత తెరిచి ఉంటే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులకు సహకరించడం ద్వారా శాంతిభద్రతలు పరిరక్షించుకోవచ్చని వెల్లడించారు.

సిల్క్ ఎక్స్‌పో–2024 నేటితో ఆఖరు

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల సిల్క్, కాటన్, పలు డిజైనరీ వస్త్రాలలో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024 నేటితో ముగియనున్నది. ఈ ప్రదర్శనలోని వస్త్రాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.



చీరలను తిలకిస్తున్న మహిళలు

చెత్తను తొలగించండి మహాప్రభో!



ఆరునెలలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్న స్థానికులు

వెంగళరావునగర్: ఆరు నెలలుగా చెత్త పేరుకపోయిన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా తొలగించండి మహాప్రభో అని వీడియోగల్లీ ప్రజలు వేడుకుంటున్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వీడియోగల్లీలో సాయిబాబా దేవాలయం సమీపంలోని నాలాపై పైకప్పు నిర్మించారు. చేపల మార్కెట్ నుంచి కృష్ణకాంత్ పార్క్ గోడ వరకు ప్రహరీని, పెన్సింగ్ ఏర్పాటు చేసి చెత్తను ఎవరూ లోపలకు వేయకుండా పగడ్బందీ ఏర్పాటు చేశారు. అయితే ఈ దేవాలయం వద్ద మాత్రం నాలా పైకప్పు ఉన్న ప్రాంతంలో చెత్త పేరుకుపోతోంది. ప్రధాన రహదారుల వెంట చెత్త వేయకండి అంటూ అటు జీహెచ్ఎంసీ, మరోవైపు పొదుపు సంఘాల మహిళలను కాపాలా ఉంచి, ఇటీవల పూల కుండీలు కూడా ఏర్పాటు చేసి రక్షిస్తున్నారు. అయితే గల్లీ లోపల మాత్రం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత ఆరు నెలలుగా ఇక్కడ చెత్త, ఇంటి నిర్మాణ వ్యర్థాలు, ఇతర సామగ్రితో పాటుగా ఒక పాత ద్విచక్ర వాహనంతో అస్తవ్యస్తంగా తయారైంది. అసలే వానా కాలం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయని, మరోవైపు దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిమార్లు అటు ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు తెలియజేశామని, జీహెచ్ఎంసి అధికారులకు సమాచారం అందించామని అయినప్పటికీ దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే డెంగీ, మలేరియా, ఫైలేరియా లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, తక్షణమే ఈ చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు

మొక్కలు నాటిన జెడ్సీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని, మొక్కలతోనే జీవనాధారమన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జెడ్సీ అనురాగ్ జయంతి..

ట్రాన్స్‌జెండర్లకు భద్రత కల్పించాలి

పంజగుట్ట: ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు పీవో డబ్ల్యూ సంధ్య, ఝాన్సీ, సుమిత్ర, దీప్తి, రచన, సత్యవతిలు మాట్లాడుతూ ఫతేనగర్‌లో ఒక ట్రాన్స్‌జెండర్‌ను దారుణంగా హత్య చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో 15 నుంచి 20 మంది ట్రాన్స్‌జెండర్లను దారుణంగా హతమార్చినా నిందితులకు తగిన శిక్ష పడకపోవడం, వారికి వెంటనే బెయిల్ ఇవ్వడం వల్ల వారు మళ్లీ తిరిగి నేరాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఓటు బ్యాంక్ కానందునే పట్టించుకోవడం లేదా అని ప్రశ్నించారు. షీలా హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ట్రాన్స్‌జెండర్‌లపై శారీరక, సామాజిక, లైంగిక, ఆర్థిక హింస జరుగుతుందని, పోలీసులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

బీజేఆర్‌నగర్ నాలాపై అక్రమ నిర్మాణం

పట్టించుకోని అధికారులు... కుంచించుకుపోతున్న నాలా



బీజేఆర్‌నగర్ నాలాపై అక్రమ నిర్మాణం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో వరదనీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలువపై యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్వాకంతో ఇప్పటికే ఈ నాలాపై 20కి పైగా అక్రమ నిర్మాణాలు ఏర్పాటు కాగా, తాజాగా మరో భారీ అక్రమ నిర్మాణం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో కూడా ఈ నాలా కబ్జాలపై పలువురు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండాపోతోంది. ఇప్పటికే నాలా కుంచించుకుపోయి వరదనీరు ముందుకు వెళ్లలేక ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఈ వరదనీటి కాలువలోనే మురుగునీటి పైప్‌లైన్లు కూడా అక్రమంగా కలిపారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి ఈ నాలాపై అక్రమ నిర్మాణాలు కూల్చివేసి నాలాను మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాప్రతినిధులు కొంతమంది అధికారులకు ఫోన్ చేసి ఈ అక్రమ నిర్మాణాలను కూల్చవద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారని, అందుకే వీటి వద్దకు వెళ్లేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేషన్ సరుకుల అక్రమ స్థావరాలపై పోలీసుల దాడి

వెంగళరావునగర్: అక్రమంగా రేషన్ సరుకులు నిల్వ ఉంచిన స్థావరాలపై పోలీసులు దాడి చేసి ఆరు టన్నుల బియ్యం, గోధుమలు సీజ్ చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రెడ్డి తెలియజేసిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్‌లో కొందరు కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం (పీడీఎస్ రైస్) నిల్వ చేసినట్టు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మధురానగర్ పీఎస్ సిబ్బంది శనివారం జవహర్‌నగర్‌లోని గోడౌన్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ షానవాజ్, అబ్దుల్ రషీద్, ఎండి. యాసిన్, సయ్యద్ సర్ఫ్‌రాజ్‌లు అక్రమంగా రేషన్ బియ్యాన్ని విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన బియ్యం, గోధుమలు దొరికాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బియ్యం రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేసి ప్రజలకు అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. ఐదు టన్నుల బియ్యం, ఒక టన్ను గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాటిని అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ ఆదిత్యకు అప్పగించారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

వెంగళరావునగర్ : అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... ఏపీలోని గన్నవరం ప్రాంతానికి చెందిన మల్లేశ్వరరావుకు ఇది వరకే వివాహమైన మహిళతో గత ఏడాది వివాహమైంది. ఆమెకు ఆరేళ్ళ బాబు కూడా ఉన్నాడు. వీరు నగరానికి వచ్చి ఎల్‌బీనగర్‌లో నివాసం ఉండగా, ఆ తరువాత రహమత్ నగర్‌కు మకాం మార్చారు. కొంతకాలంగా మల్లేశ్వరరావు మద్యానికి అలవాటు పడి ఆమెను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెకు చెప్పకుండా గన్నవరం వెళ్ళిపోయాడు. ఆమె ఫోన్ చేసి రమ్మంటే తాను కాపురానికి రావాలంటే రూ.50 వేలు నగదు, రెండు తులాల బంగారం తీసుకురావాలని తెలిపాడు. దీంతో సదరు మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హిమాయత్‌నగర్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ వారు అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఐపీఎస్ అధికారి ఐజీ సత్యనారాయణ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎన్నుకున్న విద్యార్థి మండలి, ఆఫీస్ బేరర్ల వార్షిక ఇన్వెస్టిట్యూర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఐజీ సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాల స్థాయిలోనే కాకుండా ప్రభుత్వంలో కూడా మంత్రివర్గంలో సభ్యులుగా ఉండేలా కషి చేయాలన్నారు. నాయకత్వ లక్షణాలు, స్వీయ, క్రమశిక్షణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, సి.బి.ఎస్.ఇ డివిజన్ నుంచి స్కూల్ కెప్టెన్లకు బ్యాడ్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రార్థన మణికొండ, పాఠశాల డీన్ రామాంజుల, కరస్పాండెంట్ కె.ప్రభాకర్, ప్రిన్సిపాల్స్ ఫహ్మిదా, రేఖా రావు, ఫాతిమా కాజిమ్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే.. స్వేచ్ఛ, సమానత్వం

• మంత్రి జూపల్లి కృష్ణారావు



సావనీర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యతోనే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యమవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతిలో శ్రీనారాయణ గురు ధర్మ ప్రచారణ సభ ఆధ్వర్యంలో సర్వమత సమ్మేళనం వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని మూఢ విశ్వాసాలను వ్యతిరేకించి వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్ర్యం ఉండాలని భావించిన గొప్ప వ్యక్తి నారాయణ గురువు అని గుర్తు చేశారు. నారాయణ గురువు ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. మనిషి తనను తాను సంస్కరించుకొని సమాజాన్ని సంస్కరించడమే చదువు అర్థమని, కానీ నేటి విద్యా వ్యవస్థలో ఇది లోపించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యువతను సన్మార్గంలో నడపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జాతీయ బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్ నారాయణ, ప్రచారణ సభ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, ఉపాధ్యక్షుడు ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల వైభవం చాటుదాం


అధికారులతో మాట్లాడుతున్న తలసాని

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించుకుందామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి దేవాలయం పరిసర ప్రాంతాల్లో భక్తుల ఏర్పాట్ల గురించి శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగే ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని, వారంతా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భక్తులకు తాగునీరు, ప్రత్యేక వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్‌సింగ్, ఈవో మనోహర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, జలమండలి జీఎం వినోద్, కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, కిరణ్మయి పాల్గొన్నారు.

ఫిలింనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

సొసైటీ కార్యదర్శిగా కాజా సూర్యనారాయణ



ఫిలింనగర్: ఫిలింనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం శనివారం సొసైటీ కార్యాలయంలో ఎన్నికైంది. సహకార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అటికా ఫాతిమా ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఈ ఎన్నికలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడిగా ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఉపాధ్యక్షుడిగా కై కాల నాగేశ్వరరావు, సెక్రటరీగా కాజా సూర్యనారాయణ, ట్రెజరర్‌గా వై.కోటిబాబు, కార్యవర్గ సభ్యులుగా పల్లె ఉదయ్ భాస్కర్, వై.పల్లవి, పరుచూరి విజయలక్ష్మీ, ఏ.గోపాలరావు, జీ జగదీష్‌చంద్ర ప్రసాద్, నాగినీడు, నిరంజన్‌బాబు, జె. బాలరాజ్, ఎస్.భాస్కర్, వి. రఘునాథరాజు ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి పోటీ చేసిన కోటిబాబు, బాలరాజ్‌లకు చెరో ఆరు ఓట్లు రాగా లాటరీ ద్వారా కోటిబాబు ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా సొసైటీ కార్యదర్శిగా కాజా సూర్యనారాయణ వరుసగా తొమ్మిదోసారి ఎన్నిక కాగా, 32 సంవత్సరాల నుంచి ఆయన సొసైటీకి వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. ప్రెసిడెంట్‌గా ఆదిశేషగిరిరావు వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఇప్పుడు ఉన్న సొసైటీ కాంప్లెక్స్‌ను తొలగించి దాని స్థానంలో ఫిలింనగర్‌కు అద్దంపట్టే విధంగా పదంతస్తుల్లో భారీ భవనాన్ని నిర్మించాలన్నదే తమ ఉద్దేశమన్నారు.

అందరికీ సమాన వేతనాలు చెల్లించాలి

• నిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిరసన


నిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిరసన

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో భద్రత విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి వేతనాల్లో కోత విధిస్తూ పొట్ట కొడుతున్నారంటూ పలువురు సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం వేతనాలు ఇవ్వకపోగా సకాలంలోనూ చెల్లించడం లేదని అన్నారు. నిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. నిమ్స్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది అందరికీ ఒకే విధమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక ఏజెన్సీ 26 రోజులకు రూ.15 వేలు చెల్లిస్తుండగా క్యాపిటల్ సెక్యూరిటీ ఏజెన్సీ రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తోందని వాపోయారు. అది కూడా నిర్ణీత సమయంలో చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సింది వస్తోందన్నారు. కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిమ్స్ యాజమాన్యం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లే నిర్ణీత సమయంలో వేతనాలు ఇవ్వలేకపోతున్నాయని క్యాపిటల్ సెక్యూరిటీ ఏజెన్సీ అధికారి నాయర్ తెలిపారు. నిమ్స్ ఉన్నతాధికారులు సహకరించాలని ఆయన కోరారు.

అలరించిన బెంగాలీల సంగీత కచేరి

మాదాపూర్: సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో హైదరాబాద్ బెంగాలీ సమితి ఆధ్వర్యంలో కళాకారులు సౌరేంద్రో ముల్లిక్, సౌమ్యజిత్ దాస్‌లు బెంగాల్ ఆన్ బౌండ్ పేరుతో శనివారం సంగీత కచేరి నిర్వహించారు. శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పాల్గొన్నారు. అనంతరం కళాకారులు బెంగాలీ సాంస్కృతిక పాటలను ఆలపించి అలరించారు. కళాకారులు బెంగాలీ సంగీతానికి గణనీయమైన కృషి చేసినట్లు తెలిపారు.

ఏరివేతలే!

రేషన్ కార్డుల్లో సభ్యుల తొలగింపు



- చేర్పులకు కానరాని మోక్షం
- ఈకేవైసీ ఇవ్వని లబ్ధిదారులకు చెక్
- పదేళ్లలో 34.49 లక్షల మంది కట్
- ప్రస్తుత లబ్ధిదారుల సంఖ్య 59.02 లక్షలు
- గ్రేటర్‌లో పరిధిలో దయనీయ పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డుల మంజూరు దేవుడెరుగు.. పాత కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతుండగా.. కొత్త సభ్యుల చేర్పులకు మాత్రం మోక్షం లభించడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేపు మాపు అంటూ ఆశలు కల్పించి చివరికి గద్దె దిగగా.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడు మాసాలు గడిచినా యూనిట్ల ఆమోదం ఊసే లేకుండాపోయింది. గత పదేళ్లలో రేషన్ కార్డులోని సుమారు 34.49 లక్షల మంది లబ్ధిదారులను ఏరివేసిన ప్రభుత్వం.. ఆన్‌లైన్ అర్జీలకు సంబంధించి సుమారు 9.5 లక్షల కొత్త సభ్యుల ఆమోదాన్ని పెండింగ్‌లో పడేయడం విస్మయానికి గురిచేస్తోంది.

నిరంతర ప్రక్రియగా తొలగింపు

రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతరం ప్రక్రియగా తయారైంది. గత పదేళ్లలో వివిధ కారణాలతో సగానికి పైగా సభ్యులు ఏరివేతకు గురయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డులన్నింటినీ రద్దు చేసి వాటిని పూర్తిగా ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. పాత కార్డుదారులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత అనర్హులు, బోగస్, టాక్స్ పేయర్స్, ఇన్ యాక్టివ్ పేరుతో కార్డులను, అందులోని సభ్యులను ఏరివేస్తూనే.. వరుసగా రెండేళ్లు కొత్తగా కార్డుల జారీతో పాటు కార్డులో చేర్పులు, మార్పులుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత కొత్త కార్డుల మంజూరు, పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగిస్తూనే ఆమోదించే లాగిన్‌ను మాత్రం నిలిపివేసింది. పాత సభ్యుల తొలగింపును మాత్రం నిరంతర ప్రక్రియగా మార్చింది.

పెండింగ్‌లో 3 లక్షలపైగా దరఖాస్తులు..

ఎనిమిదేళ్లుగా రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేర్పుల ప్రక్రియ పెండింగ్‌లో మగ్గుతోంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సుమారు సుమారు 17.21 లక్షల పైగా కుటుంబాలు ఉండగా అందులో 59.02 లక్షల సభ్యులు ఉన్నారు. రేషన్ కార్డులు కలిగిన సుమారు 3 లక్షల కుటుంబాలు కొత్తగా 9.5 లక్షల సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో కనీసం క్షేత్రస్థాయి విచారణ లేకుండా ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లో 70 శాతానికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. విచారణ పూర్తయ్యి ఏఎస్‌ఓ, తహసీల్ లాగిన్‌లో 20 శాతం, డీఎస్‌ఓ లాగిన్‌లో 10 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

ఈ కేవైసీ పునరుద్ధరణతో..

ఇటీవల జరిగిన రేషన్ కార్డు కలిగిన ఈ కేవైసీ పునరుద్ధరణతో మూడు లక్షలకుపైగా యూనిట్లు తొలగింపునకు గురయ్యాయి. అందుబాటులో లేని, మృతి చెందిన యూనిట్లను గుర్తించి అధికారులు వేటు వేశారు. వాస్తవంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ– పాస్ ప్రక్రియ తర్వాత గత ఆరు నెలల క్రితం కేవైసీ పునరుద్ధరణ చేపట్టారు. అందులో మృతి చెందిన యూనిట్లు (లబ్ధిదారులు) 1.20 లక్షల వరకు ఉండగా, అందుబాటులో లేని యూనిట్లు 1.80 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు.

దేశం గర్వించేలా విద్యార్థులు పనిచేయాలి

సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్, డీఎస్ఐఆర్ సెక్రెటరీ డాక్టర్ కలైసెల్వి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డాక్టర్ ఎన్ కలైసెల్వి

హఫీజ్‌పేట్: దేశం గర్వించేలా విద్యార్థులు పని చేసేలా చూడాల్సిన అవసరాన్ని గుర్తించాలని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్, డీఎస్ఐఆర్ సెక్రెటరీ డాక్టర్ ఎన్ కలైసెల్వి సూచించారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ 23వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్‌ను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సముద్రంలో కూడా ఖనిజాల అన్వేషణతో ప్రకృతిని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వినాశనం వల్ల కలిగే నష్టాలను ఐటీ ఉద్యోగులు ప్రజలకు సవివరంగా వివరిస్తే సమాజానికి మేలు కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం స్టార్టప్ ఎకో సిస్టమ్ బాగా అభివృద్ధి చెందుతోందని, స్టార్టప్‌లతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. ట్రిపుల్ ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ 'సేవ్ ఎర్త్' అనే నినాదాన్ని అందరూ ముందుకొచ్చి కాపాడేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెట్లు పెంచితేనే భవిష్యత్ తరాలకు పర్యావరణం

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: రాష్ట్ర జనాభాలో 30 శాతం మహా నగరంలో నివసిస్తోందని, వారికి కనీస సౌకర్యాలు కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. దోమలగూడ ఈ సేవ కేంద్రం వద్ద రూ.7 లక్షలతో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్, పార్కును ఆయన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని అందించాలంటే ఏకైక మార్గం చెట్లు పెంచడమే అన్నారు. ప్రధాని పిలుపు ఇచ్చినట్లుగా 'మా కా నామ్ పే ఏక్ పేడ్' కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిధుల సమస్యతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు పూస రాజు, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు నలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో రాజకీయాలు తగదు


దయాకర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగులతో రాజకీయాలు తగదని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనానికి శనివారం యత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి, అధికారం కోల్పోగానే నిరుద్యోగులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నగరంలో నేడు..

1. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలు ప్రదానోత్సవం అబిడ్స్ తిలక్ రోడ్‌లోని పరిషత్తు కళామందిరంలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.
2. హెల్త్ ఫర్ ఆల్ పేరిట 'వాక్ ఏ థాన్' ఉదయం 6.30 నుంచి ఉదయం 8 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న రోటరీ పార్క్ నుంచి సచివాలయం మీదుగా రోటరీ పార్క్ వద్ద ముగుస్తుంది.
3. కాటమయ్య రక్షక కవచం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12 గంటలకు లష్కర్ గూడలో ప్రారంభిస్తారు. అనంతరం ఈత చెట్లు నాటి గౌడ కులస్తులతో సహపంక్తి భక్తి భోజనం చేయనున్నారు.

బక్క జడ్సన్ ఆమరణ దీక్ష విరమణ

ఉస్మానియాయూనివర్సిటీ: నిరుద్యోగుల కోసం 12 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బక్క జడ్సన్ శనివారం విరమించారు. ఆరోగ్యం క్షీణించడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలించగా పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆస్పత్రిలో బక్క జడ్సన్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. డీఎస్సీ పరీక్ష వాయిదా, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్–1 మెయిన్ రాత పరీక్షకు 1:100 అభ్యర్థుల ఎంపిక, గ్రూప్–2లో 2వేల పోస్టులు, గ్రూప్–3లో 3 వేల ఉద్యోగాలను పెంచాలని నిరుద్యోగులకు మద్దతుగా ఆయన ఆమరణ నిరహార దీక్ష చేపట్టారు. భవిష్యత్తు కార్యచరణను త్వరలో ప్రకటించనున్నట్లు ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రత్యంగిరా దేవి సేవలో..


లక్ష పుష్పార్చనలో డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని, (చిత్రంలో) జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కార్యదర్శి శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం శ్రీవారాహి సమేత శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, పారాయణం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 రకాల ద్రవ్యాలతో అమ్మ వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వివిధ సేవల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి గొప్ప మంత్ర స్వరూపులని, వారు నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ ఆమెకు అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో విఠల్‌శర్మ, సంపత్, అరుణ, రాజేశ్వరి, హేమ, సాయికుమార్‌శర్మ, రామశర్మ పాల్గొన్నారు.

కళలు మన జీవనాడి

మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి



నాంపల్లి: భారతీయ కళలతో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేయాలని మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో భారతీయ లలిత కళా ఉత్సవ్ శనివారం వైభవోపేతంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. భారతీయ లలిత కళలు ఎంతో గొప్పవని అన్నారు. ఆధునిక సమాజంలో కళలను మర్చిపోతున్నారని, తద్వారా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కళలను నువ్వు బతికిస్తే.. అవి నిన్ను బతికిస్తాయని వివరించారు. పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. లలిత కళలు మన జీవనాడి అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఇండో కెనడా యూత్ అధ్యక్షురాలు రొయ్యూరు ఆశ్రిత మాట్లాడుతూ.. భారతీయ లలిత కళలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల్లోని నిష్ణాతులైన 25 మంది ప్రతిభావంతులకు జాతీయ స్థాయిలో కళారత్న, విద్యారత్న, వైద్యరత్న, సేవారత్న, సంఘమిత్ర, పర్యావరణ మిత్ర, రైతుమిత్ర పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ధారావత్ బాలసన్‌నాయక్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి, సినీ ప్రొడ్యూసర్ మాగంటి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సదాశివుడి సాహిత్యం.. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి

మాజీ మంత్రి హరీష్‌రావు

గన్‌ఫౌండ్రీ: గోదావరి గొంతుక మల్లావజుల సదాశివుడు సాహిత్యం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రేరణగా నిలిచిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మల్లావజుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదాన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మోహన్‌రుషి, పసునూరు శ్రీధర్‌బాబుకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను హరీష్‌రావు కొనియాడారు. ఆయన సాహిత్యం నేటికీ స్ఫూర్తి రగిలిస్తుందని గుర్తు చేశారు. తాము పాలించిన సమయంలో రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి సారించి కొన్ని అంశాలను విస్మరించామని, ఆత్మవిమర్శ చేసుకొని సరిదిద్దుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్రంలో మళ్లీ పాతకష్టాలు మొదలయ్యాయని, గోదావరి నదిలో నీరు ప్రవహిస్తున్నా విడుదల చేసేందుకు ప్రభుత్వానికి మనస్సు రావడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయానంద్, గ్రంథాల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఏ.శ్రీధర్, బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, చేతన సాహితీ సమాఖ్య అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే గుర్తింపు

డీఆర్‌డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి

మణికొండ: రాబోయే సమాజాన్ని ప్రభావితం చేసే వృత్తిపరమైన ప్రపంచంలో నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేసి యువ ఇంజినీర్లు ముందుకెళ్లాలని డీఆర్‌డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో 2020 నుంచి 2024వరకు చదువుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పట్టాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా ఆయన మాట్లాడుతూ నైతిక పద్ధతులు, అంకితభావంతో పనిచేస్తేనే రాణించే అవకాశం ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ అయిన ప్రతి ఒక్కరూ ఉన్నతంగా రాణించలేరని, ప్రత్యేకతలు ఉన్నవారు కొంత మంది మాత్రమే రాణిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనలోని ప్రత్యేకతలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేపడితేనే గుర్తింపు సాధ్యమన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే జీవితంలో రాణించే అవకాశం ఉటుందన్నారు. ఈ సందర్భంగా 2,100 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.రాములు, కాగ్నిజెంట్ క్యాంపస్ హెచ్‌ఆర్ వేణుగోపాల్, అధ్యాపకులు, గ్రాడ్యుయేట్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్‌డేలో అతిథులు, ప్రిన్సిపాల్

అరకులో ఎంఎస్ఎఫ్ శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బౌద్ధనగర్: విద్యా సంవత్సరం ప్రారంభమై నూతన విద్యార్థులు కళాశాలలు, హాస్టళ్లకు వస్తున్న ఇటువంటి సమయంలోనే తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో ఎంఎస్ఎఫ్ పూర్తి కమిటీల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎంఎస్ఎఫ్ జాతీయ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అధ్యక్షతన పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ విశాఖపట్నంలోని అరకులో ఆగస్టు నెలలో ఎంఎస్ఎఫ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) జాతీయ మహాసభ మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనిర్సిటీలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్, ఏపీ అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ, నేతలు కొమ్ము శేఖర్, చిరంజీవి, మణిందర్, శివకుమార్, ముఖేష్, రఘువరన్, అజయ్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

అనాథ బాలికల కేంద్రంలో ఓపెన్ లైబ్రరీ

ప్రారంభించిన 8వ తరగతి విద్యార్థి ఆకర్షణ సతీష్


బోలక్‌పూర్ అనాథ బాలిక కేంద్రంలో ఓపెన్ లైబ్రరీ ప్రారంభిస్తున్న ఆకర్షణ సతీష్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లోని ఆగ్జిలియమ్ నవజీవన బాలికల అనాథాశ్రమంలో శనివారం నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ తన స్నేహితులు, బంధువుల ద్వారా సేకరించిన పుస్తకాలతో పలుచోట్ల ఓపెన్ లైబ్రరీలను ప్రారంభిస్తున్నారు. 14వ ఓపెన్ లైబ్రరీని బోలక్‌పూర్ నవజీవన్ అనాథ బాలికల కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, యూనిసెఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ డేవిడ్ రాజ్, ఇఫ్లూ మాజీ లైబ్రరియన్ ప్రఫుల్ల చంద్ర, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తస్నీరు ప్రమోద, విజయ భాస్కర్, సయ్యద్ నబీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి జీవితాన్ని సమూలంగా మార్చేయడంతో పాటు దశా దిశ సూచిస్తుందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్న ఆకర్షణను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ అభినందించారని తండ్రి సతీష్ చెప్పారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 14, జూలై, 2024



ఇంద్రావతి, మంగ్లీ యుగళం..



ప్రముఖ తెలుగు గాయని మంగ్లీ, మరో గాయని ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. ఎల్బీనగర్, సాగర్ రింగ్‌రోడ్‌లోని అర్బన్ మాయాబజార్ రెస్టారెంట్‌లో ఈ నెల 20న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేకమైన గాత్రాన్ని సొంతం చేసుకున్న మంగ్లితో పుష్ప సినిమాలోని ఊ అంటావా మావా పాటతో ఊపేసిన ఇంద్రావతి చౌహాన్ గళం కలపనుండడంతో ఈ కార్యక్రమం పట్ల సంగీతాభిమానుల్లో ఆసక్తి ఏర్పడింది. రాత్రి 8గంటల నుంచి ఈ మ్యూజికల్ ఈవెంట్ ప్రారంభం కానుంది.

ఇనార్బిట్‌లో 'పాప్ బీట్.. ఆర్ట్ ట్రీట్'..



మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సంగీతపు సందడికి వేదిక కానుంది. ఈ నెల్లో వారాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి వరకూ ఈ మ్యూజిక్ ఈవెంట్స్ జరుగుతాయని అలాగే కళాభిమానులు, చిత్రకారుల కోసం కళాత్మక వర్క్‌షాప్స్, ఉచిత వ్యంగ్య చిత్రాల ప్రదర్శన.. వంటివి నిర్వహిస్తున్నామని మాల్ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా ఈ నెల 20, 21 తేదీల్లో ఉచిత రేసిన్ వర్క్ షాప్ ఏర్పాటు చేస్తున్నామని, హస్తకళల పట్ల ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని వివరించారు. మాల్ సందర్శకులు కాంప్లిమెంటరీ క్యారికేచర్ తదితర విభిన్న రకాల రివార్డ్స్ గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

హ్యాపీ తెలంగాణకు వాక్‌థాన్..



లక్డీకాపూల్: వేసే ప్రతి అడుగూ ఆరోగ్యవంతమైన జీవనవిధానానికే అంటున్నారు వాక్‌థాన్ నిర్వాహకులు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ హ్యాపీ తెలంగాణ కోసం ఈ వాక్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న రోటరీ పార్క్ కేంద్రంగా జరగనుంది. ఇందుకు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, సుధాకర్ పైప్స్, ఎన్ సూర్, డెకాథ్లాన్ ప్లే సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. హెల్దీ తెలంగాణ నిర్మాణం కోసం చేసే ప్రయత్నంలో భాగంగా చేపట్టిన ఈ వాక్‌థాన్ రోటరీ పార్క్ నుంచి మొదలై సచివాలయం వరకూ వెళ్లి తిరిగి రోటరీ పార్క్ వద్ద ముగుస్తుంది. వాక్‌లో పాల్గొనే వాళ్లకు డెకాథ్లాన్ సంస్థ టీ షర్ట్స్ అందజేయడంతో పాటు, ఉచితంగా ఓచర్లను అందజేయనుంది. ఆసక్తి కలిగిన వాళ్లు 8309789050కు సమాచారం ఇచ్చిన తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు సూచిస్తున్నారు.

స్టార్స్.. కార్స్

- బాలీవుడ్ స్టార్లకు ధీటుగా మోడళ్లు..
- కాస్ట్‌లీ కార్లకు కేరాఫ్‌గా హైదరాబాద్..
- అరడజన్‌కు తగ్గకుండా కలెక్షన్..
- లగ్జరీ వాహనాలపై టాలీవుడ్ సెలబ్స్ క్రేజ్



నగరంలో నివసించే స్టార్లు.. తమ ఇమేజ్‌కు తగ్గట్టుగా షి'కార్లు' చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్లకు ధీటుగా రెమ్యునరేషన్స్‌లో పోటీపడుతున్న టాలీవుడ్ స్టార్స్ కార్ల వేటలోనూ ముందున్నారు. దీంతో రూ.కోట్ల విలువ చేసే కార్లకు నిలయంగా మన భాగ్య నగరాన్ని మార్చడంలో టాలీవుడ్ సెలబ్రిటీలదే పైచేయి. ఆ విషయం ప్రస్తుతం మన స్టార్ల దగ్గరున్న ఖరీదైన కార్లను పరిశీలిస్తే అర్థమవుతుంది. దీని గురించిన మరిన్ని విశేషాలు...

- సాక్షి, సిటీబ్యూరో

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే.. గత తరం సూపర్ స్టార్స్ లాగా టాలీవుడ్ యంగ్ స్టార్స్.. ఒకటీ అర కార్లతో సరిపుచ్చుకోవడం లేదు. టాప్ 5 హీరోలుగా ఉన్న వారంతా కనీసం అరడజను కార్లకు తగ్గకుండా కలెక్షన్‌ను మెయిన్‌టైన్ చేస్తూ, కార్లపై వారికి ఉన్న క్రేజ్‌ను చాటుకుంటున్నారు.

ఇమేజ్‌కు తగ్గట్టుగా మెయింటెనెన్స్..



రామ్ చరణ్‌వాడే రోల్స్ రాయిస్



అల్లు అర్జున్‌ని దాటేసిన రామ్‌చరణ్..

ఇప్పటిదాకా టాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన స్టార్ కార్ స్టైలిస్ట్ స్టార్ అల్లు అర్జున్ దగ్గర ఉన్న రూ.6.95 కోట్లు ఖరీదు చేసే రోల్స్ రాయిస్ క్యులినన్ కాగా ఆ తర్వాత స్థానం రెబల్ స్టార్ ప్రభాస్ దగ్గర ఉన్న రూ.6 కోట్ల విలువైన లంబోర్గిని అవెంటాడర్ ఎస్ రోడ్‌స్టార్ ది కాగా ఇప్పుడు వీరిద్దరినీ తోసిరాజని రామ్ చరణ్ తాజాగా కొన్న రూ.7.5 కోట్ల ఖరీదైన బ్లాక్ రోల్స్ రాయిస్ స్పెక్ట్రా నెం1 కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే రామ్ చరణ్‌కు రూ.2.8కోట్ల ఖరీదైన మెర్సిడస్ మేబ్యాచ్ జీఎల్ఎస్ 600తో పాటు పలు కంపెనీల లగ్జరీ కార్లు ఉన్నాయి.


జూనియర్ ఎన్టీఆర్ వాడే ఫెరారీ

స్టైలిష్ కలెక్షన్..

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ దగ్గర కూడా మంచి కలెక్షన్ ఉంది.. ఆయన దగ్గర రూ.2.5కోట్లు ఖరీదు చేసే రేంజ్ రోవర్ వోగ్, రూ.1.6 కోట్లు ఖరీదైన వాల్వో ఎక్స్‌సీ90టీ8 లతో పాటు మరికొన్ని కార్లూ ఉన్నాయి. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ దగ్గర రూ.3.10 కోట్లు ఖరీదు చేసే లంబోర్గిని యురస్‌ని తో పాటుగా పోర్ష్ 718 కేమ్యాన్, మెర్సిడెస్ బెంజ్ జీఎల్ఎస్, రేంజ్ రోవర్, మెర్సిడస్ మేబ్యాచ్, బీఎండబ్ల్యూ 7 సిరీస్.. తదితర కార్లతో అదిరిపోయే కలెక్షన్ ఉంది. రూ.4.37కోట్ల ఖరీదైన రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీని నాగ చైతన్య వినియోగిస్తున్నారు. ఆయన గత నెల్లోనే తన లగ్జరీ కార్ల కలెక్షన్‌కు రూ.3.51 కోట్లు ఖరీదైన పోర్ష్ 911 జీటీ3 ఆర్ఎస్ కార్‌ను కూడా జత చేశారు. ఇక ప్రిన్స్ మహేష్‌బాబు రూ.2.6కోట్ల విలువైన రేంజ్‌రోవర్ వోగ్ వాడుతుండగా, ఆయన సమకాలీకుడైన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కు రూ.4.5 కోట్ల విలువ చేసే రేంజ్ రోవర్ 3.0 ఎస్‌వి ఆటోబయోగ్రఫీ ఉంది. గత తరం టాప్ హీరోల్లో మెగాస్టార్ చిరంజీవి రూ.2 కోట్లపైన విలువ చేసే రోల్స్ రాయిస్ ఫాంటమ్ ఉండగా, కింగ్ నాగార్జున రూ.2.5 కోట్లు విలువ చేసే మెర్సిడస్ బెంజ్ జీ3 ఏఎమ్‌జీ వాడుతున్నారు.

స్టార్స్‌ని మించిన కార్స్..

టాలీవుడ్ సెలబ్రిటీలను తలదన్నుతూ నగరానికి చెందిన వ్యాపారవేత్త నజీర్ ఖాన్ రూ.12 కోట్లు విలువ చేసే మెక్‌ల్యారెన్ 765ఎల్‌టీ స్పైడర్‌ను గత ఏడాది కొనుగోలు చేసి సంచలనం సృష్టించారు. అప్పటి దాకా ఇదే భారతదేశంలో ఖరీదైన కారు కావడం విశేషం.




నాగార్జున వాడే మెర్సిడస్ బెంజ్

(టాలీవుడ్ స్టార్ల కార్లు, వాటి ధరలు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇవ్వడం జరిగింది. ఇందులో మార్పు చేర్పులు ఉండవచ్చు)

హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్..



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి తనీషామెహతా, శ్రవంతి చోకరపు, అమిక్ష నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. 350 మంది డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఫ్యాషన్, ట్రెండింగ్ స్టైల్, గృహాలంకరణ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

దమ్ కా రోట్..

నోరూరిస్తున్న పండుగ రుచి



- చారిత్రక వంటకానికి ఫుల్ డిమాండ్.
- హలీమ్ తరహాలోనే ప్రాచుర్యం
- మొహర్రం నెల్లో భారీ విక్రయాలు

నగరవాసులకు ప్రీతిపాత్రమైన దమ్ కా రోట్ తిరిగి వచ్చింది. మొహర్రం నెల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ కుకీ.. మతాలకు అతీతంగా హలీమ్ తరహాలోనే నగరవాసులకు దగ్గరైంది. అన్ని బేకరీల్లో తయారు చేసి విక్రయించే ఈ ప్రసిద్ధ కుకీ... హిజ్రీ క్యాలెండర్‌లోని మొదటి నెల అయిన మొహర్రం టైమ్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం వల్ల దీనికి మొహర్రం నెల అంతా ఫుల్ డిమాండ్ ఉంటుంది.

- సాక్షి, సిటీబ్యూరో

ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన మనమడు ముఖరంజా బహద్దూర్ సుఖసంతోషాలు, భద్రమైన భవిష్యత్తు కోసం ఈ రోట్‌ని చార్మినార్ దగ్గరలోని నాలా ఏ ముబారక్ ఆలమ్‌కు అందించారని నమ్ముతారు. అప్పటి నుంచి ఇది ఒక సంప్రదాయంగా స్థిరపడిందట. నిజాం మొహర్రం ఊరేగింపులో దుఃఖితులకు ఈ రకమైన కుక్కీని అందించినట్లు మరో కథనం కూడా ఉంది.

ఇళ్లలో పుట్టి బేకరీలలో మెట్టి..

మొహర్రం సందర్భంగా అప్పటి నుంచి తమ వారి క్షేమాన్ని కాంక్షిస్తూ ఈ రోట్‌ని ఇళ్లలో తయారు చేసి ఆలమ్ దగ్గర పంచడం సంప్రదాయం. ఇళ్లలో దీనిని పిండి ముద్దగా చేశాక ఓవెన్లలో వేసి బేకింగ్ చేయడం కోసం బేకరీలకు తీసుకురావడం ఆ తర్వాత మొదలైంది. అలా ఇప్పుడు బేకరీలే తయారు చేసి విక్రయిస్తున్నాయి. ఇప్పటికీ కొందరు ఇళ్లలోనే తయారు చేసే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నప్పటికీ అత్యధికులు మాత్రం సుభాన్ బేకరీ తదితర ప్రసిద్ధ బేకరీలలోనే కొనుగోలు చేస్తుంటారు. కాగా ప్రస్తుతం ప్రసిద్ధ బేకరీలన్నింటిలో ప్రస్తుతం రోట్ రద్దీ కనిపిస్తోంది.

అదిరిపోయే క్రేజ్...

'దమ్ కా రోట్' అనేది క్రిస్పీ కుకీగా పేర్కొనవచ్చు. ఇది దాదాపు టీ సాసర్ పరిమాణంలో ఉంటుంది. గోధుమ పిండి, రవ్వ, కూరగాయల నూనె, చక్కెర, తేనె, బటర్, ఉప్పు, యాలకులు, పాల ఉత్పత్తులతో దీన్ని తయారుచేస్తారు. దీని రుచికి ఫిదా అయిపోతున్న నగరవాసులు భారీగా కొనుగోళ్లు చేస్తుండడంతో.. నగరంలోని రోట్ తయారీదారులు రుచి ధరల పరంగా పోటీ పడుతున్నారు. 'ఇది పూర్తి శాఖాహారం. దీని తయారీలో మేం గుడ్లను ఉపయోగించం' అని నాంపల్లిలోని సుభాన్ బేకరీకి చెందిన సయ్యద్ ఇర్ఫాన్ అన్నారు.



మూడు దశాబ్దాలుగా...

గోల్కొండ: మూడు దశాబ్దాలకు పైగా నగర వాసులకు రుచికరమైన దమ్ కా రోట్‌లు అందిస్తున్నాం. టోలిచౌకీ వద్ద ఉన్న పిస్తాహౌజ్‌లో దమ్ కా రోట్‌ల అమ్మకాలను శనివారం ప్రారంభించాం. ఇవి కేవలం మొహర్రం మాసంలోనే అందుబాటులో ఉంటాయి. దమ్ కా రోట్‌ల తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వేయించిన రవ్వ, డ్రైఫ్రూట్స్ వాడుతాం.

- ఎండి అబ్దుల్ మోసిన్, పిస్తాహౌజ్ డైరెక్టర్

ప్రముఖులు సైతం కొనుగోలు చేస్తారు..

ఈ దమ్ కా రోట్‌ని బేకరీల్లో విక్రయిస్తున్న అత్యంత పురాతన బేకరీ మాది. పూర్తి సంప్రదాయబద్ధంగా తయారు చేసిన ఈ రోట్‌ని నగరవాసులు అత్యంత ఇష్టంగా మొహర్రం నెలలో కొనుగోలు చేస్తారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు సైతం ఈ సమయంలో భారీ ఎత్తున ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించి దగ్గరవారికి పంపిణీ చేస్తుంటారు. హాఫ్‌కేజీ, కేజీ.. బ్యాగ్స్‌లో ఈ రోట్‌ను విక్రయిస్తున్నాం.

-సయ్యద్ లుక్మన్, సుభాన్ బేకరీ

అంతర్జాతీయ ఎగుమతులు

పూర్తిగా హైదరాబాద్‌కు చెందిన ఈ సంప్రదాయ వంటకం.. ఇప్పుడు అంతర్జాతీయంగా కూడా విస్తరించింది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు తమ బేకరీని సందర్శించి దమ్ కా రోట్‌ను కొనుగోలు చేస్తున్నారని పిస్తాహౌస్‌కు చెందిన ఎంఏ మజీద్ అంటున్నారు. పదార్థాలకు బెల్లం కేసర్ జోడించి టోలిచౌకిలోని బేక్‌వెల్ కేక్ హౌస్‌లో 'గుర్ రోట్' పేరిట మరో రకం కుకీని విక్రయిస్తున్నారు. అంతే కాక ఈ కుకీకి పెరిగిన ఆదరణతో ఇతర దేశాలకు సైతం బేకరీలు సరఫరా చేస్తున్నాయి.

వీకెండ్ @ వికారాబాద్

- ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
- నగరానికి సమీపంలో టూరిజం స్పాట్
- వారాంతంలో వేల సంఖ్యలో పర్యాటకులు
- అధునాతన వసతులతో హరిత రిసార్ట్

అలరిస్తున్న ట్రెక్కింగ్, బోటింగ్

మహానగరానికి దగ్గరగా.. కాలుష్యానికి దూరంగా.. పచ్చని రంగేసినట్లుండే కొండలు, వనాన్ని తలపించే వృక్షాలతో నిండిన అటవీ ప్రాంతం.. ఉదయం, సాయంత్రం పురివిప్పి నాట్యం చేసే నెమళ్లు, వందలాది పక్షిజాతులు.. కొండలు, గుట్టలు ఎక్కాలని కోరుకునే వారికి ట్రెక్కింగ్ ట్రాక్.. భక్తితో కొలిచే వారికి కొంగు బంగారంగా వెలుగొందుతున్న అనంతపద్మనాభ స్వామి దేవాలయం.. ఇవన్నీ అనంతగిరి అటవీ ప్రాతం సొంతం. మరో అడుగు ముందుకేస్తే సరదా బోటింగ్.. కోట్‌పల్లి జలాశయంలో కాయాకింగ్ సదుపాయం.. ప్రకృతి ప్రేమికులకైనా.. వారాంతంలో సేదతీరేందుకు టూర్ ప్లాన్ చేసుకునే వారికైనా వికారాబాద్ తొలిప్రాధాన్యంగా కనిపిస్తోంది. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో ఒక్కరోజులో ఎంజాయ్ చేసిరావచ్చు.

- సాక్షి, సిటీబ్యూరో



వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న అనంతగిరి అటవీ ప్రాంతం నవాబుల కాలం నుంచి పర్యాటక ప్రాంతంగా, ఔషధ వనమూలికలు కలిగిన వృక్షాలకు నిలయంగా ప్రసిద్ధి. అనంతగిరి గుట్టపైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక శాఖ హరిత రిసార్ట్ నిర్మించింది. స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్, ప్లే ప్లేస్, గార్డెన్, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. రాత్రికి ఫైర్ క్యాంప్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో ఇక్కడ స్టే చేయడం కోసం ముందస్తుగా గదులు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. వారాంతంలో అప్పటికప్పుడు స్టేయింగ్ దొరకాలంటే కష్టం. అటవీ శాఖకు చెందిన గెస్ట్ హౌస్ ఇక్కడే ఉంటుంది. సిబ్బందిని సంప్రదిస్తే ఉదయం ట్రెక్కింగ్‌కు తీసుకెళతారు. అడవిలో నలుదిక్కులు తిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. ఈ సీజన్(వర్షాకాలం)లో అనంతగిరి కొండల్లో జలపాతాలు పర్యాటకులను కనువిందుచేస్తాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో అనంతగిరి గుట్టపై వ్యూ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి అడవి మొత్తాన్ని చూడొచ్చు. ఈ ట్రిప్‌కి ఒక్కొరికీ రూ.3000 నుంచి రూ.5000 వరకూ ఖర్చు అవుతుంది.

బోటింగ్..

అనంతగిరి కొండల నుంచి 15 కిలోమీటర్ల దూరంలో కోట్‌పల్లి జలాశయం ఉంటుంది. ఇక్కడ బోటింగ్(కాయాకింగ్) చేయవచ్చు. వారాంతాలు, సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బోటింగ్ కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఒక్కరికి రూ.250, పెయిర్‌కి రూ.450 ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ బోటింగ్‌కు అనుమతిస్తారు.



ఆధ్యాత్మికంగానూ..

అనంతగిరిలో వెలసిన అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రజలు గట్టిగా నమ్ముతారు. సుమారు 5వేల సంవత్సరాల క్రితం మార్కండేయుడు ఇక్కడ తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. సెలవు రోజుల్లో వేల సంఖ్యలో ఉంటారు.

ఎలా వెళ్లాలి..

హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు 65 కిలోమీటర్లు. మొయినాబాద్, చేవెళ్ల మీదుగా హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిలో మన్నెగూడ దగ్గర వికారాబాద్ వైపు తిరగాలి. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, పటాన్‌చెరువు, తదితర ప్రాంతాల ప్రజలు శంకర్‌పల్లి మీదుగా రావచ్చు. సికింద్రాబాద్, బేగంపేట్, లింగంపల్లి మీదుగా రైలు సదుపాయం ఉంది.


హరిత రిసార్ట్‌లో బుకింగ్స్ కోసం.. 9010911122

పేదలపై అక్కసు

దళిత, పేద రైతులకు యాజమాన్య హక్కులివ్వడం తప్పా?

- దశాబ్దాలుగా తమ భూములపై హక్కులు లేకుండా బతికిన పేద రైతులు
- వారిని సంపూర్ణ భూ యజమానులుగా మార్చేందుకే అసైన్డ్ చట్టం తెచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఇదివరకెన్నడూ లేని విధంగా 27 లక్షల మంది రైతులకు లబ్ధి
- తమ భూములపై హక్కులొచ్చాక కొందరు రైతులు అమ్ముకుంటే మీకేంటి బాధ?
- 'తల్లికి వందనం'పై దొంగాట నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే దుష్ప్రచారం

అసైన్డ్ భూముల రైతులకు చరిత్రాత్మక రీతిలో వైఎస్ జగన్ హయాంలో దక్కిన యాజమాన్య హక్కులను ప్రశ్నించేలా ఎల్లో మీడియా.. ప్రధానంగా 'ఈనాడు' వింత ధోరణి ప్రదర్శిస్తోంది. వారి భూములపై వారికి హక్కులు ఇవ్వడమే నేరమన్నట్లు వక్ర భాష్యాలు చెబుతోంది. పేద రైతులు, దళితులు ఇంకా బానిసత్వంలోనే బతకాలని కోరుకుంటోంది. వారి భూములకు వారు యజమానులుగా మారడం సరికాదంటూ ఏడుపుగొట్టు రాతలతో దుష్ప్రచారం చేస్తోంది. పేదలు, దళితులు ఆర్థికంగా ఎదగడానికి వీల్లేదంటూ పెడబొబ్బలు పెడుతూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతోంది.

దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక రాష్ట్రంలో లక్షలాది మంది అసైన్డ్ రైతులు అష్టకష్టాలు అనుభవించారు. ఏళ్ల తరబడి ఆ భూములకు హక్కులివ్వాలని ప్రాధేయపడినా ఏ ప్రభుత్వం కనికరించడలేదు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో దళిత, ఇతర పేద రైతులకు ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు యాజమాన్య హక్కులు లభించాయి. తద్వారా 20 ఏళ్లకు పైబడి తమ ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములపై పేద, దళిత రైతులకు సంపూర్ణ అధికారాలు దఖలు పడ్డాయి. లక్షలాది మంది పేద రైతులు వారి భూములపై యాజమాన్య హక్కులు పొంది సంపూర్ణ రైతులుగా మారారు. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో కొంత మంది రైతులు వాటిని విక్రయించారు. ఆ సొమ్ము ద్వారా పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు, ఇతరత్రా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కారు. చంద్రబాబు అండ్ గ్యాంగ్‌ను వెనకేసుకొస్తున్న 'ఈనాడు'కు ఇది ఏమాత్రం గిట్టడం లేదు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసైన్డ్ భూముల చట్టాన్నే అపహాస్యం చేసేలా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా దిగజారి వ్యవహరిస్తోంది. అసైన్డ్ భూములకు ఎసరు పెట్టేశారంటూ పేద, దళిత రైతులు తమ భూములపై నిర్ణయం తీసుకోవడాన్ని అవమానకరంగా వక్రీకరిస్తోంది. ఆ భూములను అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు కారుచౌకగా కొనుగోలు చేశారని నిరాధారంగా నిందిస్తోంది. పేద రైతులు కొత్తగా వచ్చిన యాజమాన్య హక్కుల ఆధారంగా తమ భూమిని అమ్ముకుంటే దాన్ని ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ విపరీత అర్థాలు తీస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఏటా రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు తల్లికి మాత్రమే ఇస్తామని బొంకుతున్న విషయం బయట పడటంతో.. తమ మోసాన్ని ప్రజలు గ్రహించకుండా దృష్టి మళ్లించడానికి 'చంద్రబాబు అండ్ కో' అసైన్డ్ హక్కుల వ్యవహారాన్ని తెర మీదకు తెచ్చింది. మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా, ప్రజలకు మేలు చేసేలా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఎలా తొలగించాలన్న దానిపైనే చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఎల్లో మీడియా, ప్రధానంగా ఈనాడు శకుని పాత్ర పోషిస్తోంది. ఏ ప్రభుత్వమైనా ఒక కార్యక్రమాన్ని అమలు చేసినప్పుడు ఎలాంటి పక్షపాతం లేకుండా పరిశీలించి.. ఇంకా ఎలా మంచి చేయొచ్చు అని చెప్పే బాధ్యత పత్రికలకు ఉంటుంది. కానీ మేలు చేస్తున్న కార్యక్రమాలను ఎత్తివేయాలని, తీసివేయాలంటూ పనిగట్టుకుని తప్పుడు రాతలు రాయడం దారుణం. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది పేద వాళ్లు. పేదలకు నష్టం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం, ఎల్లో మీడియా ఉన్నట్టు మరోసారి రుజువైంది. చంద్రబాబు, తాము బాగుంటే చాలని ఈనాడు కిరణ్ అనుకోవడం దుర్మార్గం.

అసైన్డ్ భూములు దోచిందెవరు?

నిజంగా అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడింది ఎవరు? గతంలో చంద్రబాబు ప్రభుత్వం కాదా? రాజధాని పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను మభ్యపెట్టి, మోసం చేసి 1,100 ఎకరాలు కొట్టేశారు. వాళ్ల చేతిలో ఉంటే పరిహారం రాదని, ప్లాట్లు రావని చెప్పి లాగేసుకున్నారు. ఆ తర్వాత జీవో ఇచ్చి చేతులు మారిన భూములను పూలింగ్‌లోకి తీసుకుని టీడీపీ బినామీలకు ప్లాట్లు కేటాయించి కోట్లు కొల్లగొట్టారు. 1,336 మంది బినామీలు ఇలా ఉన్నారు. దీనిపై కేసు నడుస్తోంది. ఈ కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని ఇదే ఈనాడు ఏనాడైనా నాలుగు వాక్యాలు రాసిందా? అసైన్డ్ భూముల సమస్య ఈనాటిది కాదు. పేదలు, రైతులు అందరూ ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఉన్నాం కష్టం వస్తే.. దాన్ని ఏదోలా ఉపయోగించుకుందామన్నా.. చేసుకోలేని పరిస్థితి. పైసాకో, పరక్కో ఏదో ఒక కాగితం మీద రాసిచ్చి ఎంతో కొంత తీసుకునే పరిస్థితి. రికార్డుల్లో ఒక పేరు.. భూమి దగ్గరకు వస్తే మరొకరి పేరు. దేనికీ పొంతన లేదు. ఒకరేమో కష్టం తీర్చుకోవడం కోసం అమ్ముకుంటే, దాన్ని కొనుక్కున్నవాడికీ కంటిమీద కునుకులేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టానికి సవరణలు చేసింది. గత ఏడాది అక్టోబరు 27న దీనికి సంబంధించి గెజిట్ జారీ అయ్యింది. నిజంగా ఎవరో ఒకరికి లబ్ధి చేకూర్చాలనుకుంటే.. ఎవరి ఆధీనంలో భూమి ఉంటే వారికే ఇచ్చేయండి అని చెప్పేవారు. కాని అలా జరగలేదు. ఏ పేదవాడు అయితే లబ్ధిదారో, ఒరిజనల్ అసైనీగా ఉన్నాడో, వారు లేకపోతే వారసులు ఎవరున్నారో వారికే సర్వహక్కులూ ఇవ్వండని చెప్పింది. ఇందులో తప్పు ఏముంది? ఇప్పుడు వీరందర్నీ రోడ్డు మీదకు ఈడ్చాలని చూస్తున్నారా? పేదల పొట్టకొట్టాలని చూస్తున్నారా?

ఇదీ అసైన్డ్ భూముల నేపథ్యం

వివిధ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు వ్యవసాయం కోసం భూమి అసైన్ చేసే విధానం కొన్ని దశాబ్దాల క్రితం మొదలైంది. 1954కు ముందు అసైన్ చేసిన భూములది ఒక కేటగిరీ, 1954 తర్వాత మరో కేటగిరీ. 1954కు ముందు అసైన్డ్‌దారులకు ఇచ్చిన పట్టాల్లో ఎక్కడా అమ్ముకోకూడదనే షరతు లేదు. 1954 తర్వాత ఇచ్చిన అసైన్డ్ పట్టాల్లో మాత్రం ఈ నిబంధన పెట్టారు. దీంతో ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో చేరాయి. వాటిని అమ్ముకునే అవకాశం లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన వెబ్‌ల్యాండ్ దుర్మార్గాల వల్ల 1954కు ముందు అసైన్డ్ చేసిన భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. వాటిని తొలగించుకోవడానికి రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగి, లంచాలు ఇచ్చి విసిగిపోయిన రైతులు ఎంతో మంది ఉన్నారు. 1954 నుంచి కూడా పేదలకు భూములు ఇవ్వడం (అసైన్‌మెంట్లు) జరుగుతూనే ఉంది. అయితే 70 సంవత్సరాల తర్వాత కూడా ఆ భూముల మీద వారికి హక్కులు లేవు. రెండు, రెండున్నర ఎకరాల వరకూ అసైన్‌మెంట్ పట్టా ఉన్న వాళ్లు తమ అవసరాల కోసం ఒక అరెకరం అమ్ముకోవాలనుకుంటే చట్ట ప్రకారం అమ్ముకోవడం కుదరదు. దీంతో సాదా బైనామా (కాగితాల మీద రాసుకోవడం) పద్ధతిలో భూముల అమ్మకాలు జరిగాయి. దీనివల్ల నిరుపేదలైన అసైనీలకు రావాల్సిన రేటులో కనీసం 25 శాతం కూడా వచ్చేది కాదు. భూమిని అమ్ముకోకుండా సాగు చేసుకున్న వారు కూడా టైటిల్ లేకపోవడంవల్ల రెవెన్యూ శాఖ నుంచి ఎప్పుడైనా నోటీసులు వస్తాయని, ఆ భూమిని ప్రభుత్వం ఎక్కడ తీసేసుకుంటుందోనని, ఎక్కడ రిజర్వ్ చేస్తుందోనని భయాందోళనలు ఉండేవి. ఇటు అసైనీకి.. అటు కొనుక్కున్న వారికి లబ్ధి లేదు. మరోవైపు రెవెన్యూ రికార్డులు క్షేత్ర పరిస్థితిని తెలియజేసేలా లేవు. రికార్డులు ఒకరి పేరు మీద ఉంటే.. భూములు మరొకరి ఆధీనంలో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 19,21,855 మందికి 33,29,908 ఎకరాలను ప్రభుత్వాలు అసైన్‌మెంట్ చేస్తే.. ఆ రికార్డులేవీ క్షేత్ర స్థాయికి అనుగుణంగా లేవు.

అసైన్డ్ భూములకు హక్కులపై 'ఈనాడు' వక్రభాష్యం



అధ్యయనం తర్వాతే అసైన్డ్ చట్ట సవరణ

కలెక్టర్లు పలుమార్లు వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టికి అసైన్డ్ భూముల సమస్యను తీసుకువచ్చాక రెవెన్యూ మంత్రి నేతృత్వంలో 13 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో 2022 ఆగస్టు 30వ తేదీన ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ కర్ణాటక, తమిళనాడులో పర్యటించి అక్కడి విధానాలపై అధ్యయనం చేసింది. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత అసలైన ఒరిజనల్ లబ్ధిదారులకు, లేదా వారి వారసులకు అవసరమైనప్పుడు అమ్ముకునేందుకు వీలు కల్పించాలని, దానికి అనుగుణంగా ఏపీ అసైన్‌మెంట్ చట్టం (పీఓటీ)– 1977కు సవరణలు చేయాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. దీనికి అప్పటి మంత్రివర్గం ఆమోదం తెలిపి, చట్టానికి సవరణలు చేసింది. అదే సందర్భంలో 20 ఏళ్లకు ముందే ఎవరైనా పేద రైతుల నుంచి భూములు కొనుక్కుని ఉంటే వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారికి ఎలాంటి హక్కులూ రావు. వారి విషయంలో 1977 నాటి పీఓటీ చట్టం అమల్లో ఉన్నట్టే. దీనివల్ల అసైన్‌మెంట్ అయిన దగ్గర నుంచి 2023లో చట్ట సవరణ జరిగే వరకు అసైన్‌మెంట్ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన రైతులకు మాత్రమే మేలు కలుగుతుంది. అంటే ఒరిజనల్ అసైనీలకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో.. అందులో తప్పులు జరిగాయని, రద్దు చేయాలనే వాదనలో ఏమైనా అర్థం ఉందా? ఎవరికైనా లబ్ధి చేకూర్చాలనుకుంటే ఒరిజనల్ అసైనీలకే హక్కులు ఇవ్వాలనే షరతు చట్టంలో ఎందుకు పెడతారు?

27 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

వైఎస్ జగన్ హయాంలో జరిగిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా సుమారు 15,21,160 మంది భూమిలేని నిరుపేదలకు వారికి సంబంధించిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. 20 సంవత్సరాలకు ముందు ఇచ్చిన భూములన్నింటికీ ఇది వర్తిస్తుంది. ఈ భూములన్నీ 1954 తర్వాత అసైన్‌మెంట్ చేసినవే.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో
ఏపీ ముందడుగు

గత ప్రభుత్వంలో సీఎం జగన్ విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం

- పలు రంగాల్లో ముందు వరుసలో రాష్ట్రం
- 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టీకరణ
- మాతా, శిశు మరణాలు భారీగా తగ్గుదల
- 15.60% నుంచి 6.06%కి తగ్గిన పేదరికం
- విద్యలో పెరిగిన నాణ్యత.. ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో పెరిగిన ఎన్‌రోల్‌మెంట్
- ఆస్పత్రుల్లోనే కాన్పులు 99.98 శాతం
- ఆరోగ్యశ్రీతో నాలుగింట మూడోవంతుకు పైగా కుటుంబాలకు ఆరోగ్య ధీమా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పలు రంగాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్‌గా ముందుకు దూసుకుపోతోంది. 2020–21తో పోల్చితే 2023–24లో పేదరికం, మాతా శిశు మరణాల రేటు భారీగా తగ్గింది. ఆస్పత్రుల్లో కాన్పులు పెరగడంతో పాటు పిల్లలకు నూరు శాతం రోగ నిరోధక శక్తి టీకాలు విజయవంతంగా వేయించింది. విద్యలో నాణ్యత పెరగడంతో పాటు ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. రాష్ట్రంలో 80 శాతానికి పైగా కుటుంబాలకు ఆరోగ్య భరోసా లభించింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా రంగాల్లో తీసుకున్న విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం. ఈ మేరకు నీతి ఆయోగ్ విడుదల చేసిన 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టం చేసింది. నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమీక్షించారు. అంతటితో ఆగకుండా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను అనుసంధానం చేశారు. నవరత్నాలతో పేదరికం.. మాతా శిశు మరణాలు తగ్గించడం, నాణ్యమైన విద్య, అర్హులందరికీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీని వర్తింప చేయడం, ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలాగ చర్యలు తీసుకోవడంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ఫ్రంట్ రన్నర్ రాష్ట్రాల్లో నిలిచింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన మూడో నివేదికతో పోల్చితే నాలుగో నివేదికలో పలు రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పురోగతిలో దూసుకుపోతున్నట్లు స్పష్టమైంది. పేదరికం శాతం 15.60 నుంచి 2023–24 నాటికి 6.06 శాతానికి తగ్గింది. పేదరికం తగ్గించడంలో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఫ్రంట్ రన్నర్‌లో ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

80.20% కుటుంబాలకు ఆరోగ్య భరోసా

ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య బీమా పథకాన్ని 80.20 శాతం కుటుంబాలకు వర్తింప చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది. అంతకు ముందు 74.60 శాతం కుటుంబాలకే ఆరోగ్య బీమాను వర్తింప చేశారని పేర్కొంది. మాతా శిశు మరణాలను తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్ టాప్ ఐదు రాష్ట్రాల్లో ముందుంది. ప్రతి లక్ష జననాలకు ప్రసూతి మరణాల నిష్పత్తి 65 నుంచి 45కు ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిందని, ప్రతి వెయ్యి సజీవ జననాల్లో ఐదేళ్లలోపు శిశు మరణాలు 33 నుంచి 27కు తగ్గాయని నివేదిక తెలిపింది. ఈ లక్ష్యాల్లో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాలను సాధించినట్లు నివేదిక వెల్లడించింది. 9 నుంచి 11 నెలల పిల్లలకు రోగ నిరోధక శక్తి టీకాలు ఇప్పించడంలో 87 శాతం నుంచి నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించిందని నివేదిక స్పష్టం చేసింది.

నీతి ఆయోగ్ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

- ఆస్పత్రుల్లోనే 99.98 శాతం కాన్పులు
- 87.98 శాతం నుంచి 96.90 శాతానికి పెరిగిన ఎలిమెంటరీ ఎన్‌రోల్‌మెంట్
- 46.84 % నుంచి 56.70 % శాతానికి పెరిగిన ఉన్నత సెకండరీ ఎన్‌రోల్‌మెంట్
- స్కూల్స్‌లో 91.26 % నుంచి 98.80 శాతానికి పెరిగిన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు
- సెకండరీ స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల శాతం 75.18 నుంచి 82.50కి పెరుగుదల
- నూటికి నూరు శాతం మెరుగు పడిన గ్రామీణ జనాభాకు తాగునీటి సరఫరా
- నూరు శాతం మందికి సరసమైన ధరలకు స్వచ్ఛమైన ఇంధనం సరఫరా
- విద్యుత్ కనెక్షన్లలో నూరు శాతం లక్ష్య సాధన
- ఎల్‌పీజీ, పీఎన్‌జీ కనెక్షన్లలో 103.56 శాతం లక్ష్య సాధన
- స్థిర ధరల ఆధారంగా 3.84% నుంచి 4.05% పెరిగిన తలసరి జీడీపీ వార్షిక వృద్ధి రేటు
- 5.70 శాతం నుంచి 4.40 శాతానికి తగ్గిన 15–59 ఏళ్ల మధ్య నిరుద్యోగిత
- రాష్ట్ర మొత్తం స్థూల ఉత్పత్తి విలువలో 9.5 శాతం నుంచి 12.79 శాతానికి పెరిగిన తయారీ రంగం విలువ

టీడీపీ నేత గంజాయి సాగు


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

- మామిడి తోటలో గుట్టుగా పెంపకం.. అజ్ఞాత వ్యక్తి సమాచారంతో రంగంలోకి సెబ్
- రూ.21 వేల విలువైన గంజాయి మొక్కల స్వాధీనం

ఆగని టీడీపీ అరాచకాలు

వైఎస్సార్ జిల్లాలో చిరు వ్యాపారుల దుకాణాల ధ్వంసం

- తిరుపతి జిల్లాలో వార్డు సభ్యుడిపై దాడి
- చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు
- రోడ్డుకు అడ్డంగా కాలువలా తవ్వేసిన వైనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అస్తవ్యస్త విధానమే ప్రియం!

చంద్రబాబు రాజకీయ క్రీడకు ల్యాండ్ టైట్లింగ్ చట్టం బలి

భూమి అమ్మే వారికి, కొనే వారికి ఒక భరోసా కల్పించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. పక్కాగా సర్వే చేసి.. స్పష్టంగా హద్దులు చూపిస్తూ క్లియర్ టైటిల్‌తో ఆ భూమికి ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వడం ఆహ్వానించదగిన పరిణామం. భూమికి ఏ ఇబ్బందీ రాకుండా ఇన్సూరెన్స్ చేసినట్లుగా భావించవచ్చు. ఇదివరకు ఎక్కడా దేశంలో భూములకు ఇలాంటి భరోసా లేదు. రాష్ట్రంలో అది సాకారం కావడానికి వేలాది మంది సర్వేయర్లను నియమించి, అధునాతన సాంకేతికను ఉపయోగించి సర్వేకు శ్రీకారం చుట్టింది. 'వైఎస్ జగన్‌కు ముందు.. ఆ తర్వాత..' అని స్పష్టంగా జరిగిన మేలును కళ్లకు కట్టేలా, ప్రభుత్వం ఇస్తున్న క్లియర్ టైటిల్‌కు గుర్తుగా కొత్తగా సర్వే చేసి ఫొటోతో ఇవ్వడంపై ఎల్లో గ్యాంగ్ రాద్ధాంతం చేయడం దుర్మార్గం. కేవలం ప్రజలను తప్పుదారి పట్టించడం కోసమేనని స్పష్టమవుతోంది.



సాక్షి, అమరావతి: దేశమంతా అమలు కావాలని కోరుకుంటున్న ల్యాండ్ టైట్లింగ్ చట్టం రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు రాజకీయ క్రీడకు బలైపోయింది. 90 దేశాల్లో అమల్లో ఉన్న ఈ చట్టాన్ని కేవలం రాజకీయ స్వార్థం కోసం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ఉపయోగించుకుని కూటమి పార్టీలు ఎన్నికల్లో లబ్ధి పొందాయి. భూములు పోతాయనే దారుణమైన ప్రచారంతో ప్రజలను భయకంపితుల్ని చేశారు. ప్రజలు, రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు తాము మాత్రం ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఏకైక లక్ష్యంతో ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి చంద్రబాబు, కూటమి పార్టీలు భయంకరమైన కుట్రలు చేశాయి. మీ భూములు పోతాయని, దస్తావేజులు ఇవ్వరని, భూ యజమానులను జైల్లో పెడతారంటూ దారుణమైన అపోహల్ని సృష్టించారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాక యజమానులకు దస్తావేజులు ఇవ్వరని పచ్చి అబద్ధాన్ని విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను వంచించారు. నిజానికి సంవత్సరం నుంచి 9.58 లక్షల స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటన్నింటికీ సంబంధింత రైతులకు ఒరిజినల్ దస్తావేజులే ఇచ్చారు. 15.91 లక్షల ఇళ్ల స్థలాలను రిజిస్టర్ చేసి ఒరిజినల్ డాక్యుమెంట్లను ఇళ్ల యజమానులకు ఎప్పటిలానే ఇచ్చారు. ఇ–స్టాంపింగ్‌పైనా ఎడతెగని దుష్ప్రచారం చేసి జిరాక్స్ కాపీలు ఇస్తారని, ఆస్తి యజమానుల వారసులను అధికారులే నిర్ణయిస్తారని దారుణంగా వక్రీకరించారు. అమల్లోకి రాని ల్యాండ్ టైటిలింగ్ చట్టం సెక్షన్ 25 (3) ప్రకారమైనా.. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వారసత్వ నిర్ధారణలో ఏదైనా వివాదం ఉందని భావిస్తే సంబంధిత సివిల్ కోర్టుకు రిఫర్ చేయాల్సి ఉంటుంది. దాన్ని తప్పుగా చిత్రీకరించారు. సరైన కాగితాలు లేవని యజమానులనే జైల్లో పెడతారని, తాతల నాటి భూములైనప్పటికీ నేతల దయ ఉండాల్సిందేనని, జగన్ మీ స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టవచ్చంటూ అన్యాయంగా పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారు. సరైన పత్రాలు లేవని యజమానులను జైల్లో పెట్టే పరిస్థితి ఎక్కడైనా ఉంటుందా? ప్రజల్లో ఒక రకమైన భయానకం సృష్టించేందుకు ఇలాంటి ప్రచారాలు చేశారు.

అసెంబ్లీలో మద్దతిచ్చి ఎన్నికల్లో వ్యతిరేకించిన టీడీపీ

ల్యాండ్ టైట్లింగ్ బిల్లును అసెంబ్లీలో పెట్టినప్పుడు టీడీపీ దానికి పూర్తి మద్దతు ఇచ్చింది. అంతేకాకుండా సుదీర్ఘ అధ్యయనం, ఎంతో కసరత్తు తర్వాత ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. లీగల్ అడ్వైజర్‌గా నల్సార్ యూనివర్సిటీని నియమించుకుని ముసాయిదా బిల్లును రూపొందించింది. 2011 నుండి 2019 వరకు తయారు చేసిన వివిధ మోడల్ చట్టాలను పరిశీలించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఈ చట్టాన్ని తయారు చేసింది. ఆ తర్వాత ఇందుకు సంబంధించిన బిల్లును 2019లో అసెంబ్లీలో ప్రవేశపెట్టగా సుదీర్ఘ చర్చ జరిగింది. అప్పటి పీఏసీ చైర్మన్, ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ చట్టాన్ని అసెంబ్లీలో స్వాగతించారు. దీనికి అప్పుడు టీడీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఆ తర్వాత ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కేంద్ర ప్రభుత్వంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్, లా, ఐటీ, హోమ్, సోషల్ వెల్ఫేర్ వంటి శాఖలన్నీ 3 సంవత్సరాలు జాగ్రత్తగా పరీక్షించి పలు సూచనలు చేశాయి. ఆ మేరకు మార్పులు చేర్పులు చేసి తిరిగి అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఏ కేంద్ర చట్టాలకూ వ్యతిరేకంగా ఈ చట్టం లేదని నిర్ధారించిన తర్వాతే రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఆ తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం దీనిపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దీనిపై టీడీపీ, కూటమి పార్టీలు, ఎల్లో మీడియా దారుణంగా దుష్ప్రచారం చేసి ప్రజలను భయకంపితుల్ని చేశాయి. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆ విషయం ఏకంగా మేనిఫెస్టోలోనే పెట్టారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న చట్టాన్ని, దేశం మొత్తం రావాలంటున్న చట్టాన్ని కేవలం రాజకీయం కోసం చంద్రబాబు బలి చేశారు. అధికారంలోకి వచ్చాక నిర్వహించిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలని తీర్మానించారు.

దుష్ప్రచార హోరులో వాస్తవాలు కనుమరుగు

నిజానికి ప్రజల ఆస్తులకు మరింత భద్రత కల్పించడానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టం చేశారు. అన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని చేసుకోవాలని 2019లో నీతి అయోగ్ అనేకసార్లు చెప్పింది. అందుకు సంబంధించి ఒక ముసాయిదా చట్టాన్ని కూడా చేసింది. మహారాష్ట్ర కూడా ల్యాండ్ టైట్లింగ్ మోడల్ చట్టం చేసింది. పైగా దీనికి టీడీపీ అసెంబ్లీలో మద్దతు తెలిపింది. కానీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం దాన్ని అడ్డగోలుగా వ్యతిరేకించి రాజకీయం చేసింది. ప్రజలకు మేలు చేసే, రాష్ట్ర భూముల స్వరూపాన్ని, భూమి రికార్డుల వ్యవస్థను సమూలంగా మార్చేసే చట్టాన్ని రాజకీయ మంటల్లో కాల్చివేసి ప్రజలకు తీరని ద్రోహం చేసింది.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం వద్దనడం సరికాదు

ల్యాండ్ టైటిల్ గ్యారంటీ చట్టం ద్వారా భూమి హక్కులకు ప్రభుత్వమే భద్రత కల్పిస్తుంది. చట్టంలో కొన్ని రకాల సమస్యలు ఉంటే ఉండవచ్చు. కానీ చట్టమే తప్పనడం, దాన్ని వద్దనుకోవడం సరికాదు. 1989 నుంచి ఇలాంటి చట్టం కావాలనే చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 2004లో టైటిల్ గ్యారంటీ చట్టం తేవాలని నిర్ణయం తీసుకుంది. దీనిపై ఇప్పటికి 3 ముసాయిదా చట్టాలు కూడా తయారు చేసింది. కానీ చట్టరూపం దాల్చలేదు. అయితే అందుకనుగుణంగా మొదటిసారి చట్టం చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మహారాష్ట్రలో బిల్లు పెట్టారు. రాజస్థాన్ ప్రయత్నం చేసింది. ఢిల్లీ కూడా అనుకుంది. కానీ ఎక్కడా చట్టం రాలేదు. ఈ చట్టం వస్తే భూమి రికార్డుల్లో స్పష్టత వస్తుంది. ఒకసారి రికార్డులో పేరు ఎక్కితే రైతుకు భూమి హక్కులపై పూర్తి భరోసా ఉంటుంది. అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఎలాంటి భూ విధానం ఉందో మనకు అలాగే ఉంటుంది. ప్రపంచం అంతా కోరుకుంటున్న మార్పు అది. దీనివల్ల భూ యజమానికి భద్రత పెరగడమే కాకుండా, భూమి విలువలు కూడా పెరుగుతాయి. ఆ భూములపై లావాదేవీలు సులువవుతాయి. హక్కులు పోతాయి, భూములు బలవంతంగా లాక్కుంటారు, ఆక్రమిస్తారనే అంటున్నారు. కానీ ఈ చట్టం ఉద్దేశం అది కాదు. అది జరగదు కూడా. ఈ చట్టం గురించి దేశంలో 40 ఏళ్లుగా రకరకాల కమిటీలు, నిపుణులు అధ్యయనం చేస్తూనే ఉన్నారు. అన్నీ అయిన తర్వాతే ఈ విధానాన్ని తీసుకువచ్చారు. అలాంటి చట్టాన్ని వద్దనుకోవడం సరికాదు.

– సునీల్‌కుమార్, భూ చట్టాల నిపుణుడు, నల్సార్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్

చంద్రబాబు సర్కారుపై.. ఉపాధ్యాయుల ఆగ్రహజ్వాల

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సర్కార్ మోసం చేసిందని ఫైర్

- జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై మండిపాటు
- రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు.. గెజిట్ ప్రతుల దగ్ధం

సాక్షి నెట్‌వర్క్: గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్)ను రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని మాటిచ్చి ఇప్పుడు నాలుక మడతేయడంపై ఆయా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నాయి. ఎన్నికల ముందు ఒకలా.. ఎన్నికల తర్వాత మరోలా వ్యవహరిస్తున్న టీడీపీ–జనసేన–బీజేపీ ప్రభుత్వంపై అవి తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. దొడ్డిదారిన ఉత్తర్వులు జారీచేయడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు రేగుతున్నాయి. జీపీఎస్ అమలుపై జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. విశాఖ నగరంలోని ఎస్ఏడీ సెంటర్‌లో గెజిట్ ప్రతులను దగ్ధంచేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత ప్రభుత్వాన్ని సీపీఎస్ రద్దుచేయాలని కోరితే జీపీఎస్ అమలుచేస్తామని చెప్పిందని, కానీ.. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పార్టీలు మాత్రం రద్దుచేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక జీపీఎస్‌ను అమలుచేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయటం.. అది కూడా 2023 అక్టోబరు నుంచి అమలుచేస్తున్నట్లు పేర్కొనడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ గెజిట్‌ను తక్షణమే రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానమే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమబాట పడతామని హెచ్చరించారు. అల్లూరి జిల్లా చింతూరు, పాడేరుల్లోనూ ఉపాధ్యాయులు జీఓ కాపీని దగ్ధంచేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


కర్నూలు కలెక్టరేట్ వద్ద గెజిట్ ప్రతులను తగలబెడుతున్న యూటీఎఫ్ నాయకులు

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 14-7-2024

వైరల్



రోమాంచిత క్యాండిల్‌లైట్ డిన్నర్

'రొమాంటిక్ క్యాండిల్‌లైట్ డిన్నర్' అనే మాట మనకు తెలుసు. 'రోమాంచిత క్యాండిల్‌లైట్ డిన్నర్' అనే మాట విని ఉండం. దీని గురించి తెలియాలంటే ఈ వైరల్ వీడియో చూడాల్సిందే. రష్యాలో నవ దంపతులు తమ రొమాంటిక్ డిన్నర్‌ను వెరైటీగా ప్లాన్ చేశారు. ఒక లోయలో భూమికి ఆకాశానికి మధ్య డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారు. కేబుల్ రోప్‌కు ఎటాచ్ చేసిన టేబుల్‌పై వీరి క్యాండిల్‌లైట్ డిన్నర్ జరిగింది.

అరరే... ఇట్లయితే ఎట్లా!



'మడిసన్నాక కాస్త కళాపోషణే కాదు కాస్తో కూస్తో జనరల్ నాలెడ్జ్ కూడా ఉండాలి' అనిపిస్తుంది ఈ వైరల్ వీడియోను చూస్తే. 'మన జాతిపిత ఎవరు?' అనే ప్రశ్నకు ఎంతోమంది యంగ్‌స్టర్స్ చెప్పిన జవాబులు 'అయ్ బాబోయ్' అనిపిస్తాయి. 'మా జాతి పిత సర్దార్ వల్లభ్‌భాయి పటేల్' అని సమాధానం చెప్పింది ఒక అమ్మాయి. మరో అమ్మాయి... 'నరేంద్ర మోదీ' అని చెప్పి నాలుక కర్చుకొని 'కాదు...కాదు...నిజంగా చెప్పాలంటే ఐ హ్యావ్ నో ఐడియా' అన్నది. 'నాకు తెలుసు గానీ మీరు సడన్‌గా అడిగే సరికి గుర్తు రావడం లేదు' అని నైస్‌గా తప్పించుకున్నారు ఒకరు.



'టైగర్' డాగ్‌కు 2.5 లక్షల గోల్డ్ చైన్

'నా కుక్క నా ఇష్టం' అనే పాలసీలో భాగంగా ముంబైకి చెందిన సరిత సల్దాన్హ తన పెంపుడు శునకం 'టైగర్'కు 2.5 లక్షల గోల్డ్ చైన్‌ను గిఫ్ట్‌గా మెడలో వేసింది. గోల్డ్ చైన్ కొనడానికి సరిత నగల దుకాణానికి వెళ్లడం, స్టోర్‌లో టైగర్ వెయిట్ చేయడం, గోల్డ్ చైన్‌ను మెడలో వేస్తున్నప్పుడు టైగర్ సంతోషంగా తోక ఊపడం లాంటి దృశ్యాలు ఈ వైరల్ వీడియోలో ఉన్నాయి. 'పెంపుడు జంతువులు, మనుషులకు మధ్య ఉండే అందమైన అనుబంధానికి అద్దం పట్టే దృశ్యం' అంటూ నగల షాపు వాళ్లు ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



లోకల్ టాలెంట్ కాదు అమెరికాస్ గాట్ టాలెంట్

కాళ్ల కింద రెండు గ్లాసులు, తల మీద గ్లాస్‌పై గ్లాస్ పద్దెనిమిది గ్లాస్‌లు పెట్టుకొని వాటిపై కుండ పెట్టుకొని రెండడుగులు వేయడమే కష్టం. అలాంటిది డ్యాన్స్ చేయడం అంటే మాటలు కాదు కదా! రాజస్థాన్‌కు చెందిన ప్రవీణ్ ప్రజాపత్ నిన్న మొన్నటి వరకు లోకల్ టాలెంట్. ఇప్పుడు మాత్రం అమెరికాస్ గాట్ టాలెంట్. ఫోక్ డ్యాన్సర్ అయిన ప్రవీణ్‌కు అమెరికాస్ గాట్ టాలెంట్ (ఏజీటి)లో పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకొని 'స్టాండింగ్ ఒవేషన్' అందుకున్నాడు. కాళ్ల కింద 2 గ్లాసులు(డ్యాన్స్ ప్రారంభంలో) తల మీద 18 గ్లాస్‌లు వాటిపై ఒక కుండతో ప్రవీణ్ చేసిన 'మట్కా భవ' డ్యాన్స్ ఆడిటోరియంను ఉర్రూతలూగించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

స్నేహ హస్తం







తాము అభిమానించే హీరో లేదా హీరోయిన్‌తో మాట్లాడాలని, సెల్ఫీ దిగాలని అనుకోని ఫ్యాన్స్ ఉండరు. మాట్లాడడమే కాదు ఏకంగా డ్యాన్స్ చేసే అవకాశమే వస్తే... ఎంత సంతోషం! టీవీ షో 'డ్యాన్స్ జోడీ డ్యాన్స్ రీ లోడెడ్2' జడ్జీలలో నటి స్నేహ ఒకరు. ఈ షో కంటెస్టెంట్ నాగరాజు స్నేహకు వీరాభిమాని. ఈ షో పుణ్యమా అని నాగరాజుకు తన అభిమాన నటిని దగ్గర నుంచి చూసే అవకాశం వచ్చింది. ఆ ఆనందంలో...'స్నేహ మేడమ్, మీతో కలిసి డ్యాన్స్ చేయాలని ఎప్పటి నుంచో కల కంటున్నాను' అన్నాడు. 'సారీ' అనలేదు స్నేహ. అభిమానితో కలిసి 'తంగ తమరి మగలే' అనే పాటకు డ్యాన్స్ చేసింది. అభిమానితో కలిసి 'స్మైల్ క్వీన్' స్నేహ చేసిన డ్యాన్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. నెటిజనులు 'అద్భుతం' అంటున్నారు.



స్టార్ట్-కెమెరా-యాక్షన్ ఆధార్ కార్డ్

పిల్లల అమాయకత్వం అందంగా ఉంటుంది. నవ్వుల జల్లులు కురిపిస్తుంది. ఇంటర్‌నెట్‌లో చక్కర్లు కొడుతూ నవ్వుల పువ్వులు పూయిస్తున్న ఈ వీడియో విషయానికి వస్తే... ఆధార్ కార్డ్ ఫొటో కోసం కెమెరా ముందు నిల్చున్న చిన్నారి చెంపకు చెయ్యి ఆనించి 'ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లు ముఖం పెట్టింది.

'అలా కాదమ్మా' అని తల్లి చెప్పగానే- డ్యాన్స్ పోజ్ ఇచ్చింది. ఆ తరువాత చప్పట్లు కొడుతూ ఇంకో పోజ్ ఇచ్చింది. మామూలు ఫొటోకు, ఆధార్ కార్డ్ ఫొటోకు తేడా తెలియని ఆ చిన్నారి ఇచ్చిన పోజ్‌లు ఇన్నీ అన్నీ కావు!

'ఆధార్ ఫొటో షూట్ గాన్ రాంగ్' కాప్షన్‌తో ఆ చిన్నారి తల్లి పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. 18.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

బుల్ డోజర్ బండెక్కి నేనొస్తా పా....నేనొస్త పా



వైరల్ అవుతున్న ఈ వరుడి వీడియోనుచూస్తే 'బుల్‌డోజర్ బండెక్కి నేనొస్త పా....నేనొస్త పా' అని పాడుకుంటాం. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఒక వరుడు బుల్‌డోజర్ బ్లేడ్‌పై కూర్చొని బ్యాండ్‌బాజాలతో ఊరేగింపుగా బయలుదేరాడు. ఈ పెళ్లి ఊరేగింపుకు 'బుల్‌డోజర్ బరాత్' అని పేరు పెట్టారు.

ఇంగ్లిష్ యాదవ్ చాచా



ఆంగ్లంలో మాట్లాడితే ఆశ్చర్యపోయి, అబ్బురపడే రోజులు కావు ఇవి.. ఇంగ్లిష్‌లో మాట్లాడడం ఈరోజుల్లో చాలా సహజం. అయితే ఒక ఆటో డ్రైవర్ ఇంగ్లిష్‌లో మాట్లాడిన వీడియో వైరల్ అయింది. మూడు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. మహారాష్ట్రలోని అమరావతిలో యాదవ్ చాచా అనే ఆటో డ్రైవర్ ఉన్నాడు. ఇతడిని 'ఆటోడ్రైవర్ యాదవ్ చాచా' అని పిలిచే వారు చాలా తక్కువ. 'ఇంగ్లిష్ యాదవ్ చాచా' అనే పిలిచేవారే ఎక్కువ. దీనికి కారణం యాదవ్ ఇంగ్లిష్ బాగా మాట్లాడుతాడు. తాజా వైరల్ వీడియోలో భూషణ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ యాదవ్‌తో ఇంగ్లిష్‌లో మాట్లాడించాడు. 'ఇంగ్లిష్ తెలిస్తే ఇంగ్లాండ్, అమెరికాలాంటి ఎన్నో దేశాలకు వెళ్లవచ్చు. ఇంగ్లిష్ నేర్చుకోండి. ఇది అంతర్జాతీయ భాష' అంటూ మాట్లాడాడు యాదవ్.

హెల్త్



పరిపరిశోధన

వాసన పసిగట్టడం కష్టమౌతోందా?

హార్ట్ ఫెయిల్యూర్‌కు సూచన కావచ్చు!

వాసన పసిగట్టడం కష్టమవుతుంటే అది గుండె బలహీనమవుతున్నదనడానికి ఒక ముందస్తు సూచన కావచ్చు. జాహ (జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్)లో ప్రచురితమైన ఓ అధ్యయనం ఆధారంగా ఈ విషయం తెలిసింది. అలా జరుగుతున్నప్పుడు అందుకు కారణాలు ఏమిటో కనుగొనాలంటున్నారు బెంగళూరుకు చెందిన మన డాక్టర్లు.



వాసన తెలియడం లేదంటే క్రమేణా వాసన పసిగట్టే నరాలు బలహీనపడటమైనా జరిగి ఉండవచ్చు. కార్డియో వాస్క్యులార్ పాథాలజీస్ వల్ల ఇలా జరుగుతుండవచ్చు. ఈ మేరకు బెంగళూరులోని యాస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్స్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిరాగ్ డీ మాట్లాడుతూ ''మెదడు కింది భాగంలో ఉండే 'ఆల్‌ఫాక్టరీ బల్బ్స్' అనేవి వాసన పసిగట్టడానికి ఉపయోగపడుతుంటాయి.గుండె బలహీనమవుతూ వాసన పసిగట్టే యంత్రాంగానికి సరిగా రక్తసరఫరా కాకపోవడం ఇలా జరగవచ్చ''ని పేర్కొన్నారు. ఇవే అంశాలను ధ్రువపరుస్తున్న యాస్టర్ ఆర్వీ హాస్పిటల్స్ కార్డియో థొరాసిక్ వాస్క్యులార్ సర్జన్ డా. దివాకర్ భట్ మాట్లాడుతూ... ''బలహీనమైన గుండె స్పందనల కారణంగా వాసన తెలిపే నాడీకణాలకు రక్తం తక్కువగా సరఫరా అవుతుంటే వాసన పసిగట్టే శక్తి తగ్గుతుంది'' అని తెలిపారు.

''అప్సిట్ (యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా స్మెల్ ఐడెంటిఫికేషన్ టెస్ట్) లేదా స్నిఫింగ్ స్టిక్స్ వల్ల స్మెల్లింగ్ ఎంత తగ్గిందనే (హైపాస్మియా) అంశం తెలుస్తుంది. ఈ పరీక్షల స్కోర్స్‌తో 'స్మెల్ డిజార్డర్స్' ఉన్నాయా అనే విషయాలూ తెలుస్తాయి'' అంటున్నారు డా. చిరాగ్.

న్యూరో డీజనరేటివ్ వ్యాధులైన అల్జైమర్స్, పార్కిన్‌సన్స్ వ్యాధుల్లో వయసు పెరుగుతున్నకొద్దీ వాసన పసిగట్టే సామర్థ్యాలు తగ్గినట్టే దీర్ఘకాలిక సైనస్ లేదా ముక్కులు దిబ్బడ వేసినవారిలో, కొన్ని జన్యుసమస్యలున్నవారిలో, పొగతాగేవారిలో వాసన పసిగట్టే సామర్థ్యం తగ్గినట్టే గుండెజబ్బులతోనూ ఇలా జరిగే అవకాశముందనీ, అయితే వీళ్లకి సైనస్ ఇన్ఫెక్షన్లకు చికిత్స ఇప్పించడం, అండర్‌లైయింగ్ సమస్యలకు వైద్యం అందించడమూ, కార్డియో ఫిట్‌నెస్ పెంచడం ద్వారా సమస్యను చక్కదిద్దవచ్చంటున్నారు డాక్టర్ చిరాగ్.

అరిధ్మియా గుండె లయ తప్పుతోందా?

లయబద్ధమైన గుండె స్పందనలు లయ తప్పడాన్ని అరిథ్మియా అంటారు. తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవనశైలి వల్ల గుండె స్పందనల్లో ఇలా తేడా రావచ్చు.

వయసు పెరుగుతున్న కొద్దీ ఈ సమస్య చాలా సాధారణం. పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు ఉన్నట్లయితే వారిలో చిన్నవయసులోనే ఇది కనిపించే అవకాశాలున్నాయి. అందులో రకాలివి...



డాక్టర్ కుమార్ నారాయణ్
సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ & ఎలక్ట్రోఫిజియాలజిస్ట్

అరిథ్మియాలో రకాలు...

ముఖ్యంగా అరిథ్మియాను రెండు రకాలుగా విభజించవచ్చు. 1) బ్రాడికార్డియా : గుండె స్పందనలు (హార్ట్‌రేట్) బాగా తగ్గడం. 2) ట్యాకీకార్డియా : గుండె స్పందనలు వేగవంతం కావడం.

ట్యాకీ కార్డియాను మళ్లీ రెండుగా విభజించవచ్చు. మొదటి రకం... స్పందనలు వేగవంతం కావడం గుండె పైగదులలో జరిగితే దాన్ని ఏట్రియల్ అరిథ్మియా అంటారు. (ఉదాహరణకు ఏట్రియల్ డీ-ఫిబ్రిలేషన్, ఏట్రియల్ ఫ్లట్టర్). రెండో రకం... గుండె కింది గదులు విపరీతంగా స్పందిస్తుండటం. ఇలా జరగడాన్ని వెంట్రిక్యులార్ అరిథ్మియా అంటారు.

లక్షణాలు : అరిథ్మియా రకాన్నీ, తీవ్రతను బట్టి అనేక లక్షణాలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు..

గుండె దడ (పాల్పిటేషన్స్) : గుండె తీవ్రంగా స్పందిస్తుంది. స్పందనల్లో కొన్ని లయ తప్పుతాయి. కొందరిలో ఇవి అప్పుడప్పుడూ, మరికొందరిలో నిత్యం కనిపిస్తుంటాయి.

డిజ్జీనెస్ – లైట్ హెడెడ్‌నెస్ : గుండె స్పందనలు వేగవంతం కావడంతో పాటు తలలోకి రక్తసరఫరా సాఫీగా సాగకపోవడంతో తల తిరగడం లేదా తల తేలికైనట్టుగా అనిపించడం లేదా కొందరు స్పృహ తప్పడం (సింకోప్) జరగవచ్చు.

శ్వాస అందడం కష్టం కావడం (షార్ట్‌నెస్ ఆఫ్ బ్రీతింగ్) : రక్తసరఫరా తగ్గడంతో గుండె లయ తప్పడంతో పాటు శ్వాస సరిగా అందకపోవచ్చు. దాంతో కొద్దిపాటి శారీరక శ్రమతోనూ తీవ్రంగా ఆయాసం.

ఛాతీలో నొప్పి / ఇబ్బంది : కొందరిలో ఛాతీ నొప్పి లేదా ఛాతీలో ఇబ్బందితో పాటు గుండెపోటు సమయంలో వచ్చినట్లుగా (యాంజైనా) నొప్పి.

తీవ్రమైన అలసట (ఫెటీగ్) : తీవ్రమైన అలసట, నిస్సత్తువ, నీరసం.

స్వెటింగ్ : గుండెదడ, తలతిరగడంతో పాటు కొందరిలో ఎలాంటి శ్రమపడనప్పటికీ విపరీతమైన చెమటలూ, ఒళ్లంతా తడిసిపోవడం.

అయితే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. లక్షణాలు లేకపోయినప్పటికీ ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వంటి అరిథ్మియాలు పక్షవాతానికి దారితీసే ప్రమాదం ఉంటుంది. ఒకవేళ బాధితులు గుండెజబ్బు ఉన్నవారైతే ఇది మరింత ముప్పు తెచ్చిపెట్టవచ్చు. అందుకే ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే గుండెనిపుణుల చేత పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి.

(ఉదా: వెంట్రిక్యులార్ టాకీకార్డియా, వెంట్రిక్యులార్ ఫిబ్రిలేషన్). వెంట్రిక్యులార్ అరిథ్మియాస్ తీవ్రంగా ఉంటాయి.

నిర్ధారణ : ఈసీజీ, హోల్టర్ మానిటరింగ్, ఈవెంట్ రికార్డర్, ఎకోకార్డియోగ్రామ్ వంటిపరీక్షలతో అరిథ్మియాను నిర్ధారణ చేస్తారు. అయితే అరిథ్మియాలు అప్పుడప్పుడూ కనిపించేవి కాబట్టి ఒక్కోసారి 'ఈసీజీ'తో సమస్య నిర్ధారణ జరగకపోవచ్చు. అప్పుడు దీర్ఘకాలిక హోల్టర్ పర్యవేక్షణ అవసరం.

గుండెదడ వచ్చినప్పుడు గుండె స్పందనల వేగాన్ని తెలుసుకోవడం కోసం ఇంట్లోనే పల్స్ ఆక్సీమీటర్ లేదా ఎలక్ట్రానిక్ బీపీ మెషిన్‌ను వాడుకోవచ్చు.

నివారణ / చికిత్స : ● ఆరోగ్యకరమైన జీవనశైలితో ఈ సమస్యను కొంతమేర నివారించవచ్చు. అరిథ్మియా నిర్ధారణ అయ్యాక ఎలక్ట్రోఫిజియాలజిస్టులను సంప్రదించడం మంచిది ● కొన్ని సందర్భాల్లో మందులు. ● మరికొన్ని సందర్భాల్లో గుండె స్పందనలు తక్కువగా ఉన్నప్పుడు (బ్రాడీకార్డియాలో) పేస్ మేకర్. ● గుండె స్పందనలు చాలా ఎక్కువగా ఉన్నప్పుడు (టాకీకార్డియాలో) అబ్లేషన్ అనే చికిత్స. ● డీ-ఫిబ్రిలేటర్ డివైస్ థెరపీ అనేది వెంట్రిక్యులార్ అరిథ్మియా కారణంగా వచ్చే ఆకస్మిక మరణాన్ని నివారించడానికి ఉపయోగపడుతుంది.

చివరగా... సమస్య ఉన్నవారు ఎంత త్వరగా చికిత్స తీసుకుంటే అనర్థాలు అంతగా తప్పుతాయి.

ట్రైగ్లిజరైడ్స్‌ను పెరగకుండా చూసుకోండిలా!



మన రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్ అనేవి కొలెస్ట్రాల్‌లాగే ఒక రకం కొవ్వులు. చెడు కొలెస్ట్రాల్ పెరిగితే గుండెకు హాని జరిగినట్టే... ఇవి పెరిగినా గుండెజబ్బులకు దారితీయవచ్చు. అందుకే వీటిని ఉండాల్సిన మోతాదులో ఉండేలా నియంత్రించుకోవాలి. ఇవి పెరిగిన కండిషన్‌ను 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' అంటారు. ట్రైగ్లిజరైడ్స్‌ను నియంత్రించుకోవడమిలా...



✔ చేయాల్సినవి...



✔ తాజా పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పీచు ఎక్కువగాఉండే ఆహారాలు (ఉదా: పొట్టుతీయని ధాన్యాలు ఉదాహరణకు దంపుడు బియ్యం, మొక్కజొన్న, పొట్టుతీయని రాగులు, గోధుమలు, ఓట్స్, పొట్టుతీయని పప్పులతో పాటు వెజిటబుల్ సలాడ్స్, స్ప్రౌట్స్, ఉడికించిన కాయగూరలు తీసుకోవాలి.

✔ గ్రీన్ టీ, నట్స్ ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి.

✔ ఎత్తుకు తగినట్లు ఉండేలా (బీఎమ్ఐ) బరువును నియంత్రించుకోవాలి.

✔ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు శారీరక శ్రమ / వాకింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

✔ ఆహారంలో నెయ్యి వంటి శాచ్యురేటెడ్ ఫ్యాట్‌ను, వేపుళ్లు, రొయ్యలు, చికెన్ స్కిన్ తగ్గించాలి.



డాక్టర్ ఆర్. శ్రీకాంత్‌రెడ్డి
ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

✗ చేయకూడనివి...

- ✗ స్వీట్స్ తీసుకోకపోవడమే మంచిది.
- ✗ జంక్ ఫుడ్, బేకరీ ఐటమ్స్ తీసుకోకూడదు.
- ✗ పొగతాగడం పూర్తిగా మానేయాలి.
- ✗ ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి.



అపోహ | వాస్తవం

వైన్ ఒక్క గ్లాసే అయినా... గుండె జబ్బు ఖాయం!

అపోహ : తక్కువ మోతాదులో రెడ్‌వైన్‌తో గుండెజబ్బుల నివారణ జరుగుతుంది.

వాస్తవం : ఇది కేవలం అపోహ మాత్రమే. రోజూ కేవలం ఒక గ్లాసు వైన్ తీసుకున్నా అది గుండె జబ్బుల లయ (రిథమ్) దెబ్బతినే సమస్యకు కారణం కావచ్చు. ఆల్కహాల్ అలవాటు లేని ఆరోగ్యకరమైన వ్యక్తులతో పోలిస్తే ఇలా రోజూ ఒక గ్లాసు వైన్ తీసుకునే వారిలో గుండె లయ దెబ్బతినే ముప్పు ఎనిమిది శాతం ఎక్కువ. ఇక మామూలుగా తాగేవారితో పోలిస్తే ఎప్పుడో ఒకసారి తాగే 65 ఏళ్ల పైబడిన ప్రతి 100 లోనూ ఏడుగురికి గుండె లయకు సంబంధించిన సమస్యలు రావచ్చనేది అమెరికన్ సైంటిస్టుల పరిశోధనల్లో తేలింది. అధ్యయన ఫలితాలు అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ వాళ్ల జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి.





భారత ఆటగాడు రాజా రిత్విక్‌కు రజతం

ఫ్రాన్స్‌లో జరిగిన 'లా ప్లాన్' ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రజత పతకం సాధించాడు. 9 రౌండ్ల పాటు జరిగిన ఈ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన రిత్విక్ తొమ్మిదో సీడ్‌లో బరిలోకి దిగి 5 విజయాలు, 4 'డ్రా'ల తర్వాత మొత్తం 7 పాయింట్లు సాధించాడు. మరో ముగ్గురు ఆటగాళ్లు ఇన్నియాన్ పన్నీర్‌సెల్వం, ప్రణీత్ ఉప్పల, ధూళిపాళ బాలచంద్రప్రసాద్‌లతో సమంగా నిలిచాడు. అయితే టైబ్రేక్ ఆధారంగా రిత్విక్‌కు రెండో స్థానం దక్కగా, ఇన్నియాన్‌కు కాంస్యం లభించింది. ఫ్రెంచ్ జీఎం జూల్స్ మూసర్డ్ 7.5 పాయింట్లతో స్వర్ణం గెలుచుకున్నాడు. జూల్స్, రిత్విక్ మధ్యే జరిగిన 9వ రౌండ్ పోరు 28 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. ఈ టోర్నీలో 17 దేశాలకు చెందిన 184 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో 17 మంది గ్రాండ్‌మాస్టర్లు, 40 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు ఉన్నారు. రాజా రిత్విక్ ఇటీవలే జాతీయ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, జాతీయ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో రజతం గెలుచుకున్నాడు.

జైస్వాల్, గిల్ ఘనంగా...



విజయానంతరం జైస్వాల్, గిల్‌కు ముజరబాని అభినందన

భారత్‌ను గెలిపించిన ఓపెనర్లు ● 10 వికెట్లతో జింబాబ్వే చిత్తు 3–1తో టి20 సిరీస్ టీమిండియా సొంతం ● నేడు చివరి మ్యాచ్

ఐపీఎల్‌లో సత్తా చాటిన కుర్రాళ్లు ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై కూడా తమకు లభించిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. రెగ్యులర్ ఆటగాళ్లు లేకుండా వెళ్లిన యువ జట్టు అంచనాలకు అనుగుణంగా సత్తా చాటి జింబాబ్వేపై టి20 సిరీస్ విజయాన్ని అందుకుంది. తొలి మూడు మ్యాచ్‌లతో పోలిస్తే ఈ సారి సంపూర్ణ ఆధిపత్యంతో చెలరేగిన టీమిండియా భారీ విజయాన్ని అందుకుంది. నాలుగో మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్ దూకుడైన బ్యాటింగ్ ముందు జింబాబ్వే ఏమాత్రం పోటీనివ్వలేకపోవడంతో జట్టు అలవోకగా లక్ష్యం చేరింది.

హరారే: టి20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన తర్వాత జరిగిన తొలి సిరీస్ కూడా భారత్ ఖాతాలో చేరింది. జింబాబ్వే గడ్డపై జరిగిన ఈ ఐదు మ్యాచ్‌ల పోరులో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ 3–1తో సిరీస్ సొంతం చేసుకుంది. శనివారం జరిగిన నాలుగో టి20లో భారత్ 10 వికెట్ల తేడాతో జింబాబ్వే ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (28 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...మరుమని (31 బంతుల్లో 32; 3 ఫోర్లు), మదివెరె (24 బంతుల్లో 25; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం భారత్ 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 156 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (53 బంతుల్లో 93 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (39 బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయంగా జట్టును గెలిపించారు. సిరీస్‌లో చివరిదైన ఐదో మ్యాచ్ నేడు ఇక్కడే జరుగుతుంది.

రజా రాణించినా...

జింబాబ్వేకు ఓపెనర్లు మరుమని, మదివెరె కొన్ని చక్కటి షాట్లతో మెరుగైన ఆరంభాన్ని అందించారు. సిరీస్‌లో తొలిసారి ఆ జట్టు పవర్‌ప్లేలో ఒక్క వికెట్ కూడా కోల్పోలేదు. భారత పేసర్లు ఆరంభంలో కట్టు తప్పడం జింబాబ్వేకు కలిసొచ్చింది. తొలి వికెట్‌కు 52 బంతుల్లో 63 పరుగులు జోడించిన తర్వాత అభిషేక్ తన తొలి అంతర్జాతీయ వికెట్‌గా మరుమనిని వెనక్కి పంపించాడు. తర్వాతి ఓవర్లో మదివెరె కూడా అవుట్ కాగా...10 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 67/2కు చేరింది. ఈ దశలో భారత స్పిన్నర్లు ప్రత్యర్థిని కట్టి పడేశారు. నాలుగు పరుగుల వ్యవధిలో బెన్నెట్ (9), క్యాంప్‌బెల్ (3) అవుట్ కావడం జట్టును దెబ్బ తీసింది. అయితే రజా దూకుడుగా ఆడటంతో స్కోరు 150 పరుగులు దాటింది. ఆఖరి 5 ఓవర్లలో జింబాబ్వే 54 పరుగులు సాధించింది. దూబే, రుతురాజ్ ఒక్కో క్యాచ్ వదిలేసినా...భారత్‌కు వాటి వల్ల పెద్దగా నష్టం జరగలేదు.

ఆడుతూ పాడుతూ...

జింబాబ్వే ఇన్నింగ్స్ మొత్తంలో 10 ఫోర్లు ఉండగా... భారత ఓపెనర్లు తొలి 4 ఓవర్లలోనే 10 ఫోర్లు బాదారు. ఎన్‌గరవ వేసిన తొలి ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన జైస్వాల్...చటారా ఓవర్లో 4 ఫోర్లు బాదాడు. పవర్‌ప్లేలో భారత్ 61 పరుగులు చేసింది. ఆ తర్వాత 29 బంతుల్లో జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అక్రమ్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన గిల్ 35 బంతుల్లో సిరీస్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. బెన్నెట్ ఓవర్లో గిల్ 2 సిక్స్‌లు బాదడంతో మరో ఎండ్‌లో జైస్వాల్‌కు సెంచరీ అవకాశం దక్కలేదు. ఐపీఎల్‌లో చెన్నై జట్టు తరఫున రాణించి గుర్తింపు తెచ్చుకున్న పేసర్ తుషార్ దేశ్‌పాండే ఈ మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున టి20లు ఆడిన 115వ ఆటగాడిగా గుర్తింపు పొందాడు.

స్కోరు వివరాలు:

జింబాబ్వే ఇన్నింగ్స్: మదివెరె (సి) రింకూ సింగ్ (బి) దూబే 25; మరుమని (సి) రింకూ సింగ్ (బి) అభిషేక్ 32; బెన్నెట్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 9; రజా (సి) గిల్ (బి) దేశ్‌పాండే 46; క్యాంప్‌బెల్ (రనౌట్) 3; మయర్స్ (సి) అండ్ (బి) ఖలీల్ 12; మదాండె (సి) రింకూ సింగ్ (బి) ఖలీల్ 7; అక్రమ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1–63, 2–67, 3–92, 4–96, 5–141, 6–147, 7–152.
బౌలింగ్: ఖలీల్ 4–0–32–2, దేశ్‌పాండే 3–0–30–1, బిష్ణోయ్ 4–0–22–0, సుందర్ 4–0–32–1, అభిషేక్ 3–0–20–1, దూబే 2–0–11–1.

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 93; గిల్ (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 156. బౌలింగ్:** ఎన్‌గరవ 3–0–27–0, ముజరబాని 3.2–0–25–0, చటారా 2–0–23–0, అక్రమ్ 4–0–41–0, రజా 2–0–24–0, బెన్నెట్ 1–0–16–0.

క్రెజికోవాకు కిరీటం

● వింబుల్డన్ విజేతగా చెక్ రిపబ్లిక్ ప్లేయర్
● ఫైనల్లో ఓడిన జాస్మిన్ పావొలిని



లండన్: ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వింబుల్డన్ మహిళల సింగిల్స్ విభాగంలో కొత్త విజేత అవతరించింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన బార్బరా క్రెజికోవా తన తొలి వింబుల్డన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తొలి సారి వింబుల్డన్ ఫైనల్ చేరిన ఇద్దరు ప్లేయర్ల మధ్య శనివారం జరిగిన ఫైనల్లో క్రెజికోవా 6–2, 2–6, 6–4 స్కోరులో ఏడో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ)పై విజయం సాధించింది. 1 గంటా 56 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ మూడు సెట్‌ల సమరంలో 28 ఏళ్ల చెక్ ప్లేయర్ పైచేయి సాధించింది. 2021లో ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుచుకున్న క్రెజికోవా కెరీర్‌లో ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్.



వింబుల్డన్‌లో 31వ సీడ్‌గా ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన క్రెజికోవా చివరకు టైటిల్‌తో ముగించింది. ఫైనల్ పోరులో ఆరంభంలో జాస్మిన్‌పై ఆమె ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి 11 పాయింట్లలో 10 గెలుచుకొని ముందంజ వేసింది. ఆ తర్వాత డబుల్ బ్రేక్‌తో 5–1తో ఆధిక్యంలో నిలిచిన ఆమె సునాయాసంగా సెట్‌ను ముగించింది. ఆమె జోరు చూస్తే రెండో సెట్‌లోనే మ్యాచ్ గెలిచేస్తుందని అనిపించింది. అయితే విరామ సమయంలో పావొలిని ఆట మారింది. చక్కటి గ్రౌండ్‌స్ట్రోక్స్‌తో దూసుకుపోయి 3–0తో నిలిచి ఇటలీ ప్లేయర్ ప్రత్యర్థిని కోలుకోనీయకుండా సెట్‌ను ముగించింది. చివరి సెట్‌లో ఆట ఆసక్తికరంగా సాగింది. క్రెజికోవా 5–3 వద్ద ఉన్న దశలో పావొలిని గేమ్ గెలిచి కొంత పోటీనిచ్చినా...పదో గేమ్‌లో క్రెజికోవా తన సర్వీస్‌ను నిలబెట్టుకొని విజేతగా అవతరించింది. క్రెజికోవా ఖాతాలో రెండు సింగిల్స్ టైటిల్స్‌తో పాటు 7 డబుల్స్, 3 మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీలు ఉన్నాయి.

నేడు పురుషుల ఫైనల్
జొకోవిచ్ (సెర్బియా) X అల్‌కరాజ్ (స్పెయిన్)
సా.గం.6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం

పాంటింగ్‌తో ఢిల్లీ కటీఫ్!

కోచ్ పదవినుంచి తప్పించిన క్యాపిటల్స్



న్యూఢిల్లీ: ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ బంధం ముగిసింది. పాంటింగ్‌ను హెడ్ కోచ్ పదవి నుంచి తప్పిస్తున్నట్లు క్యాపిటల్స్ యాజమాన్యం ప్రకటించింది. ఐపీఎల్‌లో ఆశించిన ఫలితాలు అతను అందించకపోవడంతో ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే సీజన్ కోసం జరిగే మెగా వేలానికి ముందు ఢిల్లీ కొత్త కోచ్‌ను ఎంపిక చేయనుంది. దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 2018 నుంచి 2024 వరకు 7 సీజన్ల పాటు ఢిల్లీ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. పాంటింగ్ బాధ్యతలు స్వీకరించాక ఢిల్లీ డేర్‌డెవిల్స్ పేరుతో చివరిసారి బరిలోకి దిగిన 2018లో జట్టు విఫలమై ఆఖరి స్థానంలో నిలిచింది. అనంతరం తర్వాతి మూడు సీజన్లు జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చింది. క్యాపిటల్స్ టీమ్ వరుసగా మూడు సార్లు 'ప్లే ఆఫ్స్'కు చేరడమే కాకుండా 2020లో ఫైనల్‌కు కూడా వెళ్లి రన్నరప్‌గా ముగించింది. అయితే గత మూడేళ్ల మాత్రం జట్టు పరిస్థితి మరింత దిగజారింది. క్యాపిటల్స్ వరుసగా ఐదు, తొమ్మిదో, ఆరో స్థానాల్లో నిలిచింది.

కోనేరు హంపి లేకుండా...

భారత ఒలింపియాడ్ జట్ల ప్రకటన

చెన్నై: చెస్ ఒలింపియాడ్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్ల వివరాలను అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో హంగేరీలోని బుడాపెస్ట్‌లో ఈ ఈవెంట్ జరుగుతుంది. గత కొంత కాలంగా నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న క్యాండిడేట్స్ టోర్నీ చాంపియన్ డి.గుకేశ్, ఆర్.ప్రజ్ఞానంద తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఐదుగురు సభ్యుల పురుషుల జట్టులో విదిత్ గుజరాతీ, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్‌తో పాటు సీనియర్ ఆటగాడు పెంటేల హరికృష్ణ కూడా ఉన్నాడు. భారత మహిళల టీమ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబు, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, తానియ సచ్‌దేవ్ ఉన్నారు. అయితే అనూహ్యంగా మరో సీనియర్ గ్రాండ్‌మాస్టర్, 2022 ఒలింపియాడ్‌లో కాంస్యం గెలుచుకున్న కోనేరు హంపి పేరు మాత్రం ఇందులో కనిపించలేదు. మహిళల టీమ్‌లో హంపి లేకపోవడానికి ఎలాంటి కారణాన్ని అధికారికంగా ఏఐసీఎఫ్ వెల్లడించలేదు.

ఫుట్‌బాల్ జోష్

UEFA EURO2024 GERMANY
CONMEBOL COPA AMERICA USA 2024

యూరో కప్ ఫైనల్
ఇంగ్లండ్ X స్పెయిన్
నేడు అర్ధ రాత్రి 12.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోపా అమెరికా ఫైనల్
అర్జెంటీనా X కొలంబియా
రేపు ఉ.గం.5.30 నుంచి

ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులను గంటల వ్యవధిలో రెండు ఆసక్తికర సమరాలు అలరించబోతున్నాయి. జర్మనీలోని బెర్లిన్ వేదికగా జరిగే యూరో కప్ ఫైనల్లో ఇంగ్లండ్, స్పెయిన్ తలపడనున్నాయి. స్పెయిన్ గతంలో మూడు సార్లు విజేతగా నిలవగా...ఇంగ్లండ్ ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేదు. మరో వైపు అమెరికాలోని ఫ్లోరిడా వేదికగా జరిగే కోపా అమెరికా కప్ ఫైనల్లో అర్జెంటీనాను కొలంబియా ఎదుర్కొంటుంది. ఈ టోర్నీలో అర్జెంటీనా ఏకంగా 15 సార్లు టైటిల్ నెగ్గగా...కొలంబియా ఒక సారి ట్రోఫీని సొంతం చేసుకుంది.

సినిమా

రాగాలాపనలో...



చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథన్, కునాల్ కపూర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకవైపు చిత్రీకరణ జరుపుతూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను కూడా ఈ చిత్రయూనిట్ ఆరంభించింది. ఇందులో భాగంగా ఇటీవల డబ్బింగ్ మొదలైంది. ఇక ప్రస్తుతం 'విశ్వంభర' రాగాలాపనలో ఉన్నాడు. ఈ చిత్రం మూజిక్ సిట్టింగ్స్ బెంగళూరులో జరుగుతున్నాయి. చిరంజీవి, ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తదితరులు ఈ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు. యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న 'విశ్వంభర' చిత్రం జనవరి 10న విడుదల కానుంది.

● చిరంజీవి

మనకే మనమే ఎవరో..!

'అరె ఏమైయ్యింది ఉన్నట్టుండి ఇవ్వాళే... అలవాటే లేని ఏవో ఆనందాలే..' అంటూ మొదలవుతుంది 'సరిపోదా శనివారం' సినిమాలోని 'ఉల్లాసం' పాట. నాని, ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరో హీరోయిన్లుగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్టు 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'సరిపోదా శనివారం' సినిమాలోని 'ఉల్లాసం' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ''ఉల్లాసం ఉరికే ఎదలో... ఉరిమే ఉత్సాహమే ఊపిరిలో... ఉప్పొంగే ఊహల జడిలో... మనకే మనమే ఎవరో...' అంటూ సాగే 'ఉల్లాసం' పాటను సినరే రాయగా, సంజిత్ హెగ్డే–ముత్యాల కృష్ణ లాస్య పాడారు. ఈ సినిమాకు సంగీతం: జేక్స్ బిజోయ్.



● ప్రియాంకా అరుళ్ మోహనన్, నాని

బ్రిటిష్ సైనికుడు?

సైనికుడిగా కనిపించనున్నారట ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ లవ్‌స్టోరీ 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణను ఆగస్టు చివర్లో లేదా సెప్టెంబరు మొదట్లో ప్రారంభించాలనుకుంటున్నారని తెలిసింది. యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథగా రూపొందనున్న ఈ సినిమా కథనం భారతదేశ స్వాతంత్ర్యం పూర్వానికి ముందు జరుగుతుందని, బ్రిటిష్ సైన్యంలో పని చేసే సైనికుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ పాత్ర కోసం ప్రభాస్ స్పెషల్‌గా మేకోవర్ కానున్నారట. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీతం అందించనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా గత నెల 27న విడుదలైన విషయం తెలిసిందే. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లుగా చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది.



● ప్రభాస్

ఒక ప్రమాదంతో అంతా అయిపోదు!

''నాకు జరిగిన ప్రమాదంలో భుజానికి గాయమైంది. కెరీర్ సజావుగా సాగుతున్న సమయంలో ఇలా జరగడంతో కాస్త బాధపడ్డాను. ఆ బాధ సహజమే. అయితే ఇంతటితో నా కెరీర్ ముగిసిపోయిందని మాత్రం అనుకోలేదు. ఒక్క ప్రమాదంతో అంతా అయిపోతుందని నిరుత్సాహపడలేదు. ప్రమాదం జరిగాక ఇంటికే పరిమితం అయిన నేను సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ షేర్ చేసినప్పుడు నెటిజన్లు బాగా స్పందించేవారు. నన్ను సిల్వర్ స్క్రీన్‌పై చూడాలని ఉందని కామెంట్స్ పెట్టేవారు. దీంతో నా ప్రేక్షకులు నన్ను చూడటానికి ఎదురు చూస్తున్నారని అర్థమైంది. వారి మాటలు నాలో ఆత్మవిశ్వాసం కలిగించాయి. అలాగే యాక్సిడెంట్ తర్వాత కూడా అవకాశాలు వచ్చాయి. ఆ అవకాశాలు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కానీ నేను పూర్తిగా ఫిట్‌గా ఉన్నప్పుడే సినిమాలు చేయాలని ఆ చాన్స్‌లు వదులుకున్నాను. దాదాపు మూడేళ్ల తర్వాత 'డార్లింగ్' సినిమాతో నన్ను నేను థియేటర్స్‌లో చూసుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు. ప్రియదర్శి, నభా నటేశ్ లీడ్ రోల్స్‌లో అశ్విన్ రామ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డార్లింగ్'. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నభా మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను స్ప్లిట్ పర్సనాలిటీ ఉన్న ఆనంది పాత్ర చేశాను. ఒకే సినిమాలో రెండు పాత్రలు చేసినట్లనిపించింది. సవాలుగా తీసుకుని చేశాను. ప్రస్తుతం నిఖిల్ పీరియాడికల్ మూవీ 'స్వయం భూ'లో ఓ పాత్ర చేస్తున్నాను'' అన్నారు.



● నభా నటేశ్

డబుల్ ధమాకా?



కన్నడ హిట్ ఫ్రాంచైజీ 'కేజీఎఫ్'లో హీరోయిన్‌గా నటించిన శ్రీనిధీ శెట్టి మంచి నటన కనబరచి ప్రేక్షకుల మెప్పు పొందారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు ఈ బ్యూటీ పరిచయం కానున్నారు. అయితే 'తెలుసు కదా' విడుదల కాకముందే డబుల్ ధమాకాలా మరో రెండు తెలుగు సినిమాల్లో శ్రీనిధికి ఆఫర్స్ దక్కాయట. రానా హీరోగా నటించనున్న ఓ సినిమాలో శ్రీనిధి హీరోయిన్‌గా ఎంపికయ్యారని ప్రచారం జరుగుతోంది. తాజాగా నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందనున్న 'హిట్ 3' సినిమాలోనూ హీరోయిన్‌గా శ్రీనిధీ శెటిని తీసుకున్నారని సమాచారం. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' మూవీతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఆగస్టు 29న విడుదల కానుంది. ఆ తర్వాత 'హిట్ 3'ని ఆరంభించే ఆలోచనలో ఉన్నారట. సో... 'సరిపోదా శనివారం' రిలీజ్ తర్వాత కానీ 'హిట్ 3' సినిమాలో ఎవరు హీరోయిన్‌గా నటిస్తారనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

● శ్రీనిధీ శెట్టి

హౌస్‌ఫుల్ ఫ్యామిలీలో...



హిందీ హిట్ ఫ్రాంచైజీ 'హౌస్‌ఫుల్'లో 'హౌస్‌ఫుల్ 5' రూపొందుతున్న సంగతి తెలిసిందే. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్, కృతీ సనన్, అనిల్ కపూర్ ఈ సినిమాలో లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. తరుణ్ మన్సుఖాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో సంజయ్ దత్ నటించనున్నట్లు చిత్రయూనిట్ శనివారం అధికారికంగా ప్రకటించింది. హౌస్‌ఫుల్ ఫ్యామిలీలోకి స్వాగతం అంటూ సంజయ్ దత్‌ను ఈ ఫ్రాంచైజీలోకి స్వాగతించారు నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా. కాగా 'హౌస్‌ఫుల్ 5' సినిమాను తొలుత ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆ తర్వాత వచ్చే ఏడాది జూన్ 6న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

● సంజయ్ దత్

రామచంద్రుడు వస్తున్నాడు



నటుడు కృష్ణవంశీని హీరోగా పరిచయం చేస్తూ, ఆకాష్ రెడ్డి దర్శకత్వంలో హైమావతి, శ్రీ రామ్ జడపోలు నిర్మించిన ప్రేమకథా చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. ఈ చిత్రంలో మోక్ష హీరోయిన్. ఈ సినిమాను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ శనివారం ప్రకటించారు. ఎస్‌వీసీ (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. బ్రహ్మాజీ, సుధ, ప్రమోదిని, కేశవ్ దీపక్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు శశాంక్ తిరుపతి సంగీతం అందించారు.

● మోక్ష, కృష్ణవంశీ

ఫుల్ ఫన్



అభిషేక్ పచ్చిపాల హీరోగా, నజియా ఖాన్, వినీషా జ్ఞానేశ్వర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. కామెడీ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాను యశ్వంత్ దర్శకత్వంలో తన్వీర్, ప్రకాశ్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో హీరో అభిషేక్ మాట్లాడుతూ –''సినిమా మొత్తం ఫన్ ఉంటుంది. ఈ చిత్రం ప్రేక్షకులను నిరుత్సాహపరచదు. బాజీ మ్యూజిక్ ఓ హైలైట్‌గా ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమాను ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ వేడుకలో నజియా ఖాన్, వినీషా జ్ఞానేశ్వర్, సారిపల్లి సతీష్, జబర్దస్త్ ఫణి మాట్లాడారు.

● నజియా, అభిషేక్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల హిందూ/B.Tech, MS/30/USA H1B వీసా and 140MNC/130K USD జీతం/ 6'0"/బాగా స్థిరపడిన కుటుంబానికి చెందిన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9705960270 [H-796319]

ముదిరాజ్/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ SBI / 82,000/-pm/ 5'10" ఎత్తు / 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-16307]

SC హిందుమాల/కట్న ప్రసక్తిలేదు/ M.Tech, IIT/ C.Govt. ఇన్స్పెక్టర్/ GST Dept./ 1 Lakh pm/ 5'11" ఎత్తు / 29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16307]

క్రిస్టియన్ మాదిగ/M.Tech, IIT/ C.Govt. Asst. మేనేజర్/ IOCL/ 16 Lakhs PA / 5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16307]

వడ్డెర/కట్న ప్రసక్తిలేదు/M.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/ 90,000/- pm/ 5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16307]

36 సం॥ల బిజినెస్ చేస్తున్న వరుడికి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయిన సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301943220, 9866724586 [HA-97924]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 7995585722, 9848817137. [T-2181]

★

వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్, పద్మశాలీ, 32Yr./ 5'5"/Qly: B.Sc., Comp. Diploma DOA, Occup : బిజినెస్, 2వ పెళ్ళి, వెల్ సెటిల్డ్. సెల్–94413 86713, 99481 19207. [M-1185251]

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, ఓల్డ్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK. కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-801637]

గౌడ్: B.Tech / 28 Yrs / 5'11" / Indian Bank PO / 65,000/- PM / అందమైన వరునికి తగిన వధువు కావలెను. Direct: 9381160075. [WA-6507]

★★

రాజులు, యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం, సొంత ఇల్లు, 2వ పెళ్ళి, 46 సం॥లు గల వరుడికి కులప్రసక్తిలేని సంప్రదాయమైన వధువు కావలెను. డైరెక్ట్ ✆ 96520 16569. [B-782126]

బ్రాహ్మణ/53/4'2"/ వరుడికి మొదటి పెళ్ళి విడో వధువు కావలెను. 50 వయసు ఇల్లరికం ఉన్నవారు మాత్రం వాట్ సప్ చెయ్యండి. నో బ్రోకర్ ✆ 6360106137 [B-1239461]


డైరెక్ట్/ 45 / ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్–Ph: 85199 34926. [L-796404]

వధువు కావలెను.కాపు, నెల్లూరు 42Y / 2వ మ్యారేజ్ వరునకు కులపట్టింపు లేని ఉద్యోగ వధువు కావలెను. డైరెక్ట్ వరుడు సెల్: 96039 59855. [N-1249346]

OC వయస్సు : 50, బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్‌సెటిల్ వధువు కావలెను. (డైరెక్ట్) సంప్రదించండి : 9490878846 [P-749607]

REDDY, 34 y, MS (Civil USA) Civil Engineer in USA, 5'11", Fair, 5C, Looking for Graduate Bride Pls Cont: 9493242896/ 5 [G-795924]

వరుడు కావలెను



రెండవ పెళ్ళి/విడో/45y/Housing ఇంజినీర్ /1L PM/18ఎ॥ Lands/కోట్ల ఆస్తి గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9100818693 [H-796097]

రెండో పెళ్ళి/విడో/52y/Fair/College Job/వెల్ సెటిల్/పిల్లలులేని ఏ బాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/ BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-796097]

రెడ్డి/2nd మ్యారేజ్/B.Com/5'4"/Own బిజినెస్/వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు) 1st/2nd (ఇల్లరికం OK) Ph: 8143011223 [H-796097]

రెడ్డి/విడో/2nd మ్యారేజ్/30y (కుల, మత, ఆస్తి) ప్రసక్తి లేదు/B.Com/Own House/ Agriculture Land గల అందమైన వధువుకు 1వ/2వ వరుడు కావలెను (ఇల్లరికము OK) Ph: 9573797905 [H-796097]

కమ్మ/48y / విడో / Govt.Lecturer / Own Auto Mobile Show Room/50Acres Land/18 Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8374415657 [H-796319]

వైశ్య/60/విడో/5'4"/Govt.టీచర్/80,000/- PM/2 సొంత ఇల్లులు/ట్యూషన్స్/50K/PM ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 9618513615 [H-796319]

రెడ్డి/ విడో /60y /వ్యవసాయ/ప్రభుత్వ రిటైర్డ్/Own House గల ఒంటరి వధువుకు స్నేహపూర్వకమైన కులప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9705889182 [H-796319]

FC/60y/విడో/5'4"/Fair/RMP డాక్టర్/ Own Medical Shop గల ఒంటరి వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. Ph: 7288012534 [H-796319]

రెడ్డి/విడో/54Y/ప్రావస్ Ongole/ సొంత అపార్ట్ మెంట్స్ /సొంత హాస్టల్స్/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) ఫోన్ : 7799083500, 7386660643 [H-778895]

2వ పెళ్ళి /4,00,000PM / బాగా స్థిరపడిన అందమైన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం. పిల్లలు ఉన్నా OK కోట్ల ప్రాపర్టీ ఉంది. సంప్ర : 9381696641 [H-778895]

రెడ్డి/విడో/60year's/5'5"/Very Fair, Govt H.M. Rtd, సొంత ఇల్లు, రెంట్స్, 28 ఎకరాల పంట పొలం, 3Lakh PM, ఏ బాదరబందీ లేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. 7095001526 [H-778895]

గౌడ్/34/5'5"/MS Gen Surgeon "29/5'5"/MDS "35/5'3"/MS MCH DNB Pediatric Surgeon " 32/5'3"/MCH Surgical Oncology "29/5'5"/ MS/Gene-Surgeon 2nd Year "34/5'7"/MS Paediatrics Critical care "30/5'4"/MD Radiology "42/5'4"/MD Microbiology 1st year అమ్మాయిలకు తగిన గౌడ్ అబ్బాయిలు కావలెను. సంప్ర॥ 'శుభమస్తు' DSNR, Hyd, S.రాములు గౌడ్ Ph: 8790690309 [H-796320]

రెడ్డి/కుల పట్టింపు లేదు/49yrవిడో/సిటీకి దగ్గరలో 6 ఎకరాల పొలం తక్కువ వదువు చిన్న ఇల్లు ఏ బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను (అర్జెంట్) ఇల్లరికం OK. 8367233524 [H-778895]

క్రిస్టియన్ మాల / B.Tech / Govt. PO/ C.G.G.B బ్యాంక్/ 60,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16307]

యాదవ/B.Tech, IIT/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 65,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-16307]

SC మాదిగ/M.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI /75,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16307]

రజక/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/ 60,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16307]

ముదిరాజ్/M.Sc (Agri)/ Govt. A.E.O/ అగ్రికల్చర్ Dept / 48,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16307]

వడ్డెర/50 లక్షల ఆస్తి/ M.Sc/ Govt. Jr. అకౌంటెంట్/ R.T.O ఆఫీస్/ 40,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16307]

క్రిస్టియన్ మాల /27 / 5'4" / MBBS/ Govt. డాక్టర్, అందమైన వధువుకు తగిన Govt/SWE/డాక్టర్ వరుడు కావలెను. Ph: 8919759359 [HA-16310]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/39Yrs, MBA, Govt. ఆఫీసర్, 3 లక్షలు PM, సొంత ఇల్లు, రెంట్స్, కార్, 100 కోట్ల ఆస్తి/పిల్లలు లేని అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 7396213324 [HA-16310]

BC/43/5'2"/డిగ్రీ, వ్యాపారం 3L PM, Hyd లో సొంత బంగ్లా కల్గి బాగా స్థిరపడిన అందమైన విడో వధువుకు వరుడు కావలెను. ఆధార్‌తో సంప్ర: Ph: 9573943211, 8125132949 [HA-16310]

2వ పెళ్ళి/48Y, విడో/ఫ్యామిలీ పెన్షనర్, 65000/-PM, సొంత ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. Any FC/BC Only-60Y వరకు OK. Ph: 9666498650 [HA-16310]

యాదవ /ఎర్ర శాఖ అప్పర్ మిడిల్, 37Y/ 5'4"/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగి లక్ష రూ॥ P/M ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father సంప్ర : 9989597799 [H-778746]

బాహ్మణ /24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/ 5'3"/ B.Sc "27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842636086 [HA-16313]

★★

రెడ్డి/విడో/Age: 32, MBA, Fair సొంత వ్యాపారములు గల అందమైన వధువుకి వరుడు కావలెను/కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/(ఇల్లరికం OK) Ph: 8121347478 [HA-16314]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/ 2వ/ లేట్ విడో/విడోయర్/పెన్షనర్స్/ఒంటరి స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర : 8374802603 [H-778895]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-796097]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16311]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16311]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16311]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16311]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16311]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్స్ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18–70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

www.christianholymatrimony.com ద్వారా క్రైస్తవ వివాహ పరిచయవేదిక జూలై 17, (బుధవారం) ఉ. 10- సా. 4 వరకు సికింద్రాబాద్ YMCAలో. ప్రొఫైల్స్ వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులము వారికి Govt/ సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్ / MBBS / PG/NRI/ Pvt / బిజినెస్/1వ/2వ/లేట్/AP/TS 15 సం॥ Exp: Ph: 9989140444 [H-32366]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt.ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16310]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ॥ 9 గం॥లకు 65వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 20వ పునర్ వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీ లో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. ✆ 99895 00130 [B-284]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-909]

Free Register హిందూ మాల / మాదిగ & క్రిస్టియన్ వధూవరుల online స్వయంవరం July 14th bhavanimatrimony, Hyd. 9704656103/ 9533608887 [HA-878]

★★

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [HA-10860]

కాంబోడియా కేసులో కీలక నిందితుడి అరెస్టు

- ఢిల్లీలో మహ్మద్ షాదాబ్ ఆలంను అరెస్టు చేసిన టీజీసీఎస్‌బీ అధికారులు
- ఉద్యోగాల పేరిట కాంబోడియాకు మానవ అక్రమరవాణా
- చైనా దేశీయులతో కలిసి సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠా

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాల పేరిట కాంబోడియాకు తరలించి..వారితో అక్కడ బల వంతంగా సైబర్‌నేరాలు చేయిస్తున్న ముఠాలోని కీలక నిందితుడు మహ్మద్ షాదాబ్ ఆలం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులకు చిక్కాడు. ఈనెల 10 ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహ్మద్ షాదాబ్ ఆలంను అరెస్టు చేసినట్టు టీజీసీఎస్‌బీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. నిందితుడిపై వివిధ సెక్షన్లతోపాటు ఎమిగ్రేషన్ చట్టంలోని సెక్షన్ 24కింద కేసు లు నమోదు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు ఏ జెంట్లు కె.సాయిప్రసాద్(జగిత్యాల), మహమ్మద్ అబిద్ హుస్సేన్ అన్సారీ (బిహార్) గతంలోనే అరెస్టయ్యారు.

సిరిసిల్ల బాధితుడి ఫిర్యాదుతో..

విదేశాల్లో ఉద్యోగం పేరిట తన కుమారుడిని ఏజెంట్లు సాయిప్రసాద్, మహ్మద్ అబిద్ అన్సారీ, మహ్మద్ షాదాబ్ ఆలంలు రూ.1,40,000 వసూలు చేసి కాంబోడియాకు తీసుకెళ్లి బల వంతంగా సైబర్‌నేరాలు చేయిస్తున్నారని సిరిసిల్లకు చెందిన ఓ బాధితుడి తల్లి ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా టీజీసీఎస్‌బీ అధికారులు రంగంలోకి దిగారు. అక్కడి అధికారులతో సంప్రదింపులు జరిపి సదరు బాధితుడిని తిరిగి స్వస్థలానికి రప్పించారు. ఆ బాధితుడు ఇచ్చిన వివరాల ప్రకారం..ఈ ముఠా కాంబోడియాలో ఉద్యోగాల పేరిట తమను అక్కడి తీసుకెళ్లి, నిర్బంధించి, చిత్ర హింసలకు గురిచేసి సైబర్ నేరాలు చేయిస్తున్నట్టు తెలిపారు. ఇలా భారత్ నుంచి దాదాపు 500 నుంచి 600 మందిని కాంబోడియాకు తీసుకెళ్లి అక్కడ చైనా వారికి అప్పగిస్తున్నారన్నారు. చైనీయులు పాస్‌పోర్టులు తీసుకొని, హింసించి తమతో సైబర్ నేరాలు చేయించారని బాధితుడు తెలిపారు. ఈ వివరాలతో దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు ఈ ముఠాలోని కీలక నిందితుడు మహ్మద్ షాదాబ్ ఆలంను అరెస్టు చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి : టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

విదేశీ జాబ్ ఆఫర్ల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు. ఏజెంట్లు సరైన వారేనా? వారు చెబుతున్న ఉద్యోగ ఆఫర్ సరైందేనా అని తెలుసుకోవా లన్నారు. ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ లేదా వీసా చార్జీల కోసం పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తే అనుమానించాలన్నారు. అధికారులు, రాయబార కార్యాలయ సిబ్బంది నుంచి సమాచారం సేకరించుకొని నిర్ధారించుకోవాలని సూచించారు. ఏవైనా మోసపూరితమైన చర్యలు గమనిస్తే ఫిర్యాదు చేయాలన్నారు.



ఈ రైతు పేరు శీలపురెడ్డి వెంకటరెడ్డి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన రైతు శీలపు వెంకటరెడ్డి 2020 నవంబర్‌లో 5 ఎకరాల భూమిలో 290 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. అందులో 125 మొక్కలు ఇప్పటికీ సరిగ్గా ఎదగలేదు. దీంతో విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆ మొక్కలు పరిశీలించిన ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు అవి ఎదిగేందుకు అవకాశం లేని/కాపు సరిగా రాని (హాఫ్ టైప్), బతికేందుకు ఎక్కువగా అవకాశం లేని (మోర్టాలిటీ రేటు ఎక్కువగా ఉన్న) మొక్కలుగా తేల్చారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ, పాకల గూడెంకు చెందిన మన్నేని అనసూర్య కూడా ఆయిల్ పామ్ తోట వేసింది. ఈమె తోట మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తోట పక్కనే ఉంటుంది. 8 ఎకరాల్లో తోట వేయగా 200 మొక్కలు హాఫ్ టైప్ ప్లాంట్స్ అని తేలింది. దీనిపై ఆమె ఆయిల్ ఫెడ్‌కు లేఖ రాసి రెండు నెలలయ్యింది. ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు.





ఈ రైతు పేరు చెలికాని సూర్యారావు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని జగ్గారం, పట్వారీ గూడెంల మధ్యలో రైతు చెలికాని సూర్యారావు 20 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు వేయగా అందులో 200 మొక్కలు కాపు సరిగా రాని మొక్కలుగా తేలింది. ఆయిల్ ఫెడ్ అధికారులు వచ్చి 100 మొక్కలకు రిబ్బన్ కట్టి అబ్జర్వేషన్ అని చెప్పి వెళ్లారు. మళ్లీ ఇటువైపు రాలేదు.

ఎదగని ఆయిల్‌పామ్‌తో దగా!

నాసిరకం మొక్కలు ఇచ్చి మోసం చేశారంటున్న రైతన్నలు

- లక్షల్లో నష్టమంటూ గగ్గోలు
- 2021-22, 2022-23ల్లో 82 లక్షల మొక్కలు దిగుమతి
- మోర్టాలిటీ శాతం 15.80గా నమోదైనా పంపిణీ

సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ మొక్కలు నాటి నాలుగైదేళ్లు కావొస్తున్నా కాపు రాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్ ఫెడ్ అధికారులు నాసిరకం మొక్కలు సరఫరా చేయడంతో తాము నట్టేట మునిగామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లకే పంట దిగుబడి రావాల్సి ఉండగా మొక్కలు సరిగా ఎదగక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మొక్కలు నాటిన రెండేళ్ల నుంచి ఎకరానికి 10 నుంచి 15 మొక్కల వరకు చనిపోతుండటంతో మళ్లీ కొత్తవి నాటినట్లు రైతులు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పామ్ నర్సరీలు నాణ్యమైన మొక్కలు సరఫరా చేయకపోవడం వల్లే తాము నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి గెలలు వేయటం, అవి గిడసబారి ఎదగక పోవటంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. నాసిరకం మొక్కలు ఇచ్చినందుకు ఆయిల్‌ఫెడ్ బాధ్యత వహించి ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలంటున్నారు. ఏపీలో గత ప్రభుత్వం ఇలాగే పరిహారం ఇచ్చిందని, అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ హాఫ్ టైప్ మొక్కల వ్యవహారం బయటకు పొక్కకుండా అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

విదేశాల నుంచి సీడ్లింగ్స్

రాష్ట్రమంతా ఆయిల్‌పామ్ విస్తరణ పేరిట ప్రభుత్వం పెద్ద ఎత్తున హడావుడి చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా గతంలో పలు దేశాల నుంచి దాదాపు రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేసి ఆయిల్‌పామ్ అంట్లు ఆయిల్ ఫెడ్ తెప్పించింది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో వివిధ దేశాలనుంచి ఏకంగా 82 లక్షల మొక్కలు దిగుమతి చేసుకున్నారు. ఈ 82 లక్షల మొక్కలకుగాను మోర్టాలిటీ శాతం 15.80గా నమోదైంది. అంటే 100లో 16 వరకు మొక్కలు బతికేందుకు అవకాశం తక్కువగా ఉంటుందన్నమాట. పదేళ్ల క్రితం 10 శాతం మోర్టాలిటీ మాత్రమే ఉండేది. దాన్ని బాగా తగ్గించాలని తపన పడేవారు. కానీ ఇప్పుడు ఇంత పెద్ద సంఖ్యలో మోర్టాలిటీ ఉన్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దిగుమతి చేసుకున్న వాటిల్లో మంచిగా ఉన్నవాటిని కొన్ని ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్‌ఫెడ్‌లోని కిందిస్థాయి అధికారులు అమ్మేసుకున్నారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే మోర్టాలిటీకి అవకాశం ఉన్న వాటిని వేరు చేయకుండా వాటిని సైతం ఆయిల్ ఫెడ్, కంపెనీలు ఇవ్వడం వల్లే తాము నష్టపోవాల్సి వచ్చిందని, ఆయిల్‌పామ్ మొక్కలకు సంబంధించి మొత్తం వ్యవహారాన్ని చూసే అధికారికి ఇవన్నీ తెలుసని రైతులు అంటున్నారు. నష్టంపై న్యాయ పోరాటానికి కూడా సిద్ధమవుతున్నారు. కాగా అవి నాసిరకపు మొక్కలేనని జాతీయ పామాయిల్ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు కూడా తేల్చడం గమనార్హం. మరోవైపు దీనిపై ముఖ్యమంత్రికి సైతం ఫిర్యాదులు వెళ్లాయి.

40 లక్షల మొక్కల పరిస్థితి ఏంటి?

ఆయిల్‌పామ్ ఏపీ యాక్ట్ 1993 ప్రకారం..కేవలం ఆ ఏరియాకు కేటాయించిన కంపెనీ వారు మాత్రమే విదేశాల నుండి విత్తన మొలకలు తెప్పించి, 12 నెలల కాలం పెంచి నాణ్యమైన మొక్కలు రైతులకు ఇవ్వాలి. ఆ మొక్కలకు పూర్తి బాధ్యత ఆ కంపెనీదే. మొక్కలు పెంచే క్రమంలో మూడుసార్లు ఉద్యాన, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి సర్టిఫికెట్ ఇచ్చిన తరువాతే మొక్కలు రైతులకు ఇవ్వాలి. ఇందులో కేసు నమోదు అయితే వారూ బాధ్యులే అవుతారు. అయితే నాసిరకపు మొక్కలు ఇవ్వడంతో ఈ ప్రాంతంలో వందల ఎకరాలలో ఈ హాఫ్ టైప్ ప్లాంట్ల సంక్షోభం నడుస్తోంది. ఈ విషయం బయటికి వస్తే రాష్ట్రంలో ఆయిల్ పామ్ వేయడానికి ఎవరూ ముందుకు రారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కారణంగానే అధికారులు విషయం బయటకు పొక్కకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

మూడేళ్ల తరువాత ఎఫ్ఐఆర్ ఏంటి?

- ఏపీలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఫిర్యాదుతో మాజీ సీఎంతోపాటు సీనియర్ ఐపీఎస్‌లపై కేసులా?
- దేశ ఉన్నత న్యాయస్థానాలు ఈ కేసును పరిశీలించాయి కదా..
- ఏమీ బయటకు రాలేదు కదా..
- కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- మాజీ ఐపీఎస్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కస్టడీ హింసకు సంబంధించి తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తనను షాక్‌కు గురిచేసిందని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు సీని యర్ ఐపీఎస్ అధికారులైన డీజీపీ ర్యాంక్ అధికారి పీవీ సునీల్‌కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులుపై పోలీసులు మూడేళ్ల తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడం విచారకరమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా స్పందించారు. 'మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజు తనపై కస్టడీ హింస జరిగిందని చేసిన ఫిర్యాదుపై ఆ రోజుల్లోనే ఉన్నత న్యాయస్థానాలు నిశితంగా పరిశీలించాయి. కానీ ఏమీ బయటకు రాలేదు. ఈ మూడేళ్లలో పాలకవర్గం తప్ప మారింది ఏమీ లేదు. మూడేళ్ల విరామం తరువాత హఠాత్తుగా ఎఫ్ఐఆర్ ఎందుకు? దురదృష్టవశాత్తు, నిజాయితీగల పోలీసులు ఈ దేశంలో ప్రతీకార రాజకీయాల్లో బాధితులుగా మారారు. గోధ్రా మారణహోమంలో సత్యం, న్యాయానికి అండగా నిలిచినందుకు గుజరాత్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ సంజీవ్ భట్ ఏళ్ల తరబడి జైల్లో మగ్గుతున్నాడు. రాజకీయ పార్టీలు తమ సోషల్ మీడియా ట్రోల్ బ్రిగేడ్‌ల ద్వారా మంచి అధికారులను కూడా దెయ్యాలుగా చూపించడం ప్రారంభించాయి'అని వ్యాఖ్యానించారు. ''2021లో ఎంపీగా ఉన్న ఇదే రాజకీయ నాయకుడు, పార్లమెంటు వేదికపై నాపై కూడా నిరాధార ఆరోపణలు చేశాడు. ఈ వ్యక్తి విద్య ద్వారా పేదల విముక్తికి ఏనాడూ అనుకూలంగా లేడు. ఈయన మళ్లీ ఎమ్మెల్యే ఎలా అయ్యాడో అని ఆందోళన చెందుతున్నాను. ఏపీతోపాటు ఇతర ప్రాంతాల్లో సీనియర్ పోలీసు అధికారులు, 'ఇతరులపై' నమోదు చేసిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి'' అని ఆయన పోస్ట్ చేశారు. ఈ పోస్టును ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అకౌంట్లకు ట్యాగ్ చేశారు. జస్టిస్ ఫర్ పీవీ అండ్ పీఎస్ఆర్, సే నో టూ వెండెట్టా పాలిటిక్స్ హ్యాష్ ట్యాగ్‌లను ఈ పోస్టుకు ప్రవీణ్‌కుమార్ జత చేశారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలి
- ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల

పంజగుట్ట (హైదరాబాద్): ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి వారికి హెల్త్‌కార్డులు మంజూరు చెయ్యాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్, ఎంపీ ఆర్. కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేసే చాకిరిని పర్మనెంట్ ఉద్యోగులు కూడా చేయరని, ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా సమ్మెలు చేస్తారని, కానీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అలాంటి అవకాశం లేదని పేర్కొన్నారు. ఎవరు కన్నెర్రచేసినా ఉద్యోగం పోతుందనే భయంతో ఉంటారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌లో పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు ఉన్నారని.. లక్షల్లో జీతం తీసుకునే ఉద్యోగులు చెయ్యలేని పనిని రూ.12 వేల వేతనం తీసుకునే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తారని అన్నారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇల్లు కట్టలేడని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీలతో పనిలేకుండా ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి వేతనాలు ఇచ్చారని, అదేతరహాలో ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చి వారిని పర్మనెంట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని వారంతా రోడ్లపైకి వచ్చి ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో టీజీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఎలూరి శ్రీనివాస్, టీఎస్‌జీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా నాన్నకే కాదు మాకూ చెప్పండి

ప్రేమోన్మాదులను ఆదిలోనే అడ్డుకోవాలంటున్న పోలీసు అధికారులు

ప్రేమ పేరిట వేధిస్తే.. తల్లిదండ్రులతోపాటు పోలీసు స్టేషన్‌లోనూ చెప్పాలని సూచన

- అందరికీ విషయం తెలుస్తుందన్న ఆందోళన వద్దని.. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ
- షీ టీమ్స్ వారి పనిపడతాయంటూ భరోసా
- మీ భద్రతకు మాది పూచీ: అడిషనల్ డీజీ శిఖాగోయల్



నిన్న వరంగల్ జిల్లాలో.. మొన్న విశాఖ జిల్లాలో ప్రాంతమేదైతేనేం.. ప్రేమోన్మాదుల దారుణాలు పెచ్చుమీరుతున్నాయి. అయితే.. ఇలాంటి వాటిని ఆదిలోనే అడ్డుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఎవరైనా ప్రేమ పేరిట వేధిస్తున్నా.. ఇబ్బందికరంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కూ సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు. విషయం పోలీసుల వద్దకు వెళ్తే అందరికీ తెలిసిపోతుందనే భయాలు, ఆందోళన వద్దనీ, బాధితుల వివరాలు అత్యంత గోప్యంగానే ఉంచి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పోలీసు అధికారులు భరోసానిస్తున్నారు. మొదట్లోనే విషయం పోలీసుల దృష్టికి తెస్తే అనర్థాలకు దారితీయకుండా కాపాడుకోవచ్చని చెబుతున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన షీటీమ్ బృందాలు వెంటనే ఆకతాయిల పనిపడతాయని హామీనిస్తున్నారు. ఈమేరకు పలు సూచనలు చేశారు.

- సాక్షి, హైదరాబాద్

అత్యవసరమైతే డయల్ 100

వేధింపుల ఘటనలపై అత్యవసరమైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా డయల్ 100కి ఫోన్ చేయాలి. రాష్ట్ర మహిళా భద్రత విభాగం వాట్సాప్ నంబర్లు 9440700906, 8712656858కు ఫిర్యాదు చేయవచ్చు. లేదా womensafety@gmail.com ఈ మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

మరింత రక్షణ కల్పించేలా చట్టాలు



మహిళలు, చిన్నారులకు మరింత రక్షణ కల్పించేలా నూతన క్రిమినల్ చట్టాలు ఎంతో బలోపేతం చేశారు. తప్పుచేస్తే కఠినశిక్షలు తప్పవని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు వాట్సాప్‌చాట్, ఈమెయిల్ వంటి ఎల్రక్టానిక్ ఎవిడెన్స్‌లు ఆధారంగా తీసుకోవడం కీలక పరిణామం. బాధితురాలు ఎక్కడి నుంచైనా నిర్భయంగా ఫిర్యాదు చేసేలా ఈ–ఎఫ్‌ఐఆర్ వంటి సదుపాయంతో పాటు నేరం జరిగిన ప్రదేశం ఏదైనా జీరో ఎఫ్‌ఐఆర్ నమోదుకు అవకాశం ఉండడం బాధితుల్లో మరింత భరోసా పెంచుతుంది. పోలీసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌కు సైతం నిర్ధారిత కాలంలో పూర్తి చేయాలని సూచించడం కూడా శుభపరిణామం.

- డా.వాణి అక్కపెద్ది,
ప్రిన్సిపాల్, కేశవ్ మెమోరియల్ లా కాలేజీ

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



సమస్య చిన్నదే కదా అని వదిలేస్తే అది దాడుల వరకు వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎవరైనా ప్రేమపేరుతో వేధించినా, వెంటపడుతున్నా.. నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయండి. మీ వివరాలు బయటికి రాకుండా చూడడంలో వందశాతం మాది బాధ్యత. యువతులు, వారి తల్లిదండ్రులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం..ఆలస్యం చేయవద్దని నా విన్నపం. మీ భద్రతకు తెలంగాణ పోలీస్ పూర్తి భరోసా ఇస్తుంది. ఎక్కడ లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ సమస్య ఉన్నా డయల్ 100కు సమాచారం ఇస్తే వెంటనే మా షీటీమ్స్‌ను రంగంలోకి దింపుతాం. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోనూ మా షీ టీమ్స్ పనిచేస్తున్నాయి.

- శిఖాగోయల్, అడిషనల్ డీజీ,
మహిళా భద్రత విభాగం





శుక్రవారం రాత్రి ముంబైలో జరిగిన అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ దృశ్యాలు

క్లుప్తంగా...

రాష్ట్రంలో తగ్గిన హత్యలు

- మానవ అక్రమ రవాణా కేసుల్లోనూ తగ్గుదల
- నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హత్యలు తగ్గినట్టు నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. చిన్నారులపై నేరాల్లోనూ గణనీయమైన తగ్గుదల ఉన్నట్టు పేర్కొంది. నివేదికలో పేర్కొన్న ప్రకారం..రాష్ట్రంలో ప్రతి లక్ష మంది జనాభాకు 2020-21లో 2.5 శాతం హత్యలు నమోదు కాగా, 2023-24లో 2.3 శాతం హత్య కేసులు నమోదైనట్టు తెలిపింది. మానవ అక్రమ రవాణా కేసుల్లో ప్రతి 10 లక్షల మంది జనాభాకు 2020-21లో 18.55 శాతం నమోదు కాగా, 2023-24లో 8.96 శాతం నమోదైంది. చిన్నారులపై నేరాల కేసుల విషయానికి వస్తే ప్రతి లక్ష మందికి 2020-21లో 49.7 శాతం ఉండగా.. 2023-24లో అది 37.7 శాతానికి తగ్గింది. చిన్నారుల అదృశ్యం కేసుల శాతం ప్రతి లక్ష మందికి 2020-21లో 30.25 శాతం ఉండగా, 2023-24లో 29.62 శాతం నమోదైంది.

ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలి

రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మోహన్ నారాయణ, ఎస్.నర్సరాజు కోరారు. ఈ మేరకు శనివారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇచ్చిన హామీ మేరకు ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలని, పెన్షన్ చెల్లింపులను మరింత సులభతరం చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు.

చర్లపల్లి టెర్మినల్ రెడీ!



త్వరలోనే ప్రారంభం
98 శాతం పనులు పూర్తైనట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన



సాక్షి, హైదరాబాద్

అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆధునిక హంగులతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ త్వరలో ప్రారంభం కానుంది. ప్రయాణికులకు సకల సదుపాయాలతో ఎయిర్‌పోర్టు తరహాలో చర్లపల్లి టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల పైన ఒత్తిడిని తగ్గించేందుకు నాలుగో టెర్మినల్‌గా దక్షిణమధ్య రైల్వే చర్లపల్లి పునర్నిర్మాణం చేపట్టింది. సుమారు రూ.434 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 98 శాతం పూర్తయినట్లు స్వయంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల కంటే ముందే దీన్ని వినియోగంలోకి తేవాలని భావించినప్పటికీ అప్పట్లో ఇంకా కొన్ని పనులు మిగిలిపోవడం వల్ల సాధ్యం కాలేదు. ఆ తరువాత ఎన్నికల కోడ్ వచ్చేసింది. ప్రస్తుతం దాదాపుగా పనులన్నీ పూర్తి కావడంతోనే త్వరలోనే చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు.

రోజుకి 50 రైళ్ల రాకపోకలకు అవకాశం

సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న దృష్ట్యా ప్రస్తుతం సికింద్రాబాద్ వరకు రాకపోకలు సాగిస్తున్న కొన్ని రైళ్లను త్వరలో చర్లపల్లి నుంచి నడుపనున్నారు. 9 ప్లాట్‌ఫామ్‌లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి నుంచి రోజుకు 50 రైళ్ల రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం 30 రైళ్లతో (15 జతలు) చర్లపల్లి స్టేషన్‌ను వినియోగంలోకి తేనున్నారు. మొదట 25 వేల మందికి పైగా చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నారు. రైళ్లు పెరిగే కొద్దీ ప్రయాణికుల సంఖ్య పెరగనుంది.

ఔటర్‌కు చేరువలో...

ఔటర్‌రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న చర్లపల్లి స్టేషన్‌కు నగరవాసులు వివిధ ప్రాంతాల నుంచి ఔటర్ మీదుగా చేరుకొనేందుకు అవకాశం ఉంది. మరోవైపు ఎంఎంటీఎస్ రెండో దశలో విస్తరించిన సికింద్రాబాద్-ఘట్కేసర్ రూట్‌లో ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలు కూడా ప్రారంభం కానున్నాయి.

దీంతో ప్రయాణికులు నగరానికి పడమటి నుంచి తూర్పు వైపు తేలిగ్గా రాకపోకలు సాగించవచ్చు.

ప్రయాణికుల సదుపాయాల్లో భాగంగా 5 లిఫ్టులు, 9 ఎస్కలేటర్లు ఉన్నాయి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సోలార్ పవర్ ప్రాజెక్టును చేపట్టారు.

ప్రయాణికుల రాకపోకల కోసం రెండు సబ్‌వేలను నిర్మించారు. అలాగే రహదారులను విస్తరించారు. సుమారు 4 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకర్‌లను సిద్ధం చేశారు.

చర్లపల్లి నుంచి నడిచే రైళ్లు ఇవే...

- షాలిమార్ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045/18046),.
- చెన్నై నుంచి నాంపల్లి స్టేషన్‌కు నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12603/12604)
- గోరఖ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే (12589/12590) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్..
- హైదరాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011/17012), సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757/12758),
- గుంటూరు-సికింద్రాబాద్ (17201/17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233/17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్..
- విజయవాడ-సికింద్రాబాద్ (12713/12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (12705/12706) ఎక్స్‌ప్రెస్, తదితర రైళ్లను చర్లపల్లి నుంచి నడపనున్నారు.
- మొత్తంగా మొదట 15 జతల రైళ్లు చర్లపల్లి నుంచి ప్రారంభం కానున్నాయి.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, హైదరాబాద్: పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం జూలై 19వ తేదీ శుక్రవారం ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ఈ బస్సులు జూలై 19న రాత్రి 08.00 గంటలకు ఎంజీబీఎస్ నుంచి బయల్దేరి మరుసటి రోజు (20వ తేదీ) ఉదయం చిత్తూరు జిల్లా కాణిపాకం చేరుకుంటాయి. అక్కడ వినాయక ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత తమిళనాడులోని వేలూరులోని స్వర్ణ దేవాలయానికి చేరుకొని, దర్శనం అనంతరం అరుణాచలం ఆలయానికి చేరుకుంటాయి. 21వ తేదీ గురుపౌర్ణమి రోజున అరుణాచలంలో గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం 05.00 గంటలకు బయల్దేరి 22వ తేదీ ఉదయం 6.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. ఈ ప్రయాణానికి టికెట్ చార్జీ ఒక్కొక్కరికి రూ.3,700. నగరంలోని అన్ని ఆర్టీసీ కౌంటర్ల వద్ద లేదా tsrtconline.in ద్వారా బుకింగ్‌లు చేసుకోవచ్చని తెలిపారు.



సదస్సు లోగో ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో బుర్రా వెంకటేశం, మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్ రంజన్ తదితరులు

హైదరాబాద్‌లో గ్లోబల్ ఏఐ సదస్సు

- సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైటెక్స్‌లో నిర్వహణ..
- లోగోను ఆవిష్కరించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సును సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహిస్తున్నట్టు సీ ఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కూకట్‌పల్లి జేఎన్టీయూ లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సదస్సు లోగోను ఆవిష్కరించారు. సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వకారణమని, నూతన ఆవిష్కరణల్లో మన రాష్ట్రం మరింతగా పురోగమించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధారంగ నిపుణులు, ఐటీ ఆవిష్కర్తలను ఈ సందర్భంగా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 'మేకింగ్ ఏఐ వర్క్ ఎవ్రీ వన్'అనే ఇతివృత్తంతో సదస్సును నిర్వహిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమాజానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో అన్వేషించటమే లక్ష్యంగా జరగనున్న ఈ సదస్సుకు దాదాపు రెండు వేల మంది ప్రతినిధులు హాజరవుతారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఏఐ టెక్నాలజీ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు పరిష్కారాలను అన్వేషించేందుకు ఈ సదస్సు కీలకంగా మారబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో పాటు ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



శనివారం ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లో ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీకి చెందిన ఐఎన్‌ఎస్ టవర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా దేశంలోని సీనియర్ పబ్లిషర్లతో ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, సీఎం ఏక్‌నాథ్ శిండే, ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్, సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి తదితరులు

నాగుపాముకు వైద్యం

వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో ఘటన

కడప అగ్రికల్చర్: పాము అంటేనే ప్రాణాలు తీస్తుందని భయపడతాం .. కనిపిస్తే పరుగులు తీస్తాం.. కానీ గాయపడిన ఓ నాగుపాముకు వైద్యులు చికిత్స అందించి ఊపిరిపోసిన అరుదైన ఘటన వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఒక స్నేక్ క్యాచర్ దెబ్బతగిలిన నాగు పామును కడప కోటిరెడ్డి సర్కిల్‌లోని బహుళార్థ పశు వైద్యశాలకు (వీపీసీ) తీసుకొచ్చాడు. దానిని గమనించిన జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నంద్యాల రాజశేఖర్ సంబంధిత ఏడీ డాక్టర్ ఓఎల్ నేతాజీ, డీడీ డాక్టర్ రంగస్వామికి సమాచారం ఇచ్చారు. వారు నాగుపామును పరిశీలించారు. పాముకు పదునైన ఇనుప వస్తువు తగులుకొని పేగులు బయటకి రావడం గమనించారు. పేగులను లోపలికి తోసి కుట్లు వేసి చికిత్స అందించారు. సాధారణంగా వీపీసీలో పశువులు, కుక్కలు, పిల్లులకు వైద్యసేవలందిస్తారు. అయితే పాముకు వైద్యం అందించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రతి ఒక్కరూ వైద్యులకు అభినందనలు తెలియజేశారు.



విద్యార్థులకు పాఠ్యాంశంగా రాజ్యాంగం

రాష్ట్రపతి, ప్రధానికి భారతీయ సంవిధాన్ ప్రచారక్ దళ్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగం విలువ పాఠశాల స్థాయి నుంచే తెలిపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి, ప్రధానమంత్రికి తెలంగాణలోని నిజామాబాద్‌కు చెందిన భారతీయ సంవిధాన్ ప్రచారక్ దళ్ విజ్ఞప్తి చేసింది. ఐదు నుంచి పదో తరగతిలోపు విద్యార్థులకు రాజ్యాంగాన్ని ఓ పాఠ్యాంశంగా చేర్చాలని శనివారం దళ్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం రాష్ట్రపతి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఆరోగ్య అవగాహనతోపాటు యోగ, ధ్యానం కూడా విద్యార్థులకు నేర్పించాలని ఆయా కార్యాలయాల్లో ఓ వినతిపత్రం అందజేసింది.

పీజీకి 'టెక్నాలజీ' లుక్

- సమూల మార్పుల దిశగా యూజీసీ
- అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- పరిశ్రమలతో కలిసి బోధన ప్రణాళిక
- ఇంజనీరింగ్‌తో సమాన హోదా
- తగ్గుతున్న పీజీ ప్రవేశాలపై యూజీసీ మేధోమదనం
- రాష్ట్రాల ముందుకు యూజీసీ సరికొత్త ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పోస్టు-గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రక్షాళన దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అడుగులు వేస్తోంది. సరికొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన బోధన ప్రణాళికను కూడా సిద్ధం చేస్తోంది. దీనిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలనూ కోరింది. పీజీ కోర్సులకు తగ్గుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేయాలని భావిస్తోంది. ఇంజనీరింగ్ వంటి టెక్నికల్ కోర్సులకు ధీటుగా వీటిని రూపొందించే ఆలోచనలో ఉన్నట్టు రాష్ట్రాలకు వివరించింది. ముఖ్యంగా పారిశ్రామిక భాగస్వామ్యంతో వీటిని తీర్చిదిద్దాలని నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పీజీ కోర్సులు ఉండేలా చూడాలని భావించింది. సాంకేతికత జోడించే అదనపు బోధనాప్రణాళిక, ఫ్యాకల్టీని సమకూర్చుకునే కాలేజీలకే అనుమతులు ఇవ్వాలని కూడా నిర్ణయించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

పీజీపై తగ్గుతున్న ఆసక్తి

డిగ్రీ వరకూ చదివిన విద్యార్థులు పీజీకి అంతగా ఆసక్తి చూపడం లేదు. కేవలం బీకాం కోర్సును చేసిన వాళ్ళు మాత్రమే ఎంకాంను ఎంచుకుంటున్నారు. పీహెచ్‌డీ స్థాయి వరకూ వెళ్ళాలనుకునే వాళ్ళే ఎంఎస్సీ కోర్సును ఎంచుకుంటున్నారు. బీఏ కోర్సుల్లో చేరే వాళ్ళే తక్కువగా ఉంటుంటే, ఎంఏ వరకూ వెళ్ళాలనుకునే వాళ్ళు ఇంకా తక్కువ. గ్రూప్స్, సివిల్స్ రాయాలనుకునే విద్యార్థులు ఇటువైపు వెళ్తున్నారు. ఈ మూడు ప్రధాన కోర్సులకు కలిపి రాష్ట్రంలో 50 వేల కన్వీనర్ కోటా సీట్లు ఉంటే, గడచిన విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులు 20,484 మంది మాత్రమే. అంటే కేవలం 40.96 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 4 లక్షల మంది ఇంటర్ పాసవుతుంటే, వీరిలో 90 వేల మంది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. మరో 20 వేల మంది ఇతర రాష్ట్రాల్లోని డీమ్డ్ వర్సిటీల్లోకి వెళ్తున్నారు. 40 వేల మంది వరకూ ఇంటర్‌తో విద్య ముగించి ఏదో ఒక వృత్తి, ఉద్యోగంలో స్థిరపడుతున్నారు. ఇక బీఏ, బీకాం, బీఎస్సీ సహా ఇతర డిగ్రీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య ఏటా 2.20 లక్షల వరకూ ఉంటుంది. ఇందులోనూ కంప్యూటర్ నేపథ్యం ఉన్న బీకాం, ఆనర్స్ బీఏ వంటి కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. డిగ్రీ తర్వాత ఉన్న పరిజ్ఞానంతో ఏదో ఒక ఉద్యోగంలోకి వెళ్ళడానికి ఇష్టపడుతున్నారు.

ఉపాధికి ఊతం ఇచ్చేలా...

ఎంఎస్సీ డేటా సైన్స్, ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ వంటి కోర్సుల్లో మార్పులు చేస్తున్నారు. వీటిని కూడా పూర్తిగా పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. పీజీలో మొత్తం 48 కోర్సులుంటే, వాటిలో జాగ్రఫీ, ఎంపీఎడ్, టూరిజం, లైబ్రరీ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ కోర్సుల్లో ప్రవేశాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఎంకాం, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఎన్ని మార్పులు చేసినా ఫలితం ఉండటం లేదు. స్టాటిస్టిక్స్‌లో గత సంవత్సరం 417 సీట్లుంటే, కేవలం 358 మంది చేరారు. ఏంఏ రాజనీతి శాస్త్రంలో 639 మంది చేరారు. ఎమ్మెస్సీ మేథ్స్‌లో 1,445కు మించి చేరలేదు. పీజీ కోర్సుల్లో చేరే వాళ్ళల్లో అమ్మాయిలే ఎక్కువ మంది ఉంటున్నారు. దీంతో పరిశ్రమల భాగస్వామ్యంతో పీజీ కోర్సులు నిర్వహించాలని యూజీసీ సూచిస్తోంది. పీజీ తర్వాత పరిశోధన రంగానికి విద్యార్థులు వెళ్ళే సరికొత్త విధానంపై కసరత్తు చేయాలని సూచించింది. దీనిపై వచ్చే విద్యా సంవత్సరంలోగా ప్రణాళిక సిద్ధం చేయాలని యూజీసీ భావిస్తోంది.


పీజీలోని ప్రధాన కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు ...

కోర్సు	2022	2023
ఎంఏ ఇంగ్లిష్	996	1,150
ఎంఏ తెలుగు	1,063	1,092
ఎంకాం	2,179	2,181
ఎమ్మెస్సీ బాటనీ	1,045	1,164
ఎమ్మెస్సీ కెమిస్ట్రీ	2,385	2,188
ఎమ్మెస్సీ గణితం	1,445	1,326
జువాలజీ	1,412	1,416
న్యూట్రిషన్	428	780
ఫుడ్ టెక్నాలజీ	289	231
డేటాసైన్స్	-	231

త్వరలో మరికొన్ని కోర్సులు

వేగంగా విస్తరిస్తున్న ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలుంటున్నాయి. అయితే, అక్కడ పనిచేసే నైపుణ్యం విద్యార్థులకు ఉండటం లేదు దీన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య రంగంలో రోబోటిక్, అనుబంధ వృత్తులను జోడించి కొత్త కోర్సులను రూపొందించాలని నిర్ణయించారు. ఎంఏ విద్యార్థులు కూడా ఈ కామర్స్ వైపు వెళ్లేందుకు వీలుగా కొన్ని కోర్సులు తేవాలనేది యోచన. దీనికి అదనంగా కొన్ని అప్లికేషన్స్ నేర్చుకునే వెసులు బాటు కల్పించబోతున్నారు. విదేశాల్లో కొన్ని యూనివర్సిటీల భాగస్వామ్యంతో బోధన ప్రణాళిక తయారు చేయాలని యూజీసీ భావించింది. ఆన్‌లైన్ కోర్సులను గుర్తించి, వాటికి కూడా గ్రేడ్స్ ఇవ్వాలని భావిస్తున్నారు. మొత్తం మీద వచ్చే ఏడాది ఇవన్నీ అందుబాటులోకి వస్తాయని యూజీసీ వర్గాలు తెలిపాయి.

రోగుల సహాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అవసరమైతే రక్తం ఇస్తాను

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల టౌన్: ఎవరికైనా అత్యవసరంగా 'ఓ నెగెటివ్ రక్తం'అవసరమైతే తనకు సమాచారం అందిస్తే.. ఎప్పుడైనా వస్తానని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ వార్డు, బ్లడ్‌బ్యాంకు, పాథలాజికల్ ల్యాబ్, ఐసీయూ, మెటర్నరీ వార్డు, ఎస్‌ఎన్‌సీయూ, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డు, స్టోర్‌రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. బ్లడ్‌బ్యాంకులో రక్తం నిల్వలపై ఆరా తీసి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.